Pubilshed from Kadapa
PRGI NO : APTEL/25/A1220

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు
Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com




| కడప KADAPA | సంపుటి : 02 | సంచిక : 208 | బుధవారం | జూన్ 3, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ |
|---|---|---|---|---|---|---|---|
| | Vol.No : 02 | Issue No : 208 | Wednesday | 3 JUNE 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/- |

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

## అది దొరవారి సత్రమా..

# దొరల సత్రమా..!






- అక్కడ ఉన్నది రెవెన్యూ కార్యాలయమా...
- లేక కలెక్షన్‌ల కార్యాలయమా...?
- తహశీల్దార్ లు ఉండేది ల్యాండ్ సెటిల్మెంట్ చేయడానికా..
- ఆ ల్యాండ్ సెటిల్మెంట్ ఎవరి కోసం...ఎందుకోసం...
- ముడుపులకోసం పాటా చట్టాన్నే తుంగలో తొక్కినట్లేనా...!
- ఆర్టీఐ రికార్డులనే నాటి నాయుడుపేట ఎమ్మార్వో భేఖాతర్ చేశాడా..
- నిరుపేద దళితుల అసైన్మెంట్ భూమిని దోచిపెట్టరా...
- చట్టవిరుద్ధ ప్రొసీడింగ్స్
- ఆక్రమణదారుల దొంగ అగ్రిమెంట్లకే తహశీల్దార్ పెద్దపీట వేసారా..!
- ప్రాంతం మారినా విచారణ తప్పదంటున్న బాధితులు !
- రికార్డులు తారుమారు చేసిన తహశీల్దార్ తక్షణమే సస్పెండ్ చేయాలంటున్న బాధితులు
- తిరుపతి జిల్లా కలెక్టర్‌కు పక్కా ఆధారాలతో ఫిర్యాదు చేస్తానన్న బాధితుడు






**ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి/ దొరవారి సత్రం :**

తహసీల్దార్ ఒక మండలానికే అధికారి మాత్రమే కాదు..ఆయన కొక మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్.అంటే ఒక న్యాయమూర్తి లాంటి వాడు. సగటు పేదవాడి కి అన్యాయం జరగిందని సంప్రదిస్తే న్యాయమా అది అన్యాయమా అని ఆలోచన చేసి అన్ని విషయాలు తెలుసుకుని బాధితులకు అండగా ఉండడం అన్నది ఒక మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ గా బాధ్యత.అలాంటి విశేష అధికారాలు ఉన్న తహసిల్దార్ లే తప్పుడు పనులను ప్రోత్సహిస్తూ పబ్బం గడుపుకుంటున్నారనే ఆరోపణలతో పాటు కచ్చితమైన ఆధారాలు ఉన్నాయంటే ఇలాంటి అధికారులను ఏమి చేస్తే మార్పు వస్తుందనే చర్చ పేద ప్రజల్లో జరుగుతోంది.

2 పేజీలో..



### కువైట్‌పై దాడులను ఖండించిన ఇయు


- వ్యతిరేకించిన ఇరాన్

టెహ్రాన్ : ఇటీవల ఇరాన్ కువైట్‌పై దాడులు చేసింది. ఈ దాడుల్ని యూరోపియన్ యూనియన్ ఖండించింది. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి దాడులు చేసిందని తీవ్రంగా ఆరోపించింది. అయితే ఇరాన్ ఖండనను ఇరాన్ వ్యతిరేకించింది. ఇయు ప్రకటనపై ఇరాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ సామాజిక మాధ్యమం ఎక్స్ పోస్టులో తీవ్రంగా విమర్శించింది.

- మిగతా 2లో..

### నాకు అనుచరులు వద్దు..

# పార్టీకి నాయకులు కావాలి



- చిన్న పామైనా విషం కక్కుతోంది..
- గొడ్డలి పార్టీని పెద్ద కర్రతో కొట్టాలి
- ఓటర్ల జాబితాపైనా గొడ్డలి పార్టీ విషయంలో అప్రమత్తత అవసరం
- సర్ పై అవగాహన పెంచుకోండి..అప్రమత్తంగా ఉండండి
- ప్రతీ ఓటు మ్యాపింగ్ చేయాలి..అర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటర్ల జాబితాలో ఉండాలి
- కూటమి పార్టీలను సమన్వయం చేసుకుంటూ సర్ పై యాక్షన్ ప్లాన్
- సర్ పై రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు శిక్షణ
- రెండేళ్ల పాలనపై ఈ నెల 25 నుంచి 45 రోజుల పాటు సైకిళ్లపై ఇంటింటి ప్రచారం
- డీఎస్సీ, నంద్యాల ఘటనల్లో అలెర్టుగా ఉండడంతో తోకముడిచారు
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:**

ఓటర్ల జాబితాకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ ప్రక్రియపై ప్రతీ ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని.. అప్రమత్తంగా ఉండాలని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు.

2 పేజీలో..

### ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేయడం

# అత్యంత దురదృష్టకరం

- వైసీపీ అధినేత వైయస్ జగన్

**ప్రజాభూమి ప్రతినిధి,తాడేపల్లి :**

రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం అమలు దాదాపు నిలిచి పోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని పలువురు వైద్యులు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌ను కలిసి ఆం దోళన వ్యక్తం చేశారు. మం గళవారం తాడేపల్లిలోని వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో వైయస్ జగన్‌ను నరసరావుపేట, గుంటూరు ప్రాంతాలకు చెందిన పలువురు వైద్యులు కలిసి రాష్ట్రంలో వైద్య ఆరోగ్య రంగ పరిస్థితులు, రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.



ఈ సమావేశంలో మాట్లాడిన వైద్యులు ఆరోగ్యశ్రీ పథకం సక్రమంగా అమలు కాకపోవడం వల్ల వేలాది మంది పేద రోగులు చికిత్సకు నోచుకోలేకపోతున్నారని తెలిపారు. ఆసుపత్రులకు మంజూరు చేసే ఎల్వోసీలు కూడా పారదర్శకంగా ఇవ్వకుండా, అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న కొన్ని ఆసుపత్రులకే ప్రాధాన్యత ఇస్తున్నారని వివరించారు. ఆరోగ్యశ్రీ పరిధిలో చికిత్స అందించాల్సిన వ్యాధులకు కూడా ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా నిధులు కేటాయిస్తూ, అందులో

- మిగతా 2లో..

### పవన్ కళ్యాణ్

# ఇంటి వద్ద ఉద్రిక్తత..



- భారీగా పోలీసుల మోహరింపు
- హైదరాబాద్‌లో జనసేన సభకు పోలీసుల అనుమతి నిరాకరణ
- గచ్చిబౌలిలో జరగాల్సిన కార్యక్రమానికి శాంతిభద్రతల కారణాలు
- అనుమతి కోరుతూ జనసేన వేసిన పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు
- పవన్ కళ్యాణ్ ఇంటి వద్ద భారీగా మోహరించిన పోలీసులు
- నివాసం వద్దకు చేరుకున్న కార్యకర్తలను అడ్డుకోవడంతో ఉద్రిక్తత

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్ :**

హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నివాసం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జనసేన పార్టీ తలపెట్టిన సభకు పోలీసులు అనుమతి నిరాకరించడంతో, పవన్ తన ఇంటి వద్ద ప్రెస్ మీట్ నిర్వహిస్తారని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయన ఇంటి వద్దకు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు చేరుకోవడంతో పోలీసులు భారీగా మోహరించి వారిని అడ్డుకున్నారు.తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2న గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ సెంటర్‌లో తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ పేరిట ఓ కార్యక్రమం నిర్వహించాలని జనసేన పార్టీ నిర్ణయించింది. సుమారు 2,000 మందితో నిర్వహించే ఈ ఇండోర్ సమావేశానికి అనుమతి ఇవ్వాలని పోలీసులను కోరింది.

2 లో



### కేరళలో రాబోయే రోజుల్లో భారీ వర్షాలు

- ఐఎండి ఆరెంజ్ అలర్ట్ జారీ

న్యూఢిల్లీ : కేరళకు జూన్ 4వ తేదీ నాటికి నైరుతి రుతుపవనాలు వచ్చే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. రుతుపవనాల రాకతో అక్కడ అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. దీంతో జూన్ 2 నుండి 5 వరకు పలు జిల్లాలకు ముందస్తుగా

- మిగతా 2లో..

### రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా

# మార్చడమే లక్ష్యం




- సీఎం రేవంత్ రెడ్డి
- పరేడ్ గ్రౌండ్స్‌లో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు
- ప్రభుత్వ పురోగతిని వివరించిన సీఎం రేవంత్ రెడ్డి
- అన్ని ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారని హర్షం
- 4.5 లక్షల ఇళ్లు నిర్మించాలన్నదే లక్ష్యమని వెల్లడి
- 30 నెలల్లో ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చామన్న సీఎం

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్ :**

ప్రపంచానికే తెలంగాణను గేట్‌వేగా నిలబెట్టాలన్నది తన కల అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దానికి తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంటే మార్గమని తెలిపారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా నిలబెట్టాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. దీనికి ప్రజల అండదండలు, సహకారం కావాలని కోరారు. ప్రజల ఆశీర్వాదంతో ఈ లక్ష్యాన్ని చేరుకుంటామని విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధికి ప్రతిఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాల్లో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు.

2 పేజీలో..

ప్రజాభూమి

బుధవారం, జూన్ 3, 2026



# సంపాదకీయం

## పెట్రోల్ రేషనింగ్ పెడితేనే మేలు !

చమురు మంటలు చల్లారేలా లేవు. ఇప్పటికే వరుసగా నాలుగుసార్లు పెట్రో ధరలను పెంచేశారు. వాణిజ్య సిలిండర్ ధరలు అమాంతంగా పైకి ఎగబాకాయి. పెట్రో సంక్షోభం ఇంకెన్నాళ్లో తెలియదు. అంతర్జాతీయం గా ముడి చమురు ధరలు పెరగడంతో భారత్ లాంటి దేశాలకు గుదిబండగా మారింది. ధరల దాడి ఇప్పట్లో ఆగేలా లేదు. పొదుపు మంత్రం పాటించిన ప్రధాని మోడీ అన్నింటా విఫలం అవుతోంది. పొదుపు ప్రభుత్వంలో కానరావడం లేదు. ధరలను అదుపు చేసే చిత్తశుద్ధి కనిపించడం లేదు. పెట్రో ధరలతో అన్ని వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఉప్పులు, పప్పులు మొదలుకుని అన్నీ పెరుగుతున్నాయి. వంటనూనెల ధరలు సలసల కాగుతున్నాయి. వీటిపై సమీక్షించాల్సిన కేంద్రం మిన్నకుంది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగినా, వాటి డిమాండ్ తగ్గడం లేదు. ఎందుకంటే ప్రతి ఒక్కరికీ పెట్రో, డీజిల్, గ్యాస్ అనివార్యం అయ్యింది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగడంతో వినియోగదారులు వేరే సరుకుల కొనుగోలు తగ్గించి పెట్రో ఉత్పత్తులను కొనుగోలు చేస్తారు. అందుచేత పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగి నప్పుడు వాటి డిమాండ్ తగ్గకపోగా ఇతర సరుకుల డిమాండ్ పడిపోతుంది. దాని ఫలితంగా ఆర్థిక వ్యవస్థ మాంద్యం దిశగా అడుగులు వేస్తుంది. చమురు ఉత్పత్తుల సరఫరా ఎంతగా తగ్గితే అంతగా వాటి ధరలు పెరుగుతాయి. తగ్గిపోయిన సరఫరాకు తగ్గట్టు వాటి డిమాండ్ తగ్గిపోవాలంటే అంత ఎక్కువగా వాటి ధరలు పెరగాలి. అప్పుడు ఆర్థిక వ్యవస్థ అంత తీవ్రంగా మాంద్యంలో కూరుకుపోతుంది. దీనిపై ఆర్‌బిఐ గానీ, కేంద్రం కానీ సమీక్షించి చర్యలకు ఉపక్రమించడం లేదు. పశ్చిమాసియాలో సాగుతున్న యుద్ధంతో ప్రపంచ ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కు దాటేసింది.

ప్రజలపైకి పెరిగిన చమురు భారాలను నెట్టడం అనివార్యంగా అనుసరిస్తున్నారు. ధరలు పెంయడం మినహా మిగతా చర్యలపై కేంద్రంలోని ఏ పాలకులు ఆలోచన చేయడం లేదు. దేశ ఆర్థిక వ్యవస్థ గురించి వారి అవగాహన రాహిత్యం ఇందుకు ఉదాహరణగా చెప్పకోవాలి. చమురు ధరలు పెరగడం అనేది దాని సరఫరా తగ్గినందువలన సంభవించేది కాదు. నిజానికి ఇప్పడు ఒకవైపు యుద్ధం కొనసాగుతున్నా, చమురు నిల్వలు సరఫరాను కొనసాగించగల స్థాయిలోనే ఉన్నాయి. చమురు నిల్వలకు కొరత ఏర్పడబోతుందన్న అంచనాలతో ధరలు పెంచేస్తున్నారు. సరఫరా తగ్గడం, అంతర్ఆజతీయంగా బ్యారెల్ ధరలు పెరగడంతో ఆ భారం ప్రజలపై నెట్టేస్తున్నారు. వాస్తవానికి ఆర్థిక మాంద్యం వల్లే చమురు సరఫరాకు, డిమాండ్‌కు మధ్య సమతూకం ఏర్పడుతుంది. పెట్రో కొరత ఏర్పడినప్పడు విచ్చలవిడి వినయోగాన్ని అదుపు చేయాలి. ప్రధానంగా సంపన్న వర్గాల వినియోగాన్ని నియంత్రించాలి. చమురు దిగుమతులు తగ్గినప్పడు ఆ ప్రభావం వలన వినిమయం కూడా తగ్గిపోయి, ప్రత్యామ్నాయాల వైపు దృష్టి మళ్ళి దేశీయ ఉత్పత్తుల కోసం డిమాండ్ పెరుగుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థ మీద ఈ విధానం ప్రభావం చూపుతుంది. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరిగినప్పడు దేశీయంగా పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచకపోతే ఆ పెట్రో ఉత్పత్తులను దేశీయంగా ఉత్పత్తి చేసేవారు. పంపిణీ చేసేవారు నష్టపోతారు. ఆ నష్టాన్ని ప్రభుత్వం సబ్సిడీ ద్వారా భరించవచ్చు. అప్పడు చమురు దిగుమతులకు మనం డాలర్ల రూపంలో చెల్లించవలసినది 8 శాతం పెరుగుతుంది. పెట్రో ఉత్పత్తుల రేషనింగ్ ద్వారా సంపన్నుల వినిమయాన్ని అదుపు చేస్తే అప్పడు వారి వినిమయం వేరే ఉత్పత్తులవైపు మరలుతుంది. ఉపాధి కూడా పెరగవచ్చు. అంతే కాదు, శ్రామిక ప్రజల కొనుగోలు శక్తి, జీవన ప్రమాణాలు పడిపోకుండా నిలబడతాయి. కేవలం సంపన్నుల వినిమయాన్ని మాత్రమే రేషనింగ్ ద్వారా అదుపు చేస్తే దానివల్లే పెట్రో వినిమయం అవసరమైన మోతాదు మేరకు తగ్గిపోతుందని కూడా చెప్పలేము. ఇది అందరికీ వర్తించాలి. ఇక్కడ మోడీ ప్రకటించిన పొదుపును అందరూ పాటించేలా తప్పనిసరి చేయాలి.

పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచడం గాని, తద్వారా కోట్లాదిమంది ప్రజల మీద భారాలను మోపడం కాని, దేశ ఆర్థిక వ్యవస్థలో మాంద్యం పెరగడానికి దోహదపడుతుంది. పెట్రో ఉత్పత్తుల ధరలు పెరగడంతో, తక్కిన ఉత్పత్తుల వినియోగం బాగా తగ్గిపోయింది. పైగా వినియోగదారులే పెట్రో ధరల పెంపు భారాన్ని కూడా భరించవలసి వచ్చింది. దాంతో సర్వత్రా ద్రవ్యోల్బణ పరిస్థితులు నెలకొన్నాయి.

ఢిల్లీలో కాలుష్యాన్ని కంట్రోల్ చేయడానికి వాహనాలపై ఆంక్షలు విధించారు. ఇప్పడు పెట్రోల్ కోసం కూడా ఇలా అంక్షలు విధించి ప్రజలను భాగస్వాములను చేయాలి. తగిన పద్ధతిలో కట్టుదిట్టంగా దానిని అమలు చేయడం సాధ్యమే. ఇలా చయడంతో పాటు, కాలర్ల అమ్మకాలనపైనా ఆంక్షలు విధించాలి. దీంతో పెట్రో ఆదాతో పాటు, కాలుష్యం కూడా తగ్గగలదు. ఎన్నో ప్రత్యమ్నాయ పద్ధతులను అధ్యయనం చేయాల్సి ఉంది. అప్పడే ధరల భారాన్ని ప్రజలపై పడకుండా చూడవచ్చు. నిల్వలు కరిగిపోకుండా చేయవచ్చు.

## రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడమే లక్ష్యం

అంతకుముందు ఆయన, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం సీఎం జాతీయ జెండాను ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. రెండున్నరేళ్లలో అన్ని ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌పై అభిమానం చూపారని సీఎం రేవంత్ తెలిపారు. ఈ ఆదరణ తమ ప్రభుత్వంపై మరింత బాధ్యతను మోపిందన్నారు. ఏ రాష్ట్రంలోనూ లేని తరహాలో తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. రాచరిక ఆలోచనలను ఓడించి ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు గెలిపించారని వ్యాఖ్యానించారు. 30 నెలల్లో ప్రజల ఆశలు, ఆశయాలను నెరవేర్చడంలో విజయం సాధించామని పేర్కొన్నారు. 2047 విధాన పత్రంలో రైతులకు ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. రాష్ట్రంలో 2.36 కోట్ల టన్నుల పంట దిగుబడులు రావడం గర్వకారణమన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రైతుల నుంచి చివరి గింజ వరకూ కొంటామని పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో జొన్న, మొక్కజొన్న సాగు గణనీయంగా పెరిగినట్లు వెల్లడించారు.

తెలంగాణ హక్కుల సాధన కోసం అన్ని వేదికల్లో పోరాడుతున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్ట్‌కు తిరిగి ప్రాణం పోస్తున్నామని పేర్కొన్నారు. తుమ్మిడిహట్టి నిర్మాణం కోసం మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు. మరోవైపు తెలంగాణ మహిళలు దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. ఆడబిడ్డలను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు రూ.లక్ష కోట్ల రుణాలిస్తామని తెలిపారు. ఇప్పటికే రూ.60 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు అందజేశామన్నారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలు రూ.10 వేల కోట్ల విలువైన ప్రయాణాలు సాగించారన్నారు.

తెలంగాణ సాధన కోసం నిరుద్యోగ యువత పోరాటం చేసిందని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేశారు. ఉద్యోగ నియామక ప్రక్రియను పకడ్బందీగా చేపడుతున్నట్లు తెలిపారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మరోవైపు పేదల జీవన స్థితిగతులు ఎలా ఉంటాయో తనకు తెలుసని తెలిపారు. అందుకే ఇందిరమ్మ ఇండ్ల కోసం రూ.20,400 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. 4.5 లక్షల ఇళ్లు నిర్మించాలన్నది ప్రభుత్వం లక్ష్యమని వెల్లడించారు. ఈ ఏడాది మూడున్న లక్షల ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

## నాకు అనుచరులు వద్దు..
# పార్టీకి నాయకులు కావాలి

టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం సర్ పై జరిగిన రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌కు సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జోనల్ కో-ఆర్డినేటర్లు, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శులు, పార్టీ పరిశీలకులు, బీఎల్‌ఏలు ఈ రాష్ట్ర స్థాయి వర్క్ షాప్‌లో పాల్గొన్నారు. వీరికి సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల్లో ఓటర్ల జాబితాలను ఆధారం చేసుకుని వ్యూహాలు, ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సి ఉంటుందని గుర్తు చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని నా×= ప్రక్రియపై రాష్ట్రస్థాయి నేతలు మొదలుకుని.. గ్రామస్థాయి వరకు ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవడమే కాకుండా.. పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు మాట్లాడుతూ...“మహానాడును వర్చువల్‌గా అద్భుతంగా నిర్వహించుకున్నాం. రెండు రోజుల మహానాడుకు 24.50 లక్షల మంది హాజరయ్యారు. వర్చువల్‌గా మహానాడు ఈ స్థాయిలో నిర్వహించుకోవడం సాధ్యమా అనే అనుమానాలను పటాపంచలు చేస్తూ... సక్సెస్ చేసుకోగలిగాం. ఇప్పుడు పార్టీ యంత్రాంగంపై అతి పెద్ద కీలక బాధ్యత ఉంది. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా సర్ ప్రక్రియ మొదలవుతోంది. ప్రతీ 20-25 ఏళ్లకోసారి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరుగుతుంది. 2002 ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకుని సర్ ప్రక్రియను చేపడుతున్నారు. జులై 14వ తేదీలోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ చేస్తారు. ఈ రెండు సార్లు మ్యాపింగ్ జరిగేలోగా ఓట్ల చేరికలు పరిపూర్ణంగా పూర్తి కావాలి. అవసరమైతే మూడోసారి కూడా ఇళ్లకు వెళ్లి ఓట్ల పరిశీలన జరపాలి. బీఎల్‌ఓలతో పాటు.. మన పార్టీకి చెందిన బీఎల్‌ఏలు కూడా వెళ్లాలి. సర్ ను అందరూ సీరియస్‌గా తీసుకోవాలి... ఎలాంటి నిర్లక్ష్యమూ ఉండకూడదు. ఓట్లు నమోదు చేసుకోవడం ఓటర్ల బాధ్యత. ఓట్ల చేరికలపై ప్రజలకు అవగాహన కల్పించడం రాజకీయ పార్టీగా మన ప్రాథమిక బాధ్యత. ఏ ఎన్నికలకైనా ఓటర్ల జాబితా అనేది చాలా కీలకం. ఓటర్ల జాబితా ఆధారంగానే ఎన్నికల్లో వ్యూహాలు అమలు చేయగలం... ప్రణాళికలు సిద్ధం చేసుకుంటాం. పార్టీ బలంగా ఉంటే... ప్రభుత్వం మరింత బలంగా ఉంటుంది. సర్ పై ప్రతీ రోజూ మానిటర్ చేస్తాం. మన ఓట్లు ఉన్నాయా..? లేవా..? అనేది నిరంతరం చూసుకోవాలి. ఏపీకి చెందిన స్థానికులు వివిధ రకాల కారణాలతో ఇతర ప్రాంతాలకు వెళ్తారు. వారి ఓట్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. వివిధ ప్రాంతాల్లో ఉన్న వాళ్లు పెద్ద ఎత్తున వచ్చి ఓట్లేయడం వల్లే మొన్నటి ఎన్నికల్లో కూటమికి 164 సీట్లు వచ్చాయి.”అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**కూటమి పార్టీల సమన్వయం ముఖ్యం**

సర్ ప్రక్రియ పర్యవేక్షణలో కూటమి పార్టీలను కూడా సమన్వయం చేసుకుని వెళ్లాలి. ఎన్నికలప్పుడే మిత్రపక్షాలతో కలుస్తాం..మిగిలిన రోజుల్లో పట్టించుకోం అంటే కుదరదు. ప్రభుత్వంలోనే కాదు.. అన్ని కార్యక్రమాల్లోనూ జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకోవాలి. నా రాజకీయ చరిత్రలో 2024 ఎన్నికల్లో సాధించినటు వంటి ఘన విజయం ఎప్పుడూ చూడలేదు. కొత్త వారికి టిక్కెట్లు ఇచ్చినా.. కూటమి పార్టీ అభ్యర్థి అనగానే ప్రజలు, కార్యకర్తలు ఓటేశారు. పార్టీల మధ్య సమన్వయానికి సర్ మొదటి టెస్ట్. చాలా మంది అనుచరులను కోరుకుంటారు... కానీ నేను నాయకులను కోరుకుంటాను. సమర్థవంతమైన నాయకత్వం ఉంటే పార్టీకి బలం పెరుగుతుంది. 2024 ఎన్నికల ముందు పట్టభద్రుల ఎమ్మెల్సీలు గెలిచాం.

పూర్తిస్థాయిలో గ్రౌండ్ వర్క్.. టెక్నికల్ వర్క్ చేసి అద్భుత విజయాన్ని నాటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో చూపించాం. గ్రాడ్యుయేట్ల ఎన్నికల్లో ఒకప్పుడు పోటీ చేసేవాళ్లం కాదు. కానీ నాడు ఆ ఎన్నికల్లో పోటీ చేశాం.. గెలిచాం.. అదీ మన నెట్ వర్క్ గొప్పదనం. సర్ విషయంలోనూ అదే స్థాయిలో కష్టపడి పని చేయాలి. పార్టీలో వివిధ కీలక అంశాలపై చర్చలు జరగాలి.. కార్యకర్తలు చర్చల్లో భాగస్వామ్యం కావాలి. అధికార ఫలితాలు కార్యకర్తలకు అందించాలి. క్షేత్రస్థాయిలో కొన్నిచోట్ల మిత్రపక్షాలు ఉండకపోవచ్చు. అయినా వారిని కూడా కలుపుకుని వెళ్లాలి. 2024 ఎన్నికలకంటే ఎక్కువగా మిత్రపక్షాలతో పని చేయాలి. మిత్రధర్మాన్ని ప్రతి నేతా, ప్రతి కార్యకర్తా పాటించాల్సిందే. సర్ పై మూడు పార్టీలతో త్వరలో కో-ఆర్డినేషన్ కమిటీ కూడా వేస్తాం. దీనికి సంబంధించి త్వరలో ఓ ఎన్డీఏ సమావేశం నిర్వహించుకుంటాం.”అని టీడీపీ అధినేత వెల్లడించారు.

**సైకిల్ పవర్ చూపుదాం..ప్రజలకు చేరువవుదాం.** “జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు ఇంటింటి ప్రచారం చేపట్టాలి. రెండేళ్లల్లో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలి. 45 రోజుల్లో ఇంటింటి ప్రచారం చేపట్టాలి... పెద్ద ఎత్తున ప్రజల్లోకి వెళ్లాలి. ఈ ఇంటింటి ప్రచారంలో నేను కూడా పాల్గొంటాను. సైకిళ్ల మీద వెళ్లి ప్రజలను కలవాలి. వీలుంటే ఈ-సైకిళ్లపై ప్రచారం చేపట్టాలి. నేను కూడా సైకిల్ మీదే ప్రచారం చేస్తాను. ప్రధానిగా మోదీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్నారు.. నేను నాలుగోసారి సీఎంగా ఉన్నాను. ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. వీటితో పాటు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సాధించిన ప్రగతిపై పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాలి. టీడీపీ అందరికి చెందిన పార్టీ... తెలుగు వాళ్ల పార్టీ. ప్రతీ వర్గాన్ని మనం ఓన్ చేసుకోవాలి. సోషల్ రీ-ఇంజనీరింగ్‌తో పదవులు, సీట్ల కేటాయింపులు చేశాం. నామినేటెడ్ పదవుల్లోనూ.. పార్టీ పదవుల్లోనూ సోషల్ రీ-ఇంజనీరింగ్ చేపడుతున్నాం. కార్యకర్తల సాధికారత గురించి ఆలోచించాలి... కార్యకర్తల సంక్షేమం కోసం ప్రత్యేక విభాగాన్ని టీడీపీ తప్ప ఏ పార్టీ పెట్టలేదు. చనిపోయిన కార్యకర్తల కుటుంబాలను ఆదుకుంటున్నాం. చనిపోయిన కార్యకర్తలకు రూ. 5 లక్షల ప్రమాద బీమా ఇస్తున్నాం... పిల్లల చదువుకు ప్రత్యేకంగా స్కూల్ ఏర్పాటు చేశాం. కార్యకర్తల పిల్లలకు నైపుణ్య శిక్షణ ఇచ్చి మంచి ఉద్యోగాలకు సిఫార్సులు చేస్తున్నాం. కార్యకర్తల ఆర్థిక సాధికారత కోసం ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట్ పేరుతో కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ప్రతీ కార్యకర్త ఆరోగ్యంగా ఉండడానికి ఎంతైనా ఖర్చు చేస్తాం. మన కార్యకర్తలను ఆదుకునేందుకు పార్టీ చర్యలు తీసుకుంటుంది... అలాగే ప్రతీ నాయకుడు ఇదే విధంగా ఆలోచన చేయాలి. మనకు తెలిసి కానీ తెలియకుండా కానీ తప్పులు జరగకూడదు.. అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకోవాలి. గత ప్రభుత్వంలో విధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెడుతున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పోయిన బ్రాండ్ ను మళ్లీ తెచ్చాం. పోలవరం ప్రాజెక్టు ఆగిపోతుందని అందరూ భయపడ్డారు.. కానీ మళ్లీ ప్రాజెక్టును ట్రాక్‌లో పెట్టాం. సంక్షేమం అందిస్తున్నాం... అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నాం. ఈ నెల 21వ తేదీన యోగా డేను అమరావతిలో 25 వేల మందితో నిర్వహిస్తాం. యోగా మన జీవన విధానంలో భాగం కావాలి.”అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

**వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా మిగలొద్దు..**

“చిన్న పామైనా పెద్ద కర్రతో కొట్టాలి... గొడ్డలి పార్టీ విషయంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఎన్నికల్లో హామీ ఇచ్చి.. మొదటి సంతకం పెట్టి మెగా డీఎస్సీ నిర్వహించాం. మెగా డీఎస్సీ జరగకూడదని 241 కేసులు వేసి అడ్డుకున్నారు. కానీ వాటిని ఎదుర్కొని అత్యంత పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించి.. నియామకాలు పూర్తి చేశాం. పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. గట్టిగా కౌంటర్లు ఇస్తే.. ఇప్పుడు తోకముడిచారు. నంద్యాలలో ఓ వైసీపీ కార్యకర్తే వైఎస్ విగ్రహం తల తీసేశారు.. పోలీసులు నిమిషాల్లో పట్టుకున్నారు. వైసీపీ కార్యకర్తను గుర్తించకుంటే టీడీపీపై నెపం నెట్టేవారు. వివేకా హత్య అనేది ఓ కేస్ స్టడీ. చిన్నపామునైనా పెద్ద కర్రతో కొట్టాలి... లేకుంటే విషం చిమ్ముతుంది... దీన్ని ప్రతీ ఒక్కరూ నిరంతరం గుర్తు పెట్టుకోవాలి. గొడ్డలి పార్టీతో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. నేను ఎన్నో పోరాటాలు చేశాను.. కానీ నీచులతో ఎప్పుడూ పోరాటాలు చేయలేదు. పార్టీ పెట్టినప్పటి నుంచి హిందూపురం, కుప్పం సహా ఇంకొన్ని నియోజకవర్గాల్లో టీడీపీ గెలుస్తూనే ఉంది..ఇలాంటి నియోజకవర్గాల సంఖ్య పెరగాలి. కొత్తగా ఎమ్మెల్యేలు అయిన వారు వన్ టైమ్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదు... మళ్లీ మళ్లీ గెలవాలి. అభివృద్ధి, సుపరిపాలన ద్వారా ఓట్లు పడతాయి. ప్రజా ప్రతినిధుల వ్యవహార శైలి ద్వారా ఓట్లు పెరుగుతాయి.. తగ్గుతాయి. ప్రజల కోసం పని చేసినా నోరు అదుపులో పెట్టుకోకుంటే నష్టమే జరుగుతుంది. కార్యకర్త మొదలుకుని నాయకుడి వరకు ప్రతి ఒక్కరికీ క్యారెక్టర్, ట్రస్ట్ అనేది చాలా ముఖ్యం.”అని టీడీపీ అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు.

## అది దొరవారి సత్రమా...
# దొరల సత్రమా...!




చట్టాన్ని రక్షించి, పేదలకు అండగా నిలవాల్సిన ఒక బాధ్యతాయుతమైన ప్రభుత్వ అధికారి.. అవినీతి బంధాలకు లోనై, ఆక్రమణదారుల దగ్గర భారీగా ముడుపులు పుచ్చుకుని, చట్టాలనే తుంగలో తొక్కిన వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాయుడుపేట మండల తహశీల్దార్‌గా పనిచేసి, ప్రస్తుతం దొరవారిసత్రం మండలానికి బదిలీపై వెళ్లిన తహసీల్దార్ నాయుడుపేటలో చేసిన ఒక భూ అక్రమ ప్రొసీడింగ్ వ్యవహారం ఇప్పుడు జిల్లా రెవెన్యూ వర్గాల్లో తీవ్ర సంచలనంగా మారింది.

ఆంధ్రప్రదేశ్ అసైన్‌మెంట్ భూములను (నిషేధ చట్టం-1977 - పి ఓ టి యాక్ట్ ప్రకారం.. నిరుపేదలకు ప్రభుత్వం కేటాయించిన అసైన్మెంట్ భూములను ప్రైవేట్ వ్యక్తులు కొనడం గానీ, అగ్రిమెంట్లు రాసుకోవడం గానీ చట్టరిత్యా పూర్తిగా నేరం. ఆ పత్రాలకు చట్టబద్ధత సున్నా అని సాక్షాత్తూ సుప్రీంకోర్టు సైతం స్పష్టం చేసింది. అయినప్పటికీ, నాయుడుపేట మండలం బీరదవాడ గ్రామంలోని సర్వే నెంబర్ 67 లో గల ఒక నిరుపేద కుటుంబానికి చెందిన 1 ఎకరా 20 సెంట్లు భూమిపై కొందరు ఆక్రమణదారులు దొంగ డాక్యుమెంట్లు సృష్టించారు. దీనిపై బాధితులు ఆ నాటి తిరుగులేని 10-1 కాపీ, ఆర్‌ఓఆర్, పాత అడంగల్ వంటి పక్కా ప్రభుత్వ రికార్డులను కళ్లముందు పెట్టినా.. అప్పటి నాయుడుపేట తహశీల్దార్ వాటిని కనీసం పట్టించుకోలేదు. అవతలి ఆక్రమణదారులు తెచ్చిన, చట్టం ముందు చెల్లని పాత ప్రైవేట్ అగ్రిమెంట్లు, దొంగ చలానాలను చూసి.. “అవతలి వాళ్లే కరెక్ట్” అనేలా ఒక తప్పుడు, అక్రమ ప్రొసీడింగ్ రిపోర్టును జారీ చేసి తన అవినీతి బుద్ధి చాటుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇంకా అచ్చర్యకర విషయం ఏంటంటే.. సదరు భూమి మార్పిడి జరిగినట్లు కార్యాలయంలోని డి-రిజిస్టర్ నందు ఎటువంటి నమోదు లేదు, అలాగే అసైన్‌మెంట్ కమిటీ ఆమోదం లేదు అని అదే నాయుడుపేట తహశీల్దార్ కార్యాలయం ఆర్టీఐ ద్వారా అధికారికంగా లిఖితపూర్వక నివేదిక ఇచ్చింది. సొంత కార్యాలయం ఇచ్చిన రికార్డులనే బేఖాతరు చేస్తూ, ఆక్రమణదారుల నుంచి అందిన భారీ ముడుపుల కోసమే తహశీల్దార్ ఆ తప్పుడు ప్రొసీడింగ్ లెటర్ ఇచ్చారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.చట్టబద్ధంగా విచారణ జరపాల్సిన అధికారి, దళారీ లాగా వ్యవహరించి బాధితులను నట్టేట ముంచారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

నాయుడుపేటలో ఈ రకమైన ల్యాండ్ సెటిల్మెంట్లు పూర్తి చేసి, ఏమీ తెలియనట్లు ప్రస్తుతం దొరవారిసత్రం లో తహశీల్దార్‌గా వచ్చినా ఆక్కడ చేసిన అవినీతి అక్రమాలపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని బాధితులు వేడుకొంటున్నారు చట్టాన్ని ఉల్లంఘించి, రికార్డులను తారుమారు చేస్తూ తప్పుడు ప్రొసీడింగ్స్ ఇచ్చిన దొరవారిసత్రం తహశీల్దార్ పై విజిలెన్స్ అండ్ విచారణ జరిపి న్యాయ అన్యాయాలను నిగ్గు తేల్చి తక్షణమే పటిష్ఠమైన చర్యలను తీసుకోవాలని త్వరలో తిరుపతి జిల్లా కలెక్టర్ కి పక్కా ఆధారాలతో ఫిర్యాదులు ఇవ్వనున్నట్లు బాధిత ప్రజలు తెలియజేస్తున్నారు. అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఇలాంటి అధికారుల తీరుపై జిల్లా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

## ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేయడం
# అత్యంత దురదృష్టకరం



అవినీతి, కమీషన్లకు అవకాశం కల్పిస్తున్నారని వైయస్ జగన్ దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా స్పందించిన వైయస్ జగన్, పేదవాడికి కూడా కార్పొరేట్ స్థాయి వైద్యం అందాలన్న మహోన్నత లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకాన్ని నిర్వీర్యం చేయడం అత్యంత బాధాకరమని అన్నారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ పరిధిని విస్తరించి, మరిన్ని వ్యాధులను చేర్చడంతో పాటు చికిత్స అనంతరం విశ్రాంతి కాలానికి ఆర్థిక సహాయం, రోగులకు మెరుగైన సేవలు అందించేలా అనేక సంస్కరణలు చేపట్టామని గుర్తు చేశారు.అలాగే రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడం, కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు, గ్రామ స్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు, నాడు–నేడు ద్వారా ఆసుపత్రుల అభివృద్ధి వంటి కార్యక్రమాలతో వైద్య ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని తెలిపారు. ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీ తరఫున ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు బాధితులకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. వైఎస్సార్సీపీ డాక్టర్స్ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వైద్యులు కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, శేషిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, హనిమిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, చంద్రకిరణ్, వసంత, చెన్నారెడ్డి, కొండారెడ్డి, జయభారత్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, క్రాంతికుమార్, వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కేరళలో రాబోయే రోజుల్లో భారీ వర్షాలు

మంగళవారం ఐఎండి ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో మలప్పురం, కొజికోడ్, వయనాడ్ జిల్లాలకు ఐఎండి ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఇక మిగిలిన 11 జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించింది.కాగా, తిరువనంతపురం, కొల్లాం మినహా దాదాపు అన్ని జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షం, ఈదురు గాలులతో కూడిన ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని కూడా అంచనా వేసింది. జూన్ 2–6 మధ్య రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షం కురుస్తుంది. గంటకు 40 కి.మీ నుంచి 50 కి.మీ వేగంతో బలమైన గాలులు వీస్తాయని ఐఎండి అంచనా వేసింది.భారత వాతావరణ శాఖ బుధవారం నాలుగు జిల్లాలకు, గురువారం ఎనిమిది జిల్లాలకు, శుక్రవారం ఏడు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. మిగిలిన జిల్లాలను ఎల్లో అలర్ట్‌గా ప్రకటించింది. 11– 20 సి.మీ మధ్యలో కురిసిన వర్షపాతాన్ని ఆరెంజ్ అలర్ట్‌గా, 6–11 సి.మీ మధ్య కురిసిన వర్షపాతాన్ని ఎల్లో అలర్ట్‌గా సూచిస్తుంది.

## కువైట్‌పై దాడులను ఖండించిన ఇయు

కాగా, ‘పొరుగు దేశాల్లోని స్థావరాల నుండి అమెరికా జరిపిన దురాక్రమణకు వ్యతిరేకంగా తమను తాము రక్షించుకునేందుకు ఆత్మరక్షణ హక్కును వినియోగించుకున్నందుకు ఇరాన్‌ను నిందిస్తూ యూరోపియన్ యూనియన్ ప్రకటన చేసింది. ఈ ప్రటకన పక్షపాత ధోరణికి ఒక చక్కటి ఉదాహరణ. ఇది కపటమైనది.. నిర్లక్ష్యపూరితమైనది. తాను ఎప్పటినుంచో సమర్థిస్తున్నామని చెప్పుకుంటున్న చట్టబద్ధ పాలనకు, ఐక్యరాజ్యసమితి చార్టర్ సూత్రాలకు ఇయు కట్టుబడి ఉండాలి. చట్టవిరుద్ధమైన దాడులకు ప్రతిస్పందించేవారిని నిందిస్తూ, దురాక్రమణదారులను బుజ్జగించడం అది మానుకోవాలి’ అని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ సోమవారం ఎక్స్‌పోస్టులో పేర్కొన్నారు.

## పవన్ కళ్యాణ్ ఇంటి వద్ద ఉద్రిక్తత..

అయితే, శాంతిభద్రతల సమస్యలు, ట్రాఫిక్ అంతరాయం, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల వంటి కారణాలను చూపుతూ సైబరాబాద్ పోలీసులు ఈ సభకు అనుమతి నిరాకరించారు. పోలీసుల నిర్ణయాన్ని సవాలు చేస్తూ జనసేన పార్టీ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ కూడా చుక్కెదురైంది. మంగళవారం విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం జనసేన పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో పవన్ కళ్యాణ్ తన నివాసం నుంచే సాయంత్రం 4:30 నుంచి 5:30 గంటల మధ్య మీడియా, పార్టీ నేతలతో మాట్లాడతానని ప్రకటించారు. ఈ సమాచారంతో కార్యకర్తలు జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి తరలిరాగా, పోలీసులు వారిని నిలువరించారు. దీంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కార్యకర్తలు ఆందోళనకు దిగడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది.

ప్రజాభూమి

ఎన్టీఆర్, కృష్ణా

బుధవారం, జూన్ 03, 2026



# కలసి యోగా చేద్దాం.. యోగాంధ్రను నిలబెడదాం..

**- ఈ నెల 7 నుంచి పండగలా యోగా ప్రత్యేక కార్యక్రమాలు**
**- సమష్టిగా కృషిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం**
**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:

ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 7వ తేదీ నుంచి 14 రోజుల పాటు జిల్లాస్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు పండుగ వాతావరణంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. యోగాంధ్ర-2026 కార్యక్రమాలపై కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన మంగళవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గతేడాది యోగాంధ్రను విజయవంతంగా నిర్వహించి.. అందరికీ ఆదర్శంగా నిలిచామని, ప్రపంచ రికార్డులు సైతం సొంతం చేసుకున్నామని, అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు వైద్య ఆరోగ్యం, ఆయుష్, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్, మునిసిపల్, విద్య, ప కం, యువజన సంక్షేమం, క్రీడలు తదితర శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేయాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా థీమాటిక్ యోగాలో భాగంగా మన జిల్లాలో పోలీస్ థీమ్‌తో యోగా కార్యక్రమం జరగనుందని తెలిపారు. టూరిజం యోగాలో భాగంగా ఇబ్రహీంపట్నం మండలం, పవిత్ర సంగమం వద్ద, హరిత బెరం పార్కులో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాల . జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, ఆసుపత్రులు, పార్కులు, మైదానాలు తదితర ప్రాంతంలో యోగా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశిం చారు. మునిసిపల్, అర్బన్ ప్రాంతంలోని ప్రతి పార్కులోనూ యోగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కూడళ్ల వద్ద స్క్రీన్లపై యోగా ప్రోటోకాల్‌కు సంబంధించిన వీడియోలను ప్రదర్శిం చాలని సూచించారు. యోగా ఆరోగ్యకరమైన జీవనశైలికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొంటూ.. ప్రజలు, ప్రజాప్రతినిదులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా కృషిచేసి కార్యక్రమాలను విజయవంతం చేద్దామని పిలుపు నిచ్చారు.



అధికారులతో కలిసి 45 నిమిషాల కామన్ యోగా ప్రోటోకాల్‌కు సంబం ధించిన పోస్టర్లను కలెక్టర్ లక్ష్మీశ ఆవిష్కరించారు. వెన్యూ మ్యాపింగ్, పర్యవేక్షణ, ప్రజా భాగస్వామ్యం, శాఖల మధ్య సమన్వయంపై జిల్లాస్థాయి కమిటీ ప్రత్యేకంగా దృష్టిసారించాలని ఆదేశించారు.సమావేశంలో జిల్లా ఆయుష్ అధికారి డా. వై.రత్న ప్రియదర్శిని, డా. ఎన్ఆర్ఎస్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ డా. బుల్లయ్య, డా. ఎఎల్ గవర్నమెంట్ ఆయుర్వేదిక్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. పి.జగదీష్, వైద్యాధికారులు డా. సుకన్య, డా. పద్మజ, డా. లలిత, డా. వాణి, డా. విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



# మాతా శిశు ఆరోగ్య సేవల్లో జిల్లా రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలి డీఎంహెచ్‌వో పి. యుగంధర్

ఘనంగా జిల్లా స్థాయి ఆశా దినోత్సవంగర్భిణుల రక్షణే ధ్యేయం
– ఎంసిపి (తల్లీ పిల్లల సంరక్షణ) కార్డు నిర్వహణ తప్పనిసరి100 శాతం రోగనిరోధక టీకాల (ఇమ్యునైజేషన్) లక్ష్య సాధనకు పిలుపు

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

జిల్లాలో మాతృ మరణాలు, శిశు మరణాల తగ్గింపే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తూ, మాతా శిశు ఆరోగ్య సేవల అమలులో కృష్ణా జిల్లాను రాష్ట్రానికి దిక్సూచిగా నిలిపేం దుకు ఆరోగ్య సిబ్బంది అందరూ సమిష్టిగా కృషి చేయాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి (DM&HO) డాక్టర్ పి. యుగంధర్ పిలుపునిచ్చారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో యుగంధర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఆశా దినోత్సవ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో జిల్లా రోగనిరోధక టీకాల అధికారి (DIO) డాక్టర్ ప్రేమ్‌చంద్, మాతా శిశు ఆరోగ్య నోడల్ అధికారి డాక్టర్ నిరీక్షణ, పట్టణ వైద్య అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొ న్నారు.తల్లీ పిల్లల సంరక్షణ కార్డు ఒక పవిత్ర గ్రంథంఈ సందర్భంగా డీఎంహె చ్‌వో మాతా శిశు సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. అర్హులైన జంటల (ఎలిజిబుల్ కపుల్స్) వివరాలను సక్రమంగా నవీకరించాలని, ప్రతి గర్భిణికి సంబంధించిన తల్లీ పిల్లల సంరక్షణ (MCP) కార్డును అత్యంత ప్రాముఖ్యతతో నిర్వహించాలని సూచించారు. ఈ కార్డు తల్లికి, ఆరోగ్య సిబ్బందికి ఒక పవిత్ర గ్రంథంలాంటిదని పేర్కొన్నారు.జూన్ థీమ్ డయేరియా (విరేచనాలు) నివారణజూన్ నెల ఆశా దినోత్సవ ఇతివృత్తం (థీమ్) అయిన డయేరియా నివారణ మరియు నిర్వహణ పై ఆశాలు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో సూచించారు. ఓఆర్ఎస్, జింక్ మాత్రల వినియోగం, చేతుల పరిశుభ్రత, పారిశుద్ధ్యం, సురక్షిత తాగునీరు మరియు పిల్లలకు సరైన పోషకాహారం అందించడంపై అవగాహన పెంచాలన్నారు.100 శాతం టీకాల లక్ష్యం – హెచ్‌పీవీ వ్యాక్సిన్ పొడిగింపుజిల్లా రోగనిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రేమ్‌చంద్ మాట్లాడుతూ, ఒక్క చిన్నారి కూడా టీకాలకు దూరం కాకుండా 100 శాతం లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ (HPV) వ్యాక్సినేషన్ ప్రత్యేక ప్రచారాన్ని మరో 90 రోజుల పాటు పొడిగించినందున, 15 సంవత్సరాలు నిండిన ప్రతి బాలికకు సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (PHC) లేదా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో (UPHC) ఈ టీకా అందేలా చూడాలన్నారు.ఆరోగ్య సిబ్బందికి ముఖ్య సూచనలుప్రతి ఆశా కార్యకర్త వద్ద గర్భ నిర్ధారణ కిట్లు అందుబాటులో ఉండాలి.ఇ-ఆశా మొబైల్ యాప్‌లో అర్హులైన జంటల గుర్తింపు, ఐరన్ మరియు విటమిన్-ఏ పంపిణీ, నవజాత శిశువుల గృహ సందర్శనలు (HBNC & HBYC), గ్రామ ఆరోగ్య పారిశుద్ధ్య పోషణ దినోత్సవం (VHSND) కార్యకలాపాలను సకాలంలో నమోదు చేయాలి.జూన్ నెలలో వచ్చే ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం, ప్రపంచ రక్తదాతల దినోత్సవం, అంతర్జాతీయ యోగా దినోత్సవం వంటి సందర్భాలలో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి.నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుఆరోగ్య కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం లేదా వెనుకబడిన పనితీరును తీవ్రంగా పరిగణిస్తామని డీఎంహెచ్‌వో యుగంధర్ హెచ్చరించారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రతి ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా పనిచేసి జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని కోరారు.




# పేర్ని నానీ... మెగా డీఎస్సీపై విషప్రచారం మానుకో..

రాజకీయ ఉనికి కోసమే అభ్యర్థుల్లో గందరగోళం: టీడీపీ నేతల ఆగ్రహం
పేకాట ఆడేవారికి ఉద్యోగాలిచ్చినట్లు నిరూపిస్తావా..? సవాల్ విసిరిన కూటమి నాయకులు

మచిలీపట్నం టీడీపీ కార్యాలయంలో ఘాటుగా ప్రెస్ మీట్

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

మెగా డీఎస్సీపై వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని చేస్తున్న విష ప్రచారంపై మచిలీపట్నం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేవలం తన రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే పేర్ని నాని లేనిపోని అబద్ధాలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. గత రెండు మూడు రోజులుగా డీఎస్సీ నియామకాలపై ఆయన చేస్తున్న సత్యదూర ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.మంగళవారం ఉదయం స్థానిక నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ వైస్ ఛైర్మన్ పంచపర్వాల కాశీవిశ్వనాథం (చంటి), టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బచ్చుల అనిల్ తదితరులు మాట్లాడారు.నోటికి హద్దు అదుపు లేదు!"ఏడాది క్రితం పూర్తి పారదర్శకంగా డీఎస్సీ నిర్వహిస్తే... నేడు పేర్ని నాని మీడియా ముందుకు వచ్చి అవినీతి, అక్రమాలు అంటూ అసత్య ప్రచారం చేయడం సిగ్గుచేటు. నోటికి హద్దు పద్దు లేకుండా మాట్లాడుతున్నారు.

పేకాట ఆడే వాళ్లకి డీఎస్సీ ఉద్యోగాలు ఇచ్చామంటున్న పేర్ని నాని... దాన్ని నిరూపించగలరా? ఆ దమ్ము ఆయనకు ఉందా?" అని టీడీపీ నేతలు సవాల్ విసిరారు.అధికార దాహంతో మతిభ్రమించింది..అధికారానికి దూరం కావడంతోనే పేర్ని నానికి మతిభ్రమించి మాట్లాడుతున్నాడని కూటమి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో టీటీడీ టికెట్లు అమ్ముకుంటున్నారని చేసిన ఆరోపణలను కూడా నాని నిరూపించగలరా అని ప్రశ్నించారు. తన అనుకూల మీడియా ద్వారా ప్రభుత్వంపై విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. పేర్ని నాని లాంటి వైకాపా నేతల మాయమాటలను, కల్లబొల్లి కబుర్లను నమ్మే స్థితిలో ప్రజలు లేరని హితవు పలికారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మరోసారి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. టీడీపీ నేతల ముఖ్య విమర్శలు - డిమాండ్లు:మెరిట్ ఆధారంగానే నియామకాలు: మెగా డీఎస్సీలో ఎలాంటి అవకతవకలు జరగలేదు. పూర్తిగా మెరిట్ ఆధారంగానే అర్హులైన అభ్యర్థులకు నియామకాలు జరిగాయి.వైసీపీది తుగ్లక్ చరిత్ర: గత వైసీపీ ప్రభుత్వంలో బ్రాందీ షాపుల దగ్గర ఉపాధ్యాయులను కాపలా పెట్టిన తుగ్లక్ చరిత్ర వారిది. అలాంటి వారు నేడు విద్యావ్యవస్థ గురించి మాట్లాడటం హాస్యాస్పదం.వారిని విమర్శించే స్థాయి నీకు లేదు: రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లను విమర్శించే స్థాయి పేర్ని నానికి లేదు.సమావేశంలో పాల్గొన్నవారు:ఈ ప్రెస్ మీట్‌లో మాజీ కార్పొరేటర్లు దేవరపల్లి అనిత, దింటకుర్తి సుధాకర్, అరిసేపల్లి గ్రామ టీడీపీ ఇన్ ఛార్జ్ అమ్మిరెడ్డి శివయ్య మరియు ఇతర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూటమి సర్కార్ ది భజన పురాణం.. రైతన్నది కన్నీటి ప్రయాణం

**ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయినా రైతుకు పూర్తిగా అందని పెట్టుబడి సాయం..**
**తుఫాన్ నష్టపరిహారానికీ దిక్కేది?**
**మహానాడులో పరిశ్రమల ముచ్చట్లే తప్ప, రైతుల కష్టాలు పట్టవా?**
**- మీడియా సమావేశంలో ...మచిలీపట్నం మండల రైతు విభాగ అధ్యక్షులు గడిదేశి రాజు నిప్పులు**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతాంగాన్ని పూర్తిగా విస్మరించిందని, చంద్రబాబు, లోకేష్‌లపై భజనలు చేయడం మానుకొని దేశానికి అన్నం పెట్టే రైతుల కష్టాలను తీర్చాలని వైఎస్ఆర్సీపీ నార్త్ మండల రైతు అధ్యక్షుడు గడిదేశి రాజు డిమాండ్ చేశారు. మండల సౌత్ వైఎస్ఆర్ పార్టీ అధ్యక్షులు జన్ను రాఘవరావు మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు సకాలంలో అందించి రైతును కాపాడాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారుజిల్లా కార్యదర్శి రమేష్ బాబు , మాట్లాడుతూ గత జగన్ ప్రభుత్వంలో పచ్చి రొట్టె సేంద్రియ ఎరువులు సబ్సిడీ కింద రైతుకి అందించేవారు ప్రస్తుత ప్రభు త్వం సకాలంలో సబ్సిడీ ద్వారా రైతుల కు సేంద్రియ ఎరువులు అరకొ రగా అందించడం తగదన్నారుఈ సంద ర్భంగా నార్త్ మండల రైతు అధ్య క్షులు గడిదేశి రాజు మాట్లాడిన ము ఖ్యాంశాలు



హామీల అమలులో దగా.. పెట్టుబడి సాయానికి మంగ ళం మొదటి ఏడాది మొండి చేయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా రైతును కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. మొదటి సంవత్స రంలో రైతుకు పెట్టుబడి సాయం కింద ఇవ్వాల్సిన డబ్బులను ఇవ్వకుండా పూర్తిగా ఎగ్గొట్టారు.రెండో ఏడాది మోసం రెండవ సంవత్సరంలో కేంద్రం ఇచ్చేది కాకుండా రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ. 20,000 ఆర్థిక సాయం చేస్తామని చెప్పి, వాటిని కూడా పూర్తిస్థాయిలో ఇవ్వకుండా చేతులెత్తేశారు.

గిట్టుబాటు ధర కరవు: గత రెండేళ్లుగా సార్వ పంటకు సంబంధించిన వేరుశనగ, మినపకాయ పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. దాల్వా పంట సాగుకు సైతం అనుమతులు ఇవ్వకుండా రైతులను ఇబ్బందుల పాలు చేశారు.మచిలీపట్నం మండల తీర ప్రాంతంలో సుమారు 20 వేల ఎకరాల్లో సాగు జరుగుతుంటే.. కేవలం 130 క్విం టాల జీలగ విత్తనాలు, 100 కేజీల పిల్లిపస్సరా మాత్రమే ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు.ఎకరానికి 20 కేజీల చొప్పున పిచికారి చేసి నా ఈ విత్తనాలు కేవలం 650 ఎకరాలకు మాత్ర మే సరిపోతాయని, మరి మిగిలిన 13,500 ఎకరాల రైతులకు ఎప్పుడు పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. దీనిపై అధికారులను, పాల కులను అడిగితే సమాధానం చెప్పే దిక్కు లేదన్నారు.

మహానాడు సాక్షిగా వ్యవసాయ శాఖ మంత్రి వైఫల్యం సాక్షాత్తు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు మహానాడు వేదికగా పరిశ్రమల గురించి మాట్లాడారే తప్ప, రాష్ట్రంలో రైతులు పడుతు న్న ఇబ్బందులను పట్టించుకోలేదని విమ ర్శించారు. మహా నాడు సాక్షిగా రైతులకు కింది హామీలలో దేనిపైనా స్పష్టత లేదు,సకాలంలో ఎరువులు అంది స్తామనే భరోసా లేదు. సాగునీటి కాలువల పూడికతీతపై స్పందన లేదు.పంటలకు గిట్టుబాటు ధరపై ఎలాంటి ప్రకటన చేయలేదు.గత జగన్ ప్రభుత్వం లాగా 'ఉచిత పంట బీమా పథకం' అమలు చేస్తామని చెప్పలేదు.ఇన్పుట్ సబ్సిడీ ఊసే ఎత్తలేదు. మోం దా తుఫాను వల్ల తీవ్రంగా నష్టపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పడానికి కూడా నోరు రాలేదు.ఎంతసేపూ మహానాడులో చంద్ర బాబు భజన, లోకేష్ భజన పురాణం వల్లించ డం తప్ప రైతాంగానికి ఈ కూటమి ప్రభుత్వం చేసింది ఏమీ లేదని స్పష్టం చేశారు.ఈ మీడియా సమావేశంలో వైఎస్ఆర్సీపీ మండల పార్టీఅధ్యక్షులు మట్టా నాంచారయ్య, జన్ను రాఘవరావు, జిల్లా కార్యదర్శి గణేష్న రమేష్, మాజీ కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గడిదేసి బాల యేసు, జిల్లా ఆర్గనైజింగ్ డైరెక్టర్ జువా నాగరాజు, మండల జనరల్ సెక్రెటరీ మూర్తి రెడ్డితో పాటు వివిధ హోదాల్లో ఉన్న పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు మరియు గ్రామ రైతు సంఘాల అధ్యక్షులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మచిలీపట్నం జిల్లా ఆసుపత్రిలో పేర్ని కిట్టు పర్యటన రోగులకు అందుతున్న వైద్యంపై పర్యవేక్షణ

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి



మచిలీపట్నం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మంగళవారం సందర్శించారు. ఆసుపత్రిలో వివిధ అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్న బాధితులను ఆయన స్వయంగా పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యతపై ఆరా తీసిన పేర్ని కిట్టు.. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్, విధుల్లో ఉన్న వైద్యులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, అత్యుత్తమ ప్రథమ చికిత్సతో పాటు మెరుగైన కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించాలని ఆయన వైద్యులను కో రారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగుల పట్ల మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచిం చారు. పేదవాడికి ప్రభుత్వ వైద్యమే కొండంత అండ. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు సకాలంలో అందేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.— పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), వైసీపీ ఇన్‌చార్జ్ఈ పర్యటనలో వైఎస్సార్సీపీ మచిలీపట్నం రూరల్ పార్టీ అధ్యక్షులు మట్టా నాంచారయ్య తో పాటు, నియోజకవర్గ వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు. రోగులకు ధైర్యం చెప్పడమే కాకుండా, వైద్యులతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టేలా వైద్యులతో మాట్లాడారు.

# చిన్నారుల సమగ్ర అభివృద్ధే లక్ష్యం మచిలీపట్నంలో ఏ ఐ ఆధారిత స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం




మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

పిల్లల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని, 6 సంవత్సరాల లోపు వయసు గల చిన్నారులలో ఎదుగుదల లోపాలను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు మచిలీపట్నంలో ఒక కీలక అడుగు పడింది. సకాలంలో లోపాలను గుర్తించి, తగిన చర్యలు చేపట్టడం ద్వారా పిల్లల భవిష్యత్తును మెరుగు పరిచేందుకు వీలుగా... ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI – కృత్రిమ మేధస్సు) ఆధారిత స్క్రీనింగ్ కార్యక్రమంపై రెండు రోజుల శిక్షణా తరగతులు మంగళవారం స్థానిక కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. జూన్ 2 మరియు 3 తేదీలలో ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించబడుతోంది.సమన్వయంతోనే ఆశయ సాధన ఎం.ఎస్. రాణిఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా మహిళా, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారి ఎం.ఎస్. రాణి మాట్లాడుతూ, చిన్నారులలో అభివృద్ధి లోపాలను మరియు సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించడం అత్యంత ప్రాముఖ్యమైన విషయమని స్పష్టం చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖలు సంయుక్తంగా, సమన్వయంతో పనిచేస్తూ పిల్లలకు అవసరమైన సేవలను సకాలంలో అందించాలని ఆమె పిలుపునిచ్చారు.

నిపుణులచే అవగాహనఈ శిక్షణలో జిల్లా స్థాయి సీడీపీఓలు (CDPOs), సూపర్వైజర్లు, వైద్య అధికారులు మరియు సంబంధిత క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమానికి వనరుల వ్యక్తులుగా (Resource Persons) వ్యవహరించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రతినిధి డా. సాయి కిరణ్, ఆర్.బి.ఎస్.కె (RBSK) కోఆర్డినేటర్ డా. హేమ బిందు చిన్నారుల అభివృద్ధి మైలురాళ్లు, లోపాల గుర్తింపు, రిఫరల్ విధానం మరియు AI ఆధారిత ఆధునిక సాధనాలను ఎలా వినియోగించాలనే అంశాలపై సిబ్బందికి కూలంకషంగా వివరించారు.శిక్షణలోని ముఖ్య అంశాలురెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనే సిబ్బందికి క్రింది అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పిస్తున్నారుపిల్లల ఎదుగుదల లోపాలను స్క్రీనింగ్ చేసే విధా నాలు. అభివృద్ధి సూచికల (Developmental Indicators) గుర్తింపు.డిజిటల్ పద్ధతిలో డేటా నమోదు ప్రక్రియ.లోపాలున్న పిల్లలను పై ఆసుపత్రులకు పంపే రిఫరల్ సేవలు, తదుపరి అనుసరణ (Follow-up) చర్యలు.ఈ AI ఆధారిత కార్యక్రమం ద్వారా జిల్లాలోని చిన్నారులకు మెరుగైన ఉచిత అభివృద్ధి సేవలు అందడమే కాకుండా, వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ఎంతగానో తోడ్పడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# వై జే ఆర్ డీఎంఎస్ కళాశాలలో ఘనంగా సుజనా చౌదరి జన్మదిన వేడుకలు

మచిలీపట్నం/రూరల్ ప్రజాభూమి ప్రతినిధి

విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి పుట్టినరోజు వేడుకలు స్థానిక వై జే ఆర్ డీఎంఎస్ (YJR DMS) ఇంజినీరింగ్ కళాశాలలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, సిబ్బంది సుజనా చౌదరికి శుభాకాంక్షలు తెలియజేశారు.అనుబంధాన్ని గుర్తుచేసుకున్న మేనేజ్మెంట్కళాశాల మేనేజ్మెంట్ మెంబర్ వీరమాచనేని కిరణ్ ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ.. సుజనా చౌదరితో తనకు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.విద్యాభివృద్ధికి కృషికళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. రవికుమార్ మాట్లాడుతూ.. ఈ ఇంజినీరింగ్ కళాశాల అభివృద్ధికి, దీనిని ఒక అత్యున్నత విద్యా సంస్థగా తీర్చిదిద్దడానికి సుజనా చౌదరి అందిస్తున్న సేవలు, చేస్తున్న కృషి అమోఘమని కొనియాడారు.పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం (సామాజిక సేవా కార్యక్రమం):జన్మదిన వేడుకల సందర్భంగా కళాశాలలో పనిచేస్తున్న పలువురు పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను బహుకరించి, వారి సేవలను అభినందించారు.హాజరైన ప్రముఖులుఈ వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవికుమార్, మేనేజ్మెంట్ మెంబర్ వీరమాచినేని కిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నాగజ్యోతి, ఏఓ శర్మతో పాటు వివిధ విభాగాల అధిపతులు (HODs), బోధన, బోధనేతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి 4

బుధవారం 3, జూన్ 2026


# పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు మానాలి

## రెడ్డి అప్పలనాయుడు



**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు**

జనసేన పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్‌పై సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న అసత్య ప్రచారాలు, అనుచిత వ్యాఖ్యలను వెంటనే అరికట్టాలని కోరుతూ ఏలూరులోని జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించిన జనసేన నాయకుడు రెడ్డి అప్పల నాయుడు కాంగ్రెస్ నాయకుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.తెలంగాణలో జనసేన పార్టీ విస్తరణను చూసి కాంగ్రెస్ నాయకులు భయపడుతున్నారని, అందుకే పవన్ కళ్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, రాజకీయ విభేదాలు ఉండొచ్చుగానీ వ్యక్తిగత దూషణలు సమంజసం కాదన్నారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజల పట్ల ఎప్పుడూ సానుకూల దృక్పథంతో వ్యవహరించారని, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని పలుమార్లు ప్రశంసించారని గుర్తు చేశారు.వరదలు, కరోనా వంటి విపత్తుల సమయంలో తెలంగాణకు సహాయం అందించడంతో పాటు ఆలయాల అభివృద్ధికి కూడా కృషి చేశారని పేర్కొన్నారు. తెలంగాణ ఏ ఒక్క రాజకీయ పార్టీ సొత్తు కాదని, అక్కడ రాజకీయ కార్యకలాపాలు నిర్వహించడానికి ప్రతి ఒక్కరికీ హక్కు ఉందని అన్నారు. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాల్సిన నాయకులు వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదని విమర్శించారు.పవన్ కళ్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసిన అప్పలనాయుడు, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.ఈ సమావేశంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ కావూరి వాణిశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి శివరామకృష్ణ ప్రసాద్, నగర అధ్యక్షుడు వీరంకి పండు, గౌరవ అధ్యక్షుడు నగిరెడ్డి కాశీ నరేష్ పాల్గొన్నారు.

### రావాల్సిన డబ్బులు అడిగితే...

# చంపుతానని బెదిరిస్తున్నారు..ప్రాణ రక్షణ కల్పించండి

## జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వెలగ శ్రీరామమూర్తి ఆవేదన

**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**

వైసీపీ నాయకుడు మేకా శేషుబాబు వల్ల తనకు, తన కుటుంబానికి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు వెలగ శ్రీరామ్మూర్తి ఆరోపించారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ భవనంలో ఆర్యవైశ్య సంఘ ప్రముఖులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీరామమూర్తి మాట్లాడారు. డైరెక్టర్లు తో కూడిన రైస్ మిల్ వ్యాపారంకోసం తన పెట్టుబడి నాలుగు ఎకరాల 19 సెంట్లు భూమిని, మిల్లు నిర్మాణానికి ఒక కోటి రూపాయలు పెట్టుబడి పెట్టానని శ్రీరామ్ మూర్తి తెలిపారు. ఆ వ్యాపారం లో మొత్తం కలిపి తనకు ఏడు కోట్ల రూపాయలు వరకు రావలసిన సొమ్మును శేషుబాబు ను అడగ్గా ఎగ్గొట్టేందుకు తనకు తెలియకుండా తన సంతకాలను ఫోర్జరీ చేయించి , తనను డైరెక్టర్గా తొలగించారని శ్రీ రామూర్తి ఆరోపించారు . ఈ వ్యవహారంలో శేషుబాబుపై గోపాలపురం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా విచారణ ముందుకెళ్లలేదని తెలిపారు. తనకు రావలసిన




ఏడు కోట్ల రూపాయలను శేషుబాబుని అడగగా రైస్ మిల్లు వ్యాపారం తో తనకు ఎటువంటి సంబంధం లేదని తెలిపారన్నారు.తనను వ్యాపారం నుంచి బయటకు గెంటేసారని, ఏడు కోట్ల రూపాయలు ఇవ్వకుండా మోసం చేశారని శ్రీరామ్ మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు అడుగుతుంటే చంపేస్తాను అంటూ బెదిరిస్తున్నారని శ్రీరామ్మూర్తి ఆరోపించారు. ఈ విషయంలో తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ, జిల్లా కలెక్టర్,జాయింట్ కలెక్టర్ లకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కావున ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఎస్పీ స్పందించి తనకు రావాల్సిన సొమ్ము ఇప్పించి ఆదుకోవాలని శ్రీరామ్ మూర్తి కోరారు. ఈ సమావేశంలో ఏపీ ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి నుదురుపాటి శ్రీనివాస్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బొమ్మ హేమ సాయిబాబా, పాలకొల్లు చిన్న గోపురం చైర్మన్ రేపాక ప్రవీణ్ భాను, మాజీ చైర్మన్ గాది వెంకన్న, టిడిపి సీనియర్ నాయకులు గాది సుబ్బారావు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాదంలో ఇద్దరు మహిళలు సజీవ దహనం!

## దొంగతనానికి పాల్పడి, చంపి తగలబెట్టి ఉంటారన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్న ప్రజలు.







**ప్రజా భూమి ప్రతినిధి-వేలేరుపాడు**

మండల కేంద్రమైన వేలేరుపాడు సంత బజారు సెంటర్లో సోమవారం అర్ధరాత్రి జరిగిన ప్రమా దంలో వారి గృహాల్లోనే ఇద్దరు మహిళలు సజీవ దహనం అయిన సంఘటన చోటు చేసుకుంది.ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి వలగాని సావిత్రి అనే మహిళ కల్లు అమ్ముకుంటూ జీవనం గడుపుతుంటుంది ఇటీవల తనకు సొంత అక్క అయిన సిగ పుల్లమ్మ తనకు తోడుగా ఇక్కడే ఉంటుందని, వీరు ఇరువురు యధా ప్రకారం పనులు ముగించుకొని వారి గృహంలోనే నిద్రించు చుండగా అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఒక్కసారిగా ఇంటి నలుమూలల నుంచి మంటలు లేచాయని ఇది గమనించిన చుట్టుపక్కల వారు వచ్చి చూసేసరికి సావిత్రి గృహంతోపాటు పక్కనే గల లక్ష్మీ అని మహిళకు చెందిన గృహానికి సైతం భారీ ఎత్తున మంటలు అలముకున్నాయని తరువాత ఇరుగృహాలలోని గ్యాస్ బండ్లు పేలుతుండటంతో దగ్గరకు వెళ్లే సాహసం చేయలేక పోయామని తెలిపారు ఈలోగా అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మంటలు ఆర్పాక సావిత్రి ఆమె అక్క పుల్లమ్మ శవాలు కాలి కళాబరాలతో ఎవరి మంచం మీద వారే మృతి చెంది బూడిదగా ఉండటాన్ని చూడటం జరిగిందన్నారు.

**హత్య చేసి తగలబెట్టి ఉంటారన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్న ప్రజలు?**

సావిత్రి నిత్యం కల్లు మద్యం అమ్ముకుంటూ జీవిస్తుందని ఈ విధంగా ఆమెకు కొంతమేర బంగారు వస్తువులు, నగదు ఉన్నాయని, ఇది గమనించిన వారు ఆ వస్తువులు, నగదును అపహరించేందుకు వచ్చి వారిని చంపి తగల బెట్టి ఉంటారన్న అనుమానాలను బహాటంగా వ్యక్తం చేయటం గమనరహం!

సంఘటన స్థలాన్ని చూస్తుంటే విద్యుత్ ప్రమాదం జరిగితే వారి ఇరువురు ప్రాణ సంకటంలో కేకలు వేసే వారిని, లేకుంటే అగ్ని మంటలు లేచే సమయంలో మంచాల మీద నుంచి లేచి ప్రాణాలను రక్షించుకునే ప్రయత్నంలో తలుపుల వద్దకు వచ్చి ఉండేవారని పేర్కొంటున్నారు. కానీ మృతదేహాలు ఎవరు పండుకున్న చోట వారే అగ్నికి ఆహుతి కావటం నమ్మశక్యంగా లేదని అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సంబంధిత కుటుంబీకుల నుంచి ఫిర్యాదు అందుకొని కేసు నమోదు చేసి పంచనామాలు నిర్వహించి సీఐ రమేష్ బాబు నేతృత్వంలో దర్యాప్తు ప్రారంభించారు.

**సంఘటనా స్థలానికి చేరుకుని దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన పలు రాజకీయ పార్టీల నేతలు**

ప్రధాన కూడలిలో వారి గృహాల్లోనే అగ్నికి ఆహుతి అయిన సావిత్రి ఆమె అక్క పుల్లమ్మ మృతి చెందిన ప్రాంతాన్ని మంగళవారం ఉదయం పలు రాజకీయ పార్టీలు నేతలు ప్రజలు సందర్శించి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. టిడిపి మండల అధ్యక్షుడు అమరవరపు అశోక్, నాయకులు శాఖమూరి సంజీవులు, కరటూరి రాధాకృష్ణ, కొమ్మన వెంకటేశ్వర్లు, కొత్తపల్లి బాబులు, బేతి శ్రీనివాసరావు, కోటిపల్లి సంతోష్, రామకృష్ణ, వైసీపీ మండల అధ్యక్షుడు కేశగాని శ్రీనివాస్ గౌడ్ ఇంకా పలు పార్టీలకు చెందిన నాయకులు పలు గ్రామాలకు చెందిన ప్రజలు విరివిగా సందర్శించారు.

# ఆరోగ్యకరమైన తల్లి,శిశువు సుభవిష్యత్తుకు వైద్యాధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలి

## ప్రాజెక్టు మాతృ అమలుపై జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్ష

**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా**

ఏలూరు జిల్లాలో తల్లి,శిశు మరణాలను పూర్తిగా నివారించాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న "ప్రాజెక్టు మాతృ- జీరో ఐఎంఆర్, ఎంఎంఆర్ పైలట్ ప్రాజెక్టు" అమలుపై జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో మంగళవారం వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యాధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్షసమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడంతో పాటు శిశువులు ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తల్లి,శిశు మరణాలను పూర్తిగా నివారించేందుకు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, వైద్యాధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో సమన్వయంతో పని చేయాలని సూచించారు. అధికప్రమాద (హైరిస్క్) గర్భిణులను గుర్తించి నిరంతర పర్యవేక్షణ చెయ్యడం, ప్రసవాలకు ముందు మరియు తరువాత అవసరమైన వైద్యసేవలు అందించడం, సంస్థాగత ప్రసవాలను ప్రోత్సహించడం, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి అంశాలుపై జిల్లా కలెక్టరు అధికారులకు దిశానిర్దేశం చేశారు. హైరిస్క్ గర్భిణులను ప్రసవానికి ముందు ఒక నెలపాటు రోజువారీగా ఆరోగ్యపరంగా పర్యవేక్షించాలని, ప్రతి హైరిస్క్ గర్భిణీస్త్రీలను పర్యవేక్షణ కోసం ఒక అడాప్షన్ అధికారిని నియమించాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలు మేరకు జిల్లాలో వినూత్న కార్యక్రమంగా నూజివీడు క్లస్టర్ పరిధిలో ఈ ప్రాజెక్టును పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నామని అన్నారు. నూజివీడు క్లస్టర్ పరిధిలోని 11 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో మొత్తం



1,635 మంది గర్భిణులను గుర్తించగా, వారిలో 790 మందిని హైరిస్క్ గర్భిణులుగా గుర్తించినట్లు వెల్లడించారు. జూన్, జూలై, ఆగస్టు మూడు నెలల్లో ప్రసవాలకు సిద్ధంగా ఉన్న 624 మంది గర్భిణుల్లో 315 మంది హైరిస్క్ గర్భిణులుగా గుర్తించ బడ్డారని, వీరందరికీ సురక్షిత ప్రసవాలు జరిగేలా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు అమలులో సాధించవలసిన పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, వాటిపరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలుపై అధికారులతో చర్చించారు. జిల్లాలో తల్లి,శిశు ఆరోగ్య సూచికలను మెరుగు పరచడంలో ప్రతిశాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. గర్భిణీస్త్రీలు ఆరోగ్యపరిరక్షణలో భాగంగా యోగాను, ఎక్సర్సైజులు తో పాటు కొద్ది సమయం నడకను తప్పక పాటించేలా చూడాలని అన్నారు. డెలివరీ అయిన తర్వాత 40 రోజులుపాటు మాతాశిశు గృహాలకు తప్పనిసరిగా వెళ్ళి వైద్య సేవలు, సూచనలు సలహాలు అందిస్తూ, పౌష్టికాహారం తీసుకోవలసిన జాగ్రత్తలుపై తెలియ చెప్పాలని జిల్లా కలెక్టరు ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.యు. శోభ, జిల్లా ఐసిడిఎస్ పిడి పి.శారద, డిసిహెచ్ ఎస్ డా.సి.హెచ్. బేబికమల, డిప్యూటి డియంహెచ్వో డా.యస్. పద్మావతి, నోడల్ ఆఫీసరు శ్రీనివాసరావు, నూజివీడు నియోజకవర్గం వైద్య నిపుణులు, వైద్యాధికారులు, జిల్లా వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్లు బేషరతుగా అమలు చేయాలి: సుధారాణి



**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు**

మహిళలకు కల్పించిన రిజర్వేషన్లను ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ఏలూరు ఏరియా సహాయ కార్యదర్శి కొల్లూరి సుధారాణి డిమాండ్ చేశారు.ఎన్ఎఫ్ఐడబ్ల్యూ 72వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మహిళా హక్కుల సాధన కోసం సమాఖ్య ఎన్నో ఉద్యమాలు నిర్వహించిందన్నారు.మహిళలపై పెరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టేందుకు చట్టాలను కఠినంగా అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గొర్లి స్వాతి, ఉప్పులూరి లక్ష్మి, ఉప్పులూరి భవాని, జ్యోతి పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు గొర్రెల కాపరి మృతి.

**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా**



ఏలూరు జిల్లా, ముసునూరు మండలం చింతలవల్లి శివారు కొత్తూరు గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గొర్రెల కాపరిగా జీవనం సాగిస్తున్న గంగుల ఏలి బాబు పిడుగుపాటుకు గురై దుర్మరణం చెందాడు.సమాచారం ప్రకారం, ఏలి బాబు గొర్రెలను మేపేందుకు వెళ్లిన సమయం లో వర్షంతో పాటు ఉరుములు, మెరుపులు సంభవించాయి. ఈ క్రమంలో పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. స్థానికులు మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నారు.

## శక్తి యాప్‌పై అవగాహన

### మహిళల భద్రత, బాలల రక్షణ చట్టాలపై సూచనలు

### ఎస్ఐ క్రాంతి కుమార్



**ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి**

జీలుగుమిల్లి గ్రామంలో శక్తి యాప్, మహిళల భద్రత మరియు బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి ఎస్ఐ క్రాంతికుమార్ పాల్గొని ప్రజలకు పలు సూచనలు చేశారు.శక్తి యాప్ ద్వారా అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం త్వరగా పొందవచ్చని వివరించారు. మహిళలు, బాలికలు తమ భద్రత కోసం ఈ యాప్‌ను తప్పనిసరిగా వినియోగించుకోవాలని సూచించారు. బాలలపై జరిగే నేరాల నివారణకు అమలులో ఉన్న చట్టాల గురించి అవగాహన కల్పించారు. అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మహిళలు, యువత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పంట నమోదు ఆధారంగానే ఎరువుల పంపిణీ

### -ఖరీఫ్ సీజన్‌కు కొత్త విధానంపై సిబ్బందికి శిక్షణ



**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

పంట నమోదు వివరాల ఆధారంగానే రైతులకు యూరియా, డీఏపీ ఎరువుల పంపిణీ జరుగుతుందని మండల వ్యవసాయాధికారి జె. భవాని తెలిపారు. ఖరీఫ్--2026 సీజన్‌లో అమలుకానున్న ఎరువుల పంపిణీ విధానంపై గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు మంగళవారం రైతు సేవా కేంద్రంలో శిక్షణ నిర్వహించారు. రైతుల భూ రికార్డులు, సాగు హక్కులు, పంట నమోదు వివరాలను అనుసంధానం చేసి, సాగు చేస్తున్న పంట అవసరాలకు అనుగుణంగా మాత్రమే ఎరువులు బయోమెట్రిక్ విధానంలో అందజేయనున్నట్లు వివరించారు. యూరియా, డీఏపీ ఎరువులను మూడు విడతలుగా పంపిణీ చేయనున్నామని, ప్రతి విడత మధ్య 20 రోజుల వ్యవధి ఉంటుందని తెలిపారు. రైతులందరూ తమ పంటలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని, సహకార సంఘాలు మరియు గుర్తింపు పొందిన ఎరువుల విక్రయ కేంద్రాల ద్వారా ఎరువులు పొందాలని సూచించారు. పంట అవసరాలకు మించి యూరియా వినియోగించకుండా సమతుల్య ఎరువుల వాడకాన్ని పాటించాలని రైతులకు సూచించారు.

# అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తాం : ఏఎస్పి సుస్మిత

**ప్రజా భూమి ప్రతినిధి-వేలేరుపాడు**

వేలేరుపాడు మండలంలో సోమవారం అర్ధ రాత్రి ఇద్దరు మహిళల సజీవ దహనం విషయంలో అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి నిజానిజాలు వెల్లడిస్తామని ఏఎస్పి సుస్మిత పేర్కొన్నారు. జరిగిన సంఘటనను అధికారుల ద్వారా సమాచారం అందుకున్న ఏ.ఎస్.పి హుటాహుటిన విలేరుపాడులోని సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనంతరం మృతుల కుటుంబీకులతో మాట్లాడి వారి



అభ్యర్థన మేరకు అన్ని రకాల దర్యాప్తులను కొనసాగిస్తామని ఇందుకుగాను విజయవాడ నుంచి క్లూస్ టీం ను రంగంలోకి దింపడం జరుగుతుందన్నారు. పోస్టుమార్టం నిర్వహించి నందున ఆ విధంగా సైతం వీరు ప్రమాదంలో మృతి చెందార, లేక ఎవరైనా బలవంతంగా హత్య చేశారా? అన్న విషయాలు వెలుగు చూస్తాయన్నారు. ఏది ఏమైనా ఈ దుర్ఘటన చాలా బాధాకరమని ఇటువంటివి పునరావృతం కాకుండా తగు చర్యలు చేపట్టాల్సిన బాధ్యత అన్ని శాఖల అధికారులతో పాటు ప్రజలపై ఎంతైనా ఉందన్నారు. పోస్టుమార్టం



అనంతరం పోలీసులు రెండు శవాలను వారి కుటుంబీకులకు అప్పగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ వెంట సిఐ రమేష్ బాబు,ఇన్చార్జి ఎస్ఐ రాజారెడ్డి సిబ్బంది ఉన్నారు.

## ఏపీ రాష్ట్ర ఆక్వా రైతు సంఘం అధ్యక్షులుగా గాంధీ భగవాన్ రాజు

**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వా రైతు సంఘం అధ్యక్షులుగా పాలకొల్లుకు చెందిన గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గాంధీ భగవాన్ రాజు ఆక్వా రైతులును ఆదుకునేందుకు గత ఐదు,ఆరు సంవత్సరాలుగా అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రాసె సింగ్ ప్లాంట్లు యజమానులు రొయ్యలను రైతుల నుంచి రొయ్యల ధరలు తగ్గించి కొనుగోలు చేసినప్పుడు, అదే విధంగా మేత ధరలు పెంచినప్పుడు, నాణ్యమైన సీడ్ సరఫరా చేయలేక పోయినప్పుడు, దళారులు మోసాలు చేసినప్పుడు అనేక ఆందోళన కార్యక్రమాలు గాంధీ భగవాన్ రాజు నేతృత్వంలో నిర్వహించి, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఆక్వా రైతులకు మేమున్నామంటూ అండగా నిలుస్తున్నారు. దీంతో గాంధీ భగవాన్ రాజు సేవలను గుర్తించిన రాష్ట్ర సంఘ నాయకులు గాంధీ భగవాన్ రాజుని ఏపీ రాష్ట్ర రైతు సంఘ సంఘ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు.

# మృతి చెందిన కుటుంబాలను అన్ని విధాలుగా ప్రభుత్వపరంగా ఆదుకుంటాం

- జరిగిన సంఘటన పైన ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం
- పోలవరం శాసనసభ్యులు బాలరాజు

ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి

వేలేరుపాడు అగ్నిప్రమాదంలో మృతి చెందిన మహిళల కుటుంబ సభ్యులను పరామర్శించి, ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వేలేరుపాడు మండల కేంద్రంలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన విషాదకర అగ్నిప్రమాద ఘటనలో మృతి చెందిన మహిళల కుటుంబ సభ్యులను పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పరామర్శించారు. ప్రమాద వార్త తెలుసుకున్న వెంటనే ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ఘటనలో ఒక ఇంటిలో నిద్రిస్తున్న వలగాని సావిత్రి మరియు సిగ పుల్లమ్మ అగ్నికి ఆహుతై మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఎమ్మెల్యే తెలిపారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, వారికి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, పోలీసు అధికారులతో ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులు ఘటనపై అనుమానాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో పోలీసులు దీనిని అనుమానాస్పద ఘటనగా



నమోదు చేసి, క్లూస్ టీమ్‌తో పాటు ప్రత్యేక బృందాల సహాయంతో దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు. ఘటనకు గల అసలు కారణాలను వెలికితీసేందుకు అన్ని కోణాల్లో విచారణను వేగవంతం చేసి, పూర్తి స్థాయి స్పష్టత తీసుకువస్తామని అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ, బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు గణేశుల ఆదినారాయణ, బీజేపీ మండల అధ్యక్షులు ఓలేటి బాలకృష్ణ, మెచినేని సంజయ్, కొవ్వల క్రాంతి, పొట్ల మోహన్ దొర, దేవినేని సుధాకర్, సారే బాబ్జీ, ములకలపల్లి నరసింహారావు, ఎం.డి. షాను, మాచర్ల వెంకటేశ్వర్లు, కోడూరి నాగు, గాలి బాలరాజు, సోడే కల్యాణ్, కమ్మచిచ్చు సాయి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల రక్షణకు కంచుకోట.

సర్వే నెం.114 చుట్టూ ట్రెంచ్ తవ్వకాలతో ఆక్రమణలకు చెక్..!


పెదముషిడివాడలో ప్రభుత్వ స్థలాలకు భద్రతా వలయం... పనులను పరిశీలించిన పరవాడ ఎమ్మార్వో అరుణ్ కుమార్



ప్రజాభూమి ప్రతినిధి:-అనకాపల్లి

పరవాడ మండలం, పెదముషిడివాడ పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని పెదముషిడివాడ గ్రామ సర్వే నంబర్ 114లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమణల బారిన పడకుండా రక్షించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ స్థల సరిహద్దులను స్పష్టంగా గుర్తించడంతో పాటు భవిష్యత్తులో ఎవరూ భూమిని కలుపుకోకుండా ఉండేందుకు చుట్టూ ట్రెంచ్ తవ్వకాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ భూముల సంరక్షణలో భాగంగా చేపట్టిన ఈ పనులను పరవాడ ఎమ్మార్వో అరుణ్ కుమార్ పరిశీలించారు. సరిహద్దులు స్పష్టంగా ఉండటం వల్ల ప్రభుత్వ భూములపై వివాదాలు, ఆక్రమణ ప్రయత్నాలను నివారించే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. స్థానికులు కూడా ఈ చర్యను స్వాగతిస్తున్నారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు ఇలాంటి చర్యలు అవసరమని, ఆక్రమణలకు అవకాశం లేకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అభినందనీయమని అభిప్రాయపడుతున్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం.



ప్రజాభూమి ప్రతినిధి-కాజులూరు.

బుధవారం మధ్యాహ్నం 2గం"ల నుండి సాయంత్రం 5 గం " వరకు ఎపి ట్రాన్స్ కో గొల్లపాలెం పరిధి లో గల 132 కేవీ లైన్ల మరమత్తుల్లో భాగంగా కాజులూరు,కరప, తాళ్లరేవు పెదపూడి మండలాల్లో గల సంపర సబ్ స్టేషన్ పరిధిలో గల గ్రామములకు , ఇండస్ట్రియల్ మరియు ఆక్వా సర్వీసులకు అవసరాన్నిబట్టి అత్యవరస పరిస్థితిలో సర ఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు కావు న విద్యుత్ వినియోగదారులు అందరూ సహకరించవలసిందిగా ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎన్.ఉదయ్ భాస్కర్ తెలియజేసినారు.

# హిందువుల ఇళ్ల మధ్య చర్చి పెట్టి వివాదాలు సృష్టిస్తున్నారు

## అనుమతి లేని చర్చిని తొలగించాలని హిందూ సంఘాల డిమాండ్

ప్రజాభూమి ప్రతినిధి-కాకినాడ

హిందువులు అధికంగా ఉండే నివాసాల మధ్య ఎటువంటి అనుమతులు లేని చర్చిని ఏర్పాటు చేసి వివాదాల సృష్టిస్తున్నారని అందువల్ల ఆ అనుమతి లేని చర్చిని తొలగించి ప్రశాంత వాతావరణము కాపాడాలని వివిధ హిందూ సంఘాలకు చెందిన నాయకులు డిమాండ్ చేశారు. కాకినాడ రమణయ్యపేట పంచాయతీ పరిధిలోని ఈశ్వర్ నగర్లో ఇంటి నిర్మాణం పేరుతో అనధికార చర్చిని ఏర్పాటు చేసి కోర్టు వివాదంలో ఉన్నా దానిని తెరవడానికి ప్రయత్నిస్తున్నారని అందువల్ల వారిపై చర్యలు తీసుకోవాలని హిందూ సంఘాల నాయకులు రిమాండ్ చేశారు మంగళవారం స్థానిక ఈశ్వర నగర్ సత్తమ్మ గుడి ఆలయంలో ఈ వివాదంకు సంబంధించి విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హిందూ ధర్మా రక్ష సమితి రాష్ట్ర అధ్యక్షుడు



చేదులూరి గవరయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, అక్కడ స్థానిక సీనియర్ న్యాయవాది పి నాగేశ్వరరావులు ఈ వివాదాన్ని వివరించారు. అనుమతులు తీసుకొని చర్చి కొనసాగిస్తున్నారన్నారు. అక్కడే స్థానిక అనుమతులు లేకుండా చర్చి ఏర్పాటు నిబంధనలకు విరుద్ధమని వారు చెప్పారు. పంచాయ తీ పరిధిలో ఎటువంటి గ్రామసభ నిర్వహించకుండా జరిగినట్టుగా నివేదికలు రాసి ప్రభుత్వానికి పంపడం వల్ల ఈ సమస్య అధికమైందని వారు చెప్పారు. జిల్లా కలెక్టర్లు మారినప్పుడల్లా ఏదో ఒక వినతిపత్రం ఇచ్చి, తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందంటూ



చర్చి నిర్వహిస్తున్నారన్నారు. చర్చిని హిందువుల ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేయకూడదని అక్కడ ఎటువంటి సభలు, సమావేశంలు జరుపకూడదని నిబంధనలు ఉన్నా వాటిని ఆ చర్చి నిర్వాహకులు పాటించట్లేదని చెప్పారు. చర్చి నిర్వాహకులు ఒకసారి చర్చని మరోసారి ఇల్లు అంటూ ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని వారు ఆరోపించారు. ఆ చర్చి తొలగించే వరకు న్యాయపోరాటం చేస్తామని గవరయ్య, విశ్వేశ్వరరావు, నాగేశ్వరరావులు తెలిపారు. మీ సమావేశంలో విశ్వ హైందవ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు డి వెంకటేశ్వరరావు, నాయకులు ముత్తా నవీన్, అప్పాజీ తదితరులు పాల్గొన్నారు

# పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులకు ఎస్పీ సత్కారం







ప్రజాభూమి ప్రతినిధి – కాకినాడ

పదవీ విరమణ పొందిన ఐదుగురు పోలీసు అధికారులను ఘనంగా సత్కరించిన జిల్లా ఎస్పీ పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం పాటు విశిష్ట సేవలు అందించి, నేడు పదవీ విర మణ పొందిన ఐదుగురు పోలీసు అధికారు లను జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా సత్క రించారు. పదవీ విరమణ పొందిన వారిలో కాకినాడ టౌన్ ఎస్సై కె. విజయ్ కుమార్ , కాకినాడ టౌన్ ఎస్సై సి హెచ్ కుమార్, కాకి నాడ పోర్ట్ ఎస్సై ఎ. సూర్య ప్రకాష్, ట్రాఫి క్ -వన్ ఎస్సై కె . అప్పారావు మరియు ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్ కె. నారాయణరావు ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయా అధికారులను దుశ్శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించి, వారి సుదీర్ఘ సేవలను కొనియా డారు. విధి నిర్వహణలో వారు చూపిన నిబద్ధతను అభినందిస్తూ, వారి తదుపరి విశ్రాంత జీవనం సుఖసంతోషాలతో, ఆరో గ్యంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్ర మంలో ఎస్బీ డీఎస్పీ కె.వి.వి. సత్యనారా యణ, రిజర్వ్ ఇన్స్పెక్టర్స్ ఎం. నరసింహ మూర్తి, కె. వెంకటరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.వి.వి. సత్యనారాయణ మూర్తి, ఎస్పీ సీసీ ఎస్. రాంబాబు, జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి. సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం విజయవంతం చేయాలి

ప్రజాభూమి ప్రతినిధి – కాకినాడ రూరల్

బ్రాహ్మణుల ఐక్యత ధ్యేయంగా జూలై 19న రాజమండ్రిలో రాష్ట్రస్థాయి బ్రాహ్మణ ఆత్మీయ సమావేశం జరుగుతుందని, ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని బ్రాహ్మణ సంఘ నాయకులు, కార్యక్రమ ఆహ్వాన కమిటీ సభ్యులు భమిడిపల్లి వెంకట రమణ మూర్తి(బాబు), కాకినాడ బ్రాహ్మణ సంఘం కన్వీనర్ వై. పద్మనాభ స్వామి కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక వార్పు రోడ్లో బ్రాహ్మణ సత్రం వద్ద ఆత్మీయ సమావేశానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో బ్రాహ్మణులు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. సామాజిక, ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉన్నాయని



ఆవేదన వ్యక్తంచేశారు. బ్రాహ్మణులలో ఐక్యత కొరకు అందరూ ఏకత్రాటిపై రావాల్సిన అవసరం ఉందని అన్నారు. అన్ని రంగాలకు చెందిన బ్రాహ్మణ ప్రముఖులు హాజరవ్వడం వలన అర్ధవంతమైన చర్చలు జరుగుతాయని తెలిపారు. బ్రాహ్మణుల సామాజిక ఆర్థిక,రాజకీయ, సంఖ్యా పరంగా గుర్తించి అసమానతలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియపరచేందుకు ప్రాతినిధ్యం చేయడం జరుగుతుందని అన్నారు. హిందూ దేవాలయాల స్వయంప్రతిపత్తి, బ్రాహ్మణ వివాహాలపై యువతీయువకులకు అవగాహన కల్పించడం, బ్రాహ్మణులు, అర్చకులు, పురోహిత రక్షణకై ప్రత్యేక చట్టాలు, వివిధ అంశాలపై పెద్దలతో చర్చా గోష్టులు వుంటాయని తెలిపారు. జూలై 19న రాజమండ్రి ఏకేసి కాలేజి దగ్గర మన్యం గార్డెన్స్ లో జరిగే కార్యక్రమ నిర్వహణలో బ్రాహ్మణ సామాజిక వర్గ అన్ని సంఘాలు, అర్చకులు, పురోహితులు, వ్యాపారవేత్తలు, వివిధ వృత్తుల్లో స్థిరపడిన పెద్దలు ప్రతిఒక్కరూ కలిసివచ్చి తమ తోడ్పాటు అందించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కందాళ రవి, దివి శ్రీనివాస్, బాదంపూడి బ్రదర్స్, నిముషకవి వెంకటేష్, వి.సూర్యప్రకాశరావు, తురగా సాయి సుబ్బారావు, ఆకెళ్ళ శ్రీనివాస్, రాయవరపు ప్రభాకర్, అర్చక పురోహిత సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ దండాయన ప్రారంభించిన జిల్లా ఎస్పీ

ప్రజాభూమి బ్యూరో – కాకినాడ

ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు మహిళా మరియు శిశు భద్రతా విభాగం ఐజీపీ బి. రాజకుమారి పర్యవేక్షణలో "ఆపరేషన్ దండాయన" ను కాకినాడ జిల్లా ఎస్పి జి. బిందు మాధవ్ మంగళవారం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మహిళలు మరియు బాలికల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తూ, మహిళలపై జరుగుతున్న నేరాలలో, నేరస్తులకు త్వరితగతిన శిక్షలు పడేలా ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆధ్వర్యంలో మరియు మహిళా ఒ శిశు భద్రత విభాగం ఐజీపీ బి. రాజకుమారి, పర్యవేక్షణలో 'స్పీడ్ ట్రయల్ మానిటరింగ్ విధానాన్ని ఏపీ పోలీస్ శాఖ పకడ్బందీగా అమలు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు మహిళా మరియు శిశు భద్రతా విభాగం ఐజీపీ బి. రాజకుమారి, పర్యవేక్షణలో "ఆపరేషన్ దండాయన" ను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో కాకినాడ జిల్లా ఎస్పి జి. బిందు మాధవ్ పోలీసు అధికారుల సమక్షంలో ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, గృహ హింస, పోక్సో కేసుల్లో తదితర నేరస్తులపై నిఘాకు మరియు నేరాల నియంత్రణకు "శక్తి" కార్యక్రమాలలో భాగంగా "ఆపరేషన్ దండాయన" ను ప్రారంభిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించడమైనది. మహిళలపై జరిగే నేరాలపై జీరో టోలరెన్స్ పాలసీ.. సత్వర విచారణ, నేరస్తులకు కఠిన శిక్షలు విధించడం, నేరస్తుల కదలికలపై నిఘా పెట్టడం ఈ ఆపరేషన్ ప్రధాన లక్ష్యం. మహిళలపై నేరాలకు సంబంధించిన ప్రతి కేసులో 60 రోజుల్లోగా చార్జిషీట్ దాఖలు చేసి, సంచలన కేసులను ఫాస్ట్ ట్రాక్ కోర్టులకు బదిలీ చేసి శిక్షలు పడేలా చూడడం, బాధిత మహిళలకు ఎన్జీవోల సహకారంతో కౌన్సెలింగ్, న్యాయ సహాయం అందించడంతో పాటు, పునరావృత నేరస్తులు, అనుమానితులపై రౌడీ - సెక్సువల్ అఫెండర్ షీట్లు తెరవబడును. షీట్ హోల్డర్స్ పై నిరంతరం నిఘా కొనసాగును. ఈ సందర్భంగా ఎస్పీ



బిందుమాధవ్ మాట్లాడుతూ, "మహిళలపై నేరాల విషయంలో మా వైఖరి నినాదంతో నిందితులు ఎంతటి ప్రభావశీలురైనా కఠినంగా శిక్షిస్తాం. ప్రతి బాధితురాలికి న్యాయం జరిగే వరకు " ఆపరేషన్ దండాయన" నిరంతరం కొనసాగుతుంది అని స్పష్టం చేశారు. మహిళా భద్రత కోసం చేపట్టిన ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని, ఎలాంటి నేరాన్ని ఉపేక్షించవద్దని ఏపీ డీజీపీ పోలీస్ శాఖకు ఆదేశించారన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ (ఏ ఆర్) అడిషనల్ ఎస్పి ఎస్. శ్రీనివాసరావు, కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ పాటిల్ దేవ్ రాజ్ మనీష్, ఎస్బి డిఎస్పి కెవివి సత్యనారాయణ, కాకినాడ ఏ ఆర్ డిఎస్పి వి జి శ్రీహరి రావు, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ వి శ్రీనివాసరావు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ టి దుర్గాప్రసాద్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ ఎమ్ నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

**ఆపరేషన్ దండాయన గురించి వివరణ:**

'ఆపరేషన్ దండాయన' ప్రారంభం: ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆధ్వర్యంలో మరియు మహిళా , శిశు భద్రత విభాగం ఐజీపీ బి. రాజకుమారి, ఐపీఎస్ పర్యవేక్షణలో ప్రారంభం. స్పీడ్ ట్రయల్ మానిటరింగ్: మహిళలపై నేరాల్లో నేరస్తులకు త్వరితగతిన శిక్షలు పడేలా పకడ్బందీగా అమలు.

60 రోజుల గడువు: మహిళలపై నేరాలకు సంబంధించిన ప్రతి కేసులో 60 రోజుల్లోగా చార్జిషీట్ దాఖలు తప్పనిసరి. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు: సంచలన కేసులను ఫాస్ట్ ట్రాక్ కోర్టులకు బదిలీ చేసి త్వరితగతిన శిక్షలు పడేలా కృషి చేయడం. నేరస్తులపై నిఘా: పునరావృత నేరస్తులు, అనుమానితులపై రౌడీ - సెక్సువల్ అఫెండర్ షీట్లు తెరవడం, వారిపై నిరంతర నిఘా ఉంచడం.

## కె కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల విజయభేరీ




ప్రజా భూమి ప్రతినిధి-కామవరపుకోట

కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు "ఎడ్ సెట్" ఫలితాలలో ఆరుగురు విద్యార్థులు మరియు "లా సెట్" లో ఇద్దరు, పీజీ సెట్ లో పది మంది ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె విజయబాబు తెలిపారు. ఎడ్ సెట్ ఫలితాలలో బి.ఎ (పొలిటికల్ సైన్స్) విద్యార్థులు మెథడాలజీ సోషల్ స్టడీస్ నందు కె మంగమ్మ 2475 వ ర్యాంకు, ఎం ఝాన్సీ రాణి 3831, కె గాయత్రి 4791 వ ర్యాంకు , బి.ఎస్సీ (జువాలజి) విద్యార్థులు మెథడాలజీ బయోలాజికల్ సైన్స్ నందు కె మౌనిక 4023 వ ర్యాంకు , ఆర్ భార్గవి 4596, కె శైలజ 4628 ర్యాంకు, అదేవిధంగా "లా సెట్" ఫలితాలలో బి.ఎ విద్యార్థులు డి జాన్సన్ 10525 వ ర్యాంకు, కె ఇందు 12378 ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె విజయబాబు ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మరియు వారికి బోధనా విషయాలలో తర్ఫీదు ఇచ్చిన అధ్యాపకులను అభినందించడం జరిగింది. విద్యార్థి కేంద్రిత బోధనా పద్ధతుల ద్వారా, అదనపు తరగతులను నిర్వహించడం, అసైన్మెంట్లు, మోడల్ పరీక్షల ద్వారా, అంకిత భావం కలిగిన అధ్యాపకుల ద్వారా ఇది సాధ్యమైందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె విజయబాబు తెలిపారు.

## రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బోజ్జిరెడ్డికి జరిగిన అవమానాన్ని ఖండిస్తున్నాం



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

క్యాబినెట్ హోదా కలిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బోజ్జిరెడ్డి నీ పోలవరం జిల్లా రంపచోడవరం ఐటీడీఏ హాల్లో జిల్లా ఉన్నతాధికారులు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రోటోకాల్ ఉల్లంఘన, తీవ్ర అవమానాన్ని తీవ్రంగాఖండిస్తున్నామని, చిన్నమట్టపల్లి పంచాయతీ చింతరేగుపల్లి గ్రామంలోనీ మాజీ సర్పంచ్ పిట్ట రామారావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కోటశీ జయరాజు అన్నారు. మంగళవారం చింతరేవుపల్లి గ్రామంలో జరిగిన ఒక సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ఎస్టి కమిషనర్ చోళ్ల బొజ్జి రెడ్డి ని అవమానిస్తే ఆదివాసులను కూడా అవమానించినట్టే, ఈ కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుంది ఉన్నంతమైన హోదాలో ఉన్న ఎస్టీ చైర్మన్ ఇలాంటి తప్పులు జరగకుండా ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మేలుకొని ఆదివాసి అయినా ఎస్టీ చైర్మన్ ని గుర్తించి ఆదివాసి బిడ్డలకి న్యాయం చేయాలని ఆదివాసుల తరపున మేం ఖండిస్తున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పిసా కమిటీ సభ్యులు పిట్ట టింకు, కర్ణాకర్, సోడి రామారావు, పాయం సత్యనారాయణ, పిట్ట రాముడు, సోడి రాముడు సవలశీ దుర్గాప్రసాద్, కుంజ రామారావు, పిట్ట శంకర్, లక్ష్మణరావు, వినోద్ కుమార్, విజయ్ కుమార్, మహిళలు సోడి శాంతమ్మ, సవలం కమలమ్మ, మడివి కనక పాపమ్మ, సుబ్బమ్మ, భద్రమ్మ, కళావతి, రజిని, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కుస్తీలో ప్రతిభ కనబరిచి గిరి పుత్రికలను అభినందించిన కలెక్టర్ దినేష్ కుమార్




ప్రజాభూమి, ప్రతినిధి-వి.ఆర్.పురం

దక్షిణ భారతదేశ స్థాయి కుస్తీలో ప్రతిభ కనబరిచిన మండల పరిధి సోములగూడెం ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికొన్నత పాఠశాలలో చదువుతున్న సురేఖ, సరిత లను పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం రంపచోడవరంలో వారినీ అభినందించారు. మడకం సురేఖ, బంధం సరిత గత నెల 16,17 తేదీలలో కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో జరిగిన సౌత్ ఇండియా జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పాల్గొని సురేఖ 33 కేజీల విభాగంలో కాంస్యం పతకం సాధించగా, బంధం సరిత 36 కేజీల విభాగంలో రజత పతకాన్ని సాధించారు. పోలవరం జిల్లా కి ఇంతటి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చినందుకు పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాన్ని అందించారు. రాబోయే కాలంలో ఇలాంటి పథకాలు మరెన్నో సాధించి మంచి పేరు ప్రతిష్టలు తేవాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఎన్ పూరి, శివ కుమార్(కోచ్), మడకం భద్రమ్మ(పి.డి) తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

-రాష్ట్రమంత్రి కొల్లు పార్థసారథి.

ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం



రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకుం టామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొల్లు పార్థసారథి హామీ ఇచ్చినట్లు ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పత్రికలకు మంగళవారం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథిని అమరావతి సచివాలయంలో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ మరియు పోలవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బొరగం శ్రీనివాసులు మంగళవారం కలిసి, చర్చిం చినట్లు వివరించారు . ఈ సందర్భంగా శ్రీనివాసులు మంత్రి పార్థసారథికి పోలవరం నియోజ కవర్గ పరిధిలోని పలు అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలను గురించి మంత్రి దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, గృహ నిర్మాణ పథకాల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన మంత్రి పార్థసారథి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తామని, సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

# ప్రజాభూమి



బుధవారం 03 జూన్ 2026

## సమస్యల పరిష్కారంపై స్పష్టత వచ్చేవరకు ఆందోళన -కొనసాగిన పారిశుద్ధ్య కార్మికుల నిరసన



ప్రజాభూమి, హిందూపురం టౌన్

మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సంస్థల పరిష్కారంపై అధికారులు స్పష్టత ఇచ్చేవరకు ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తామని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. మున్సిపల్ ఆప్కాస్ పారిశుద్ధ్య కార్మికులు చేపట్టిన నిరసన మంగళవారం 15 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి విఆర్ రాము, మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు నరసింహామూర్తి మాట్లాడుతూ, 220 మంది కార్మికులు హిందూపురం పట్టణ ప్రజలకు గత 25 సంవత్సరాల నుండి అతి తక్కువ వేతనం తీసుకొని సేవలందించారని పేర్కొన్నారు. ఇన్ని సంవత్సరాలు ప్రజలకు సేవలు అందించినప్పటికీ 60 ఏళ్ల వయస్సు పదవీ విరమణ అయిన తర్వాత ఎలాంటి ప్రయోజనాలు, పెన్షన్ ఏ ప్రభుత్వాలు కూడా చెల్లించలేదన్నారు. పదవీ విరమణ చేసిన కార్మికులకు కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని కోరినప్పటికీ ప్రభుత్వ అధికారులు ఈ సమస్యను కూడా పరిష్కరించడం లేదని వాపోయారు. గత సంవత్సరం నుండి 20 మంది కార్మికుల్లో కొంతమంది మృతి చెందగా మరి కొంతమంది పదవీ విరమణ చేశారన్నారు. ఓ వైపు పక్కన పట్టణ విస్తీర్ణం పెరిగి పట్టణ జనాభా పెరగడంతో పెద్ద ఎత్తున వ్యర్థాలు కూడా పెరిగిపోయాయని తెలిపారు. గత నెల క్రితం కార్మిక కుటుంబ సభ్యులకు సంబంధం లేని వ్యక్తుల ద్వారా ఒక్కొక్కరి నుండి లక్ష రూపాయలు దాకా లంచాలు తీసుకుని కొంతమందికి ఉద్యోగాలు కల్పించారని ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి సంబంధిత అధికారులకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హిందూపురం మున్సిపల్ యూనియన్ కోశాధికారి మల్లయ్య, సహాయ కార్యదర్శులు హెచ్. నరసింహామూర్తి, చంద్రశేఖర్, నాయకులు శంకర్, రవి, కృష్ణమూర్తి, అనిల్, మారుతి, మహిళా నాయకురాళ్లు మహేశ్వరమ్మ, బాధితులు ఓబులమ్మ, ప్రియాంక, నాగలక్ష్మమ్మ, గంగమ్మ, నారమ్మ, జయమ్మ, వెంకటరమణ, రామప్ప, నరసప్ప, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## అన్ని విధాలా గుడ్డం కోనేరు అభివృద్ధి

### -రూ.1.50 కోట్లు మంజూరు చేయించిన ఎమ్మెల్యే బాలకృష్ణ -మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున



ప్రజాభూమి హిందూపురం టౌన్

వినాయక చవితి సందర్భంగా విగ్రహాలను నిమజ్జనం చేసే గుడ్డం కోనేరును అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు వీరయ్య, బాలాజీ తెలిపారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకొని గుడ్డం కోనేరు అభివృద్ధికి రూ 1.50 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. దీంతో మంగళవారం ప్రజాసంఘాలు, ఆర్ఎస్ఎస్, వినాయక సేవా సమితి సభ్యులతో కలిసి గుడ్డం కోనేరును పరిశీలించారు. కోనేరు వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ, కోనేరు లోతు పెంచి వాస్తు ప్రకారం అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తూ అద్భుతంగా నిర్మిస్తామని తెలియజేశారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఎవరికి ఎలాంటి ఇబ్బంది లేకుండా లోతు పెంచడం, కెమికల్ బ్లాస్టింగ్ వంటి పద్ధతుల్లో సురక్షితంగా గుడ్డం రంగనాథ స్వామి ఆలయం కోనేరు నిర్మాణ పనులు సెప్టెంబర్ లో రానున్న వినాయక చవితి లోపల పూర్తి చేస్తామని తెలియజేశారు. గుడ్డం కోనేరు అభివృద్ధికి నిధులు మంజూరు చేయించడం పట్ల హిందూ సంఘాల నాయకులు, కార్యకర్తలు, ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి, హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, హిందూపురం వినాయక ఉత్సవ సమితి సభ్యులు, వివిధ హిందూ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంట నష్టపోయినరైతులకు వెంటనేలిఎపరిహారం అందించాలి

### -ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, కౌలు రైతుసంఘం డిమాండ్



ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండల వ్యాప్తంగా ఇటీవల కురిసిన అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా అరటి పంటతో పాటు వివిధ ఉద్యాన, వాణిజ్య పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, నష్టపోయిన రైతులకు



ప్రభుత్వం తక్షణమే పరిహారం అందించే విషయంలో నిర్లక్ష్యం వీడి చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మరియు కౌలు రైతు సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. అదేవిధంగా మంగళవారం పుట్లూరు మండలం లోని సాలవేముల గ్రామంలో పంట నష్టపోయినటువంటి రైతు భాస్కర్ రెడ్డి తోటను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీటి రామాంజనేయులు మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా పుట్లూరు మండలంతో పాటు జిల్లాలోని అనేక మండలాల్లో అకాల వర్షాలు, ఈదురు గాలుల వల్ల అరటి, మామిడి, బొప్పాయి తదితర ఉద్యాన మరియు వాణిజ్య పంటలు భారీగా నష్టపోయాయని తెలిపారు. పంట నష్టంపై రైతులు అధికారులకు సమాచారం అందించినప్పటికీ స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ఎన్నికల సమయంలో రైతాంగ సంక్షేమం కోసం అనేక హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతుల కష్టాలను అర్థం చేసుకుని వెంటనే పంట నష్టం అంచనా వేసి, నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను విస్మరించడం తగదని, ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల అధ్యక్షుడు ఎన్. గోపాలకృష్ణ, మండల కార్యదర్శి సత్తార్ గోపాల్ యాదవ్, మండల గౌరవాధ్యక్షుడు బుసగాని చిన్ని కృష్ణుడు యాదవ్, రైతు సంఘం మండల నాయకులు, కమిటీ సభ్యులు మరియు రైతులు భాస్కర్ రెడ్డి, లక్ష్మి రెడ్డి, రామ్ శివారెడ్డి రామాంజనేయులు రంగస్వామి వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలి



ప్రజాభూమి, హిందూపురం టౌన్

నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఏఐఎస్ఇసి నాయకులు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషనల్ కమిటీ ఆధ్వర్యంలో అవినీతి ఎన్.టి.ఏను రద్దు చేయాలని, మెడికల్ కాలేజీలో అడ్మిషన్స్ కు రాష్ట్రాల స్థాయిలోనే ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని కోరుతూ సేకరించిన సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని మంగళవారం రెవిన్యూ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాజ్యాంగంలో విద్య ఉమ్మడి జాబితాలో ఉన్నందువల్ల మెడికల్ కళాశాలల నిర్వహణ కూడా రాష్ట్ర ప్రభుత్వాల కింద ఉన్న అంశమని పేర్కొన్నారు. కేంద్ర స్థాయిలో ఒకే ఉమ్మడి పరీక్ష అవసరం లేదని, రాష్ట్ర విద్యా శాఖ మంత్రిని కోరుతూ ఈ వినతి పత్రంపై ప్రజలతో సంతకాలు సేకరించి హిందూపురం తహసిల్దార్ ద్వారా సమర్పించడం జరిగిందన్నారు. నీట్ పేపర్ లీక్ కావడం ఇదేమీ మొదటిసారి కాదని, ప్రస్తుతం కూడా లీక్ కావడానికి కారణం కోచింగ్ మాఫియా హస్తం, ఎన్టీఏ అధికారుల అవినీతి ఉందన్నారు. దీనివల్ల 23 లక్షల మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంతో మానసిక వ్యథకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యలో అధికారాలను కేంద్రం చేతుల్లోకి తీసుకోవడానికి దేశమంతటికి ఒకే పరీక్ష పద్ధతిని తెచ్చి, అవినీతిని కూడా కేంద్రీకృతం చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కె మల్లిక్ దత్ కుమార్, కో కన్వీనర్ ఎం రామాంజనేయులు, సభ్యులు సలీంబాషా, రిటైర్డ్ ప్రిన్సిపాల్ గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గంగమ్మ జాతర

### –దీపోత్సవంతో మొక్కులు తీర్చుకున్న మహిళలు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మున్సిపల్ పరి మోడల్ కాలనీలో వెలసిన జలకంఠేశ్వర గంగమ్మ దేవాలయంలో మంగళవారం బెస్త సంఘం ఆధ్వర్యంలో జాతర ఘనంగా జరిగింది. ఉదయం నుండే దేవాలయంలో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మూలవిరాట్లను వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా మహిళలు బియ్యం పిండి, బెల్లంతో తయారు చేసిన సెలిమిడిని అలంకరించుకొని ఊరేగింపుగా దేవాలయానికి చేరుకుని హారతులు ఇచ్చారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థ,ప్రసాద వినియోగం చేశారు. ఈ కార్యక్రమంలో బెస్త సంఘం అధ్యక్షులు లక్ష్మీనారాయణ, పులివెందుల పారిశ్రామికవేత్త బెస్త గువ్వల గంగాధర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జెపికే రాము, బిజెపి నాయకులు రమేష్ రెడ్డి, మేడికుర్తి హరి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరిని ఓటర్లుగా నమోదు చేయాలి -క్షేత్రస్థాయిలో సమగ్ర వివరాలు తెలుసుకోవాలి






ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అర్హత కలిగిన వారందరూ ఓటర్ల జాబితాలో పేర్లు ఉండేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, తహసిల్దార్ వెంకటేష్ సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల సవరణ ప్రక్రియపై మంగళవారం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని హిందూపురం అర్బన్, రూరల్ మండలాలకు చెందిన బూత్ స్థాయి అధికారులతో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వంద శాతం తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. బూతు స్థాయి అధికారులు ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన మార్గదర్శకాలు చేశారు. ఇంటింటి సర్వే నిర్వహణ, ఓటర్లను గుర్తించే విధానం, కుటుంబాల వారీగా వివరాల సేకరణ, ఓటర్ల మ్యాపింగ్, ఓటర్ల నమోదు పత్రాల పంపిణీ, సేకరణ, ధృవీకరణ ప్రక్రియలపై సమగ్ర అవగాహన కల్పించారు. అలాగే ప్రతి బూత్ స్థాయి అధికారి తమ పోలింగ్ స్టేషన్ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి, అక్కడ నివసిస్తున్న అర్హులైన ఓటర్లను గుర్తించడం, కొత్తగా ఓటు హక్కుకు అర్హత పొందిన వారి వివరాలను నమోదు చేయడం, చిరునామా మార్పులు, మరణించిన ఓటర్ల వివరాలు, ఇతర మార్పులను ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. ప్రత్యేక సవరణ ప్రక్రియలు ఎలాంటి పొరపాట్లు లేకుండా, పారదర్శకంగా, సమగ్రంగా పనిచేయాలని, ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలోఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, విధుల్లో అలసత్వం వహిస్తే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు. సంబంధిత సూపర్ వైజర్లు తమ పరిధిలో ఉన్న బూతు స్థాయి అధికారులతో రోజువారీ పర్యవేక్షణ చేయాలన్నారు. బూత్ స్థాయి అధికారులు ఈ నెల 15వ తేదీ నుండి జూలై 14వ తేదీ వరకు ప్రతి ఇంటిని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సవరణను విజయవంతం చేయాలన్నారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఓటరు పేరు, ఫోటో, చిరునామా తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, నివాస ప్రాంతం, ఇంటి నెంబరు, ఇతర వివరాలను పరిశీలించి ఓటర్ల జాబితాను నవీకరించాలని, గడువు తేదీ లోగా వందశాతం పారదర్శకత ఓటరు జాబితాను సర్వే చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దారు యం. మహేష్, హిందూపురం అర్బన్, రూరల్ ప్రాంతాలకు చెందిన బూత్ స్థాయి అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలి

### -ఏపీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల పిలుపు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాల సాధన, భద్రతా చర్యల అమలు కోసం ఐక్యంగా పోరాడాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) జిల్లా అధ్యక్షులు షఫీవుల్లా, జిల్లా కార్యదర్శి రామాంజనేయులు పిలుపునిచ్చారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సంఘటిత ఉద్యమాలే మార్గమని, ప్రతి విలేకరి సంఘ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో మంగళవారం షబ్బీర్ అధ్యక్షతన నిర్వహించిన ఏపీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ సర్వసభ్య సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ పథకం అమలు చేయాలని, ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలను ఆంధ్రప్రదేశ్‌లో కూడా ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, గృహ నిర్మాణాలకు ప్రత్యేక రుణ సదుపాయాలు కల్పించడంతో పాటు ఆరోగ్య భద్రత, ప్రమాద బీమా, కుటుంబ సంక్షేమ పథకాలను విస్తరించాలని కోరారు. విధి నిర్వహణలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కఠిన చట్టాలు తీసుకురావడంతో పాటు ఇప్పటికే ఉన్న చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నందున వారి భద్రత, గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు షఫీవుల్లా, జిల్లా కార్యదర్శి రామాంజనేయులు హిందూపురం నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా సీనియర్ జర్నలిస్టు కిష్టప్ప, అధ్యక్షులుగా చంద్రశేఖర్ రెడ్డి (టీవీ9), ఉపాధ్యక్షులుగా ఎం. రమేష్ (బీఆర్‌కే న్యూస్), బి. ఆంజనేయులు (ఆంధ్రప్రభ), ప్రధాన కార్యదర్శిగా గంగప్ప (ఐ న్యూస్), సహాయ కార్యదర్శులుగా గిరీష్ కుమార్ (ప్రైమ్ న్యూస్), చంద్రశేఖర్ (ఆంధ్రప్రభ), కోశాధికారిగా కె. అశోక్ కుమార్ (సీమ ప్రవంతి), రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా గిరీష్ కుమార్ (ఐన్యూస్)లను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా శంకర్ (ప్రజాశక్తి), కె. శివకుమార్ (6 టీవీ), చాంద్‌బాషా, హనుమంతరెడ్డి, హరికృష్ణ, ప్రశాంత్, అల్లిపీర నాగరాజులను ఎంపిక చేశారు. అదే విధంగా చిలమత్తూరు మండల కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షులుగా శంకర్, ఉపాధ్యక్షులుగా విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శిగా ఆంజనేయులు, సహాయ కార్యదర్శిగా నారాయణస్వామిలను ఎన్నుకోగా, లేపాక్షి మండల కమిటీలో అధ్యక్షులుగా సుబ్బరాయుడు, ఉపాధ్యక్షులుగా అవినాష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అశోక్ కుమార్‌లను ఎంపిక చేశారు.నూతనంగా ఎన్నికైన నాయకులను జిల్లా నాయకులు అభినందించి, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన, సంక్షేమ కార్యక్రమాల అమలులో సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

## అప్పుల భారంతో కుటుంబంలో విషాదం-బాధితులను పరామర్శించిన వేణురెడ్డి



ప్రజాభూమి, హిందూపురం టౌన్

అప్పుల భారం, ఆర్థిక ఇబ్బందులు ఓ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపిన ఘటన మంగళవారం హిందూపురం రూరల్ మండలం బీరేపల్లి గ్రామ పంచాయతీలో చోటుచేసుకుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందకపోవడం, కుటుంబ అవసరాల కోసం ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేయడం, ఆ అప్పుల ఒత్తిడిని తట్టుకోలేక గంధూడి ముద్దప్ప కుటుంబానికి చెందిన లక్ష్మి, ఆమె కుమారుడు రిషి ఆత్మహత్య చేసుకోవడం గ్రామంలో విషాద ఛాయలు అలుముకునేలా చేసింది. ఈ విషాద ఘటన విషయం తెలుసుకున్న వైసీపీ నియోజకవర్గ ముఖ్య నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి బీరేపల్లి గ్రామానికి చేరుకుని మృతుల భౌతిక కాయాలకు నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆవేదనను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఓదారుస్తూ, ఈ కష్టకాలంలో తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. వేణురెడ్డి మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులు, అప్పుల ఒత్తిడితో కుటుంబాలు ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితులు ఏర్పడటం అత్యంత దురదృష్టకరమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు పేద కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి తగిన న్యాయం, ఆర్థిక సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, వారి వెంటే పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉంటారని తెలిపారు. గ్రామస్థులు సైతం ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేయాన్ష్ వైద్య చికిత్సలకు సర్వప్రజా సేవా ట్రస్టు ఆర్థిక సహాయం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

లేపాక్షి మండలానికి చెందిన కేయాన్ష్ ఎస్ఎంఎస్ టైప్ –2 వ్యాధితో బాధపడుతుండగా చిన్నారి వైద్య చికిత్సల కోసం తల్లిదండ్రులు దాతల సహకారం కోరారు. ఇందులో భాగంగా మంగళవారం సర్వ ప్రజా సేవా ట్రస్టు ప్రతినిధులు కేయాన్ష్ ను పరామర్శించి వైద్య చికిత్స కోసం రూ. 20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. చిన్నారి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, సమాజంలోని దాతలు, సేవాభావం కలిగిన వ్యక్తులు కూడా ముందుకు వచ్చి సహాయం చేయాలని ట్రస్టు సభ్యులు కోరారు. బాధలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యతని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, స్థానిక ప్రజలు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అన్నదమ్ముల మధ్య ఘర్షణ. కేసు నమోదు చేసిన ఎస్ఐ సురేంద్రబాబు

ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండలంలోని ఏ కొండాపురం గ్రామానికి చెందిన అన్నదమ్ములు నాగరాజు మరియు గంగరాజు కుటుంబ సభ్యులు ఇంటి ముందర కొళాయి పైపు నీళ్ల విషయంలో గొడవ పడడం వలన నాగరాజును మరియు నాగరాజు భార్య పావని ని గంగరాజు భార్య .లక్ష్మినారాయణమ్మ గంగరాజు కుమార్తె .ప్రమీల కలసి కొట్టి రక్త గాయాలు కలగచేసారని పోతుల పావని, వయస్సు 30 సంవత్సరాలు, భర్త పి.నాగరాజు, ఇచ్చిన ఫిర్యాదు మేరకు పుట్లూరు పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రజాప్రతినిధుల బాధ్యతలపై ముఖ్యమంత్రి సమీక్ష



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, మంత్రి సవితా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, ఓటరు జాబితాల ప్రాముఖ్యత, ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రజాప్రతినిధుల బాధ్యతలపై విలువైన సూచనలు, దిశానిర్దేశం చేశారు. ఈ వర్క్‌షాప్‌లో ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ పరిశీలకులతో కలిసి పాల్గొని పలు అంశాలపై చర్చించారు.



ప్రజాభూమి



బుధవారం 03 జూన్ 2026

# పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

## -కోర్ కమిటీ సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్సీపీ కడప జిల్లా ఉపాధ్యక్షుడు డి.వి. శశికాంత్ రెడ్డి



ప్రజాభూమి,పులివెందుల

రాష్ట్ర రాజకీయ పరిణామాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన ఉద్యమాలు, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే అంశాలపై నిర్వహించిన వైఎస్సా ర్సీపీ కోర్ కమిటీ సమావేశాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో వైఎస్సార్సీపీ కడప జిల్లా ఉపాధ్యక్షుడు డి.వి. శశికాంత్ రెడ్డి పాల్గొని పార్టీ నాయకులకు పలు సూచనలు చేశారు.సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడం, ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలను పెంపొందించడం, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ కార్యక లాపాలను సమర్థవంతంగా నిర్వహించడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. పార్టీ శ్రేణులు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా డి.వి. శశికాంత్ రెడ్డి మాట్లాడుతూ, వైఎస్సార్సీపీ ప్రజల ఆశయాల తో ఏర్పడిన పార్టీ అని, ప్రజా సంక్షేమమే పార్టీ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్టీ నాయకులు అప్రమత్తంగా ఉండి వారి తరఫున పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల్లో రైతులు, కూలీలు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.పార్టీ అధినేత ఆలోచ నలకు అనుగుణంగా ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజలకు చేరువ కావాలని, పార్టీ సిద్ధాంతాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను విజయవం తం చేసేందుకు అందరూ సమన్వయంతో పని చేయాలని కోరారు.అదేవిధంగా ప్రజా సమస్యలపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే విధంగా పార్టీ తరఫున ఉద్యమాలు, నిరసనలు చేపట్టే అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కా రానికి కృషి చేయాలని నాయకులు నిర్ణయించారు. ఈ సమావేశంలో పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని పార్టీ బలోపేతానికి సంబంధించిన తమ అభిప్రాయాలు, సూచనలను వెల్లడించారు.

# డీఎస్సీపై వైసీపీ చేస్తున్న రాద్ధాంతం దుర్మార్గం

## - రాష్ట్ర మాజీ కల్లుగీత కార్మికుల సంఘం డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య



ప్రజాభూమి, ఒంటిమిట్ట: రాష్ట్రంలో ప్రభుత్వాన్ని విమర్శించేందుకు అంశాలు లేకపోవడంతో వైసీపీ 2025 డీఎస్సీ నియామకాలపై అనవసర రాద్ధాంతం చేస్తోందని టీడీపీ సీనియర్ నాయకుడు కొమరా వెంకట నరసయ్య విమర్శించారు. సోమవారం ఒంటిమిట్టలో టీడీపీ నాయకుడు మామిళ్ల ఈశ్వరయ్యతో కలిసి మీడియాతో మాట్లాడిన ఆయన, వైసీపీ పాలనలో ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయలేదని, కూటమి ప్రభుత్వం 16 వేల ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించిందన్నారు. డీఎస్సీని రద్దు చేస్తామంటూ వైసీపీ నాయకులు వ్యాఖ్యానించడం వేలాది మంది ఉపాధ్యాయ అభ్యర్థుల కుటుంబాల్లో ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, వాటి ద్వారా 23 లక్షల ఉద్యోగ అవకాశాలు సృష్టించబడనున్నాయని పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి బదులుగా అవినీతి పెరిగిందని ఆరోపించిన ఆయన, ప్రస్తుతం వెలుగులోకి వస్తున్న అక్రమాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే వైసీపీ డీఎస్సీ అంశాన్ని రాజకీయంగా ఉపయోగించుకుంటోందని విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యతిరేక ధోరణులను ప్రజలు గమనిస్తున్నారని, పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు తిరస్కరిస్తారని కొమరా వెంకట నరసయ్య అన్నారు.

# ఫోటోగ్రాఫర్ బాబు కుటుంబానికి ఆర్థిక సహాయం



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలోని నగరిగుట్ట చిన్నన్న రూములో నివాసముంటున్న ఫోటోగ్రాఫర్ బాబు గుండెపోటుతో వారం రోజుల క్రితం మృతి చెందా డు. ఈ విషయం తెలుసుకున్న పులివెందుల వైయస్సార్ ఫోటోఅసోసియేషన్ యూనియన్ అధ్యక్షుడు అల్లాబకాష్,గౌరవ అధ్యక్షులు శివారెడ్డి ప్రసాద్ సుధాకర్ చిన్న యోగి ఆధ్వర్యంలో మంగళ వారం బాబు నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులైన భార్య,పిల్లలకు 34000 నగదుతో పాటు నిత్యవసర సరుకులను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్సార్ ఫోటో యూనియన్ లో ప్రతి ఒక్కరు సేవా దృక్పథం అలవర్చుకొని యూనియన్ లో ఎవరికైనా ప్రమాదవశాత్త సంఘటనలు జరిగితే వారి కుటుంబ సభ్యులకు ఆసరాగా అండగా నిలబడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కేశవ,శివ, సురేంద్ర,దస్తగిరి, పరమే ష్,ఫోటోగ్రాఫర్లు,వీడియో గ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

# టెట్ పై పార్లమెంటులో సవరణ చేయాలని ఎస్టీయు డిమాండ్



ప్రజాభూమి పోరుమామిళ్ల :

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం చెల్లించవలసిన అరియర్స్ ను కొంత మేర చెల్లిం చడం, అదేవిధంగా వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో కార్పొరేషన్, సొసైటీ లో పనిచేసే 15,000 మంది ఉద్యోగ,ఉపాధ్యాయులకు పదవీవిరమణ వయస్సును 60 నుండి 6సంవత్సరాలకుపెంచడం, 2003 డీఎస్సీ వారికి పాత పింఛను అమలు చేయడం హర్షించదగ్గ విషయం దీనికి సహకరించినటువంటి విద్యాశాఖ మంత్రి ,ముఖ్యమంత్రి కి హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేస్తూ మరి అదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా ఇన్సర్వీస్ లో ఉన్న లక్ష మంది ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వంతో చర్చించి పార్లమెంటులో సవరణ చేయడానికి ఎంతో పరిపాలన అనుభవం ఉన్న ముఖ్యమంత్రి కృషిచేయాలని యస్ టి యు పక్షాన హృదయపూర్వకంగా కోరుకుంటూ ఆ దిశగా అడుగులు వేయాలని జిల్లా ఆర్థిక కార్యదర్శి యు. సుబ్రహ్మణ్యం ప్రభుత్వాని డిమాండ్ చేశారు.

# ఏంటీఎఫ్ స్కాలర్షిప్ ప్రోగ్రాం పోస్టర్ను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి

ప్రజాభూమి పోరుమామిళ్ల :

విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటునందించే లక్ష్యంతో మదర్ థెరెసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఎంటిఎఫ్ స్కాలర్షిప్ ప్రోగ్రాం పోస్టర్ను ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన అనాథలు మరియు తండ్రిని కోల్పోయిన విద్యార్థులకు విద్యా పరంగా అండగా నిలవడం అభినందనీయమైన సేవ అని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర ఎంతో కీలకమని ఆయన అన్నారు. మదర్ థెరెసా ఫౌండేషన్ చైర్మన్ చిత్తా రవి ప్రకాశ్ రెడ్డి, మేనేజింగ్ ట్రస్టీ చిత్తాగిరి ప్రణీత్ రెడ్డి ఆధ్వర్యంలో జూలై 5వ తేదీ సాయంత్రం 4 గంటలకు పోరుమామిళ్లలోని చిత్తా గ్రాండ్ ఫోర్ట్ కళ్యాణమండపంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల మండలంలోని



అన్ని ప్రభుత్వ పాఠశాలలో 200 మంది అర్హులైన అనాథ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1,000 నగదు స్కాలర్షిప్తో పాటు విద్యా సామగ్రితో కూడిన విద్యా కిట్లను అందజేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థుల ఉన్నత విద్యకు ప్రోత్సాహం అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులకు సేవలు అందించే లక్ష్యంతో మదర్ తెరెసా ఫౌండేషన్ విద్యా, వైద్య మరియు సామాజిక సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జెడ్పిటిసి ముత్యాల ప్రసాద్, సురేష్, రుద్రవరం ప్రసాద్, కొండయ్య, మాషిర్, ఎంపీపీ సి. భాష, దూల రఘునాథరెడ్డి, బాలుడు, కేపీ సుబ్బారెడ్డి ఫౌండేషన్ సభ్యులు, సామాజిక కార్యకర్తలు మరియు పలువురు ప్రముఖులు పాల్గొని కార్యక్రమ విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

## - కుప్పాల వెంకటసుబ్బయ్య



ప్రజాభూమి, సిద్ధవటం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య తెలిపారు. మండలంలోని కడప--చెన్నై జాతీయ రహదారి సమీపంలోని ఆకురోపల్లె ఎస్సీ కాలనీలో మంగళవారం ఆయన ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి చమర్తి జగన్మోహన్ రాజు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా తన వంతు సహకారం అందిస్తానన్నారు. మహిళల కోసం ప్రవేశపెట్టిన 'శ్రీశక్తి' పథకంద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం నిరుపేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని చెప్పారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. అలాగే అర్హులైన వారికి కొత్త పింఛన్లు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చర్యలు చేపట్టనుందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కృష్ణ యాదవ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్లో నకిలీ ఉద్యోగ నియామక ఉత్తర్వులు జారీచేసిన అధికారులపై చర్యలు ఎప్పుడు

## నకిలీ ఉద్యోగులకు ఇప్పటివరకు చెల్లించిన జీతభత్యాలు తిరిగి ఖజానాకు ఎప్పుడు జమ చేస్తారో ప్రజలకు చెప్పాలి


## - కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య



ప్రజా భూమి, కడప సిటీ :

జిల్లా పరిషత్ శాఖలో పనిచేస్తున్న పది హేను మంది నకిలీ ఉద్యోగులను విధుల నుంచి తొలగించడం స్వాగ తించదగ్గ చర్యేనని, ఇంతకాలం వారికి చెల్లించిన జీతభత్యాలను తి రిగి వసూలు చేసేందుకు ప్రభు త్వం ఎలాంటి చర్యలు తీసుక శీదో ప్రజలకు స్పష్టంగా తెలి యజేయాలని కాంగ్రెస్ పార్టీ కడప అసెంబ్లీ కోఆర్డినేటర్ బండి జకరయ్య డిమాండ్ చేశారు.కడప డీసీసీ కార్యాల యంలో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో మాట్లాడ తూనకిలీ నియామకాలు సా ధారణ పరిపాలనా లోపం కా దని, ఇది ప్రభుత్వ వ్యవస్థలో జరిగిన తీవ్రమైన అవినీతి, అ ధికార దుర్వినియోగానికి నిద ర్శనమని విమర్శించారు. ని యామక ఉత్తర్వులు జారీ చే సిన అధికారులు, సంబంధిత శాఖాధికారులు, కార్యాలయ సిబ్బంది, క్లరికల్ స్టాఫ్ పాత్రపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరా రు.ఏళ్ల తరబడి నకిలీ ఉద్యో గులు ప్రభుత్వ ఖజానా నుం చి జీతాలు పొందుతున్నప్పటి కీ,ఆ వ్యవహారం బయటపడ కపోవడం పరిపాలనా వైఫల్య మని ఆయన పేర్కొన్నారు.ప్ర భుత్వ నిధులు దుర్వినియో గం కావడానికి కారణమైన అ ధికారులను కాపాడే ప్రయత్న శీ చేస్తే ప్రజలు సహించరని హె చ్చరించారు.ఈ వ్యవహారంపై విజిలెన్స్,స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించి, బాధ్యుల ఆస్తుల వివరాలు కూడా పరిశీలించాలని బండి జకరయ్య డిమాండ్ చేశారు. ప్రజల పన్నుల రూపంలో స మకూరిన ధనాన్ని దోచుకున్న వారిని కఠినంగా శిక్షించాల్సిన అవసరం ఉందన్నారు. నకిలీ ఉద్యోగులను తొలగించడం మాత్రమే సరిపోదని,వారికి ఇ ప్పటివరకు చెల్లించిన జీతభ త్యాలు,ఇతర అలవెన్సులు మొత్తం ఎంతన్నది వెల్లడించి, ఆ మొత్తాన్ని ఎలా రికవరీ చే యనున్నారో ప్రభుత్వం ప్రకటి శీచాలని ఆయన కోరారు.భవి ష్యత్తులో ఇటువంటి అక్రమ నియామకాలు పునరావృతం కాకుండా పారదర్శక నియామ క వ్యవస్థను అమలు చేయా లని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.ఈ సమావే శంలో కేకేసి జిల్లా అధ్యక్షులు దాసరి శ్రీనివాసులు, షామీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

# అర్హులకు ఓటు హక్కు ఉండాలి అఖిలపక్ష నాయకులు



ప్రజాభూమి పోరుమామిళ్ల :

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్ ఐ ఆర్ కార్యక్రమానికి పోరుమామిళ్ల మండల ఎమ్మార్వో సూచన మేరకు ఆల్ పార్టీ మీటింగ్ కు హాజరైన పోరుమామిళ్ల భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు నారిసెట్టి నాగేంద్ర, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి పల్లంశెట్టి పండరి, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన జిల్లా కన్వీనర్ నారోజు రమణాచారి హాజరై ఎస్ ఐ ఆర్ పైన ఏ ఒక్క అర్హుడైన ఓటరు పేరు తొలగించకుండా. అనర్హుల ఓటు ఉండ కుండా పక్కాగా. పారదర్శకంగా నిర్వహించాలని ఎమ్మార్వో ని కోరడమైనది. ఈ కార్యక్రమంలో రకుల్ పక్ష నాయకులు కలవకూరి రవి, రమణ, రమణాచారి తదితర నాయకులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలి

## -అఖిలపక్ష పార్టీ నాయకులు



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని యర్రగుడి పల్లి స్కూల్ లో బి ఎల్ వోలు అఖిలపక్ష పార్టీ నాయకులతో సమావేశం మంగళ వారం నిర్వహించారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు ఓటర్ లిస్ట్ లో ఉండాలన్నారు. కొత్త ఓటర్లు, ఫోటో మార్పు, ఓటర్ యొక్క వార్డు మార్పులు, చనిపోయినవారి ఓట్లు తొలగింపు పై బి ఎల్ ఓ తో వారు చర్చించారు. ఈ సందర్భంగా వైకాపా నాయకులు కోళ్ల భాస్కర్, పురుషోత్తం సుమిత్ర, సుధాకర్, ప్రకాశం, వెంకట స్వామి లు మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ఓటర్ల కలర్ ఫోటోలు తీసుకు రమ్మంటున్నారు. ఇలా చేయడం వలన ప్రతి కుటుంబం పైన 500 రూపాయలు నుండి 1000 రూపాయలు భారం పడడం జరుగు తుందన్నారు. ఈభారన్ని ప్రభుత్వమే భరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, అజ్జరయ్య, టిడిపి నాయకులు మునయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ లాంటి నాయకున్ని ఆపడం ఎవరి తరం కాదు..

## - రాజంపేట పార్లమెంటు సమన్వయకర్త అతికారి కృష్ణ



ప్రజాభూమి, సిద్ధవటం: జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్పై ఆంక్షలు విధించడం లేదా ఆయన కార్యక్రమాలకు అడ్డంకులు సృష్టించడం ఎవరి వల్లా కాదని రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ విమర్శించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్లో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు జనసేన పార్టీ చేసిన ప్రయత్నాలకు అనుమతులు నిరాకరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ కేవలం ఒక రాష్ట్ర నాయకుడు మాత్రమే కాదని, దేశవ్యాప్తంగా యువత, ప్రజల్లో విశేష ఆదరణ పొందిన నాయకుడని అన్నారు. అలాంటి నాయకుడి సభలకు అనుమతి ఇవ్వకుండా అడ్డుకోవడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రజాస్వామ్య దేశంలో ఎవరైనా ఏ రాష్ట్రంలోనైనా రాజకీయ కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చని, దేశంలో తిరగడానికి పాస్పోర్ట్ అవసరం లేదని వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్కు పెరుగుతున్న ప్రజాదరణను చూసి కొందరు రాజకీయ నాయకులు భయపడుతున్నారని, అందుకే జనసేన పార్టీ కార్యకలాపాలను అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. తెలంగాణలో కూడా జనసేనకు ఆదరణ రోజురోజుకు పెరుగుతోందని, ఆ వాస్తవాన్ని జీర్ణించుకోలేక కొందరు నాయకులు అనవసర వివాదాలు సృష్టిస్తున్నారని అన్నారు. జనసేన పార్టీ ఎదుగుదలను ఎవరూ అడ్డుకోలేరని, ప్రజల మద్దతుతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన ప్రభుత్వాలు రాజకీయ పక్షపాత ధోరణితో వ్యవహరించడం సరికాదని, ఇలాంటి చర్యలు ప్రజల్లో వ్యతిరేకతను పెంచుతాయని అతికారి కృష్ణ హెచ్చరించారు.

# సిద్ధవటంలో విత్తన బంతీ కార్యక్రమం..

## - అటవీ పచ్చదనానికి శ్రీకారం



ప్రజాభూమి, సిద్ధవటం: అటవీ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విత్తన బంతీ కార్యక్రమాన్ని మంగళవారం సిద్ధవటం మండలంలోని రాజీవ్ స్మృతి వనంలో నిర్వహించారు. కడప డీఎఫ్వో వినీత్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సబ్ డీఎఫ్వో స్వామి వివేకానంద పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింత, కానుగ, ఉసిరి, నేరేడు, మారేడు తదితర వృక్షాలు, ఔషధ మొక్కల విత్తనాలతో గోలీలు తయారు చేసి వర్షాకాలంలో అటవీ ప్రాంతాల్లో చల్లడం ద్వారా పచ్చదనం పెంచనున్నట్లు తెలిపారు. 70 శాతం సేంద్రియ ఎరువు, 30 శాతం ఎర్రమట్టితో విత్తన గోలీలు తయారు చేసి స్వచ్ఛంద సంస్థల సహకారంతో అడవుల్లో విస్తరించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

# డ్రైనేజీ, నీటి సమస్యను త్వరతిగతిన పూర్తి చేయండి

## జరుగుతున్న పనులను పరిశీలించిన వైయస్ మనోహర్ రెడ్డి



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని అహోబిలాపురం, వైయస్ జయమ్మ కాలనీలో జరుగు తున్న నీటి పైపులైన్ పనులను డ్రైనేజీ పనులను మంగళవారం మున్సిపల్ వైకాపా ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లి కిషోర్, మాజీ కౌన్సిలర్ కోడి రమణ లు పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజల వినతి మేరకు జరుగుతున్న పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా వైయస్ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడే గాని నీటి సమస్య , డ్రైనేజీ సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు పరిష్కరింప జేయాలని సూచించారు. జరుగుతున్న పనులను గుత్తేదారులు నాణ్యతతో చేయాలని వారికి సూచించారు. సమస్యల పరిష్కారమే వైకాపా లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల వలయంలో సిద్ధవటం..

## - డ్రైనేజీ, అపరిశుభ్రతతో ప్రజల ఇక్కట్లు



ప్రజాభూమి, సిద్ధవటం: ఒకప్పుడు జిల్లా పరిపాలన కేంద్రంగా ఉన్న సిద్ధవటం ప్రస్తుతం డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. బ్రాహ్మణ వీధిలో డ్రైనేజీ నీరు రహదారిపై ప్రవహిస్తుండగా, దిగువపేట ప్రధాన రహదారి పక్కన అపరిశుభ్రత పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. మఠం వీధిలో ఇటీవల కురిసిన వర్షాలకు రహదారిపై చెట్టు కూలిపడి దాదాపు పది రోజులు గడిచినా తొలగించకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై మండల విస్తరణ అధికారి మెహతాబ్ యాస్మిన్ స్పందిస్తూ, బ్రాహ్మణ వీధి డ్రైనేజీ సమస్యను పరిష్కరించడంతో పాటు దిగువపేట అపరిశుభ్రత తొలగింపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మఠం వీధిలో కూలిన చెట్టును తొలగించేందుకు స్థల యజమానితో మాట్లాడి అవసరమైన చర్యలు చేపడతామని చెప్పారు.

# దాదా గాంధీ ని కలిసిన ధ్రువ కుమార్ రెడ్డి



ప్రజాభూమి,పులివెందుల

కాంగ్రెస్ మైనారిటీ సెల్ రాష్ట్రం అధ్యక్షులు దాదా గాంధీని అనంతపురంలో మంగళవారం పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి మూలంరెడ్డి ధ్రువకుమార్ రెడ్డి,పులివెందుల పట్టణం అధ్యక్షుడు బోనాల ఖాదర్ వల్లి లు మర్యాదపూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగాధ్రువకుమార్ రెడ్డి మాట్లాడుతు రాష్ట్ర రాజకీయంలో ముస్లిం, క్రిస్టియన్ ప్రాధాన్యత ఉంది, వీరు కాంగ్రెస్ వైపు ఉన్నారన్నా రు.కాని రాజశేఖర్ రెడ్డి మరణం తరువాత జగన్ రెడ్డి వైపు వెళ్లారు,మళ్లి రాజశేఖర్ రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిల రెడ్డి ఏపీసీసీ అధ్యక్షులుగా నియమితులు కావడం తో మళ్లి రాజశేఖర్ రెడ్డి అభిమా నులు ,ముస్లిం,క్రిస్టియన్ ఓట్లు కాంగ్రెస్ వైపు తిరిగే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయన్నారు. కావున పులివెందుల నియోజకవర్గం లో ముస్లిం, క్రైస్తవ నాయకులను గుర్తుంచి కాంగ్రెస్ పార్టీ చెసిన అబివృద్ధి గుర్చి వివరించి,వారిని పార్టిలోకి చెర్పించాలని,షర్మిలమ్మ నాయకత్వంలో మనం పనిచేయడం చాలా గర్వకరణం ఆయన అన్నారు. వైయస్ షర్మిల నాయకత్వంలో పార్టీ బలోపేతం కోసం ఇంకా ముందుకు వెళ్తామని ఆయనకు సూచించారు.

# ప్రజాభూమి

**తిరుపతి,చిత్తూరు** 8

బుధవారం 03 జూన్ 2026


## డ్రగ్స్ పై దండయాత్ర--2.0" కార్యక్రమం విజయవంతం

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.



"పరీక్ష చేద్దాం -- మత్తును వదిలిద్దాం" నినాదంతో ప్రత్యేక అవగాహన ఔ డ్రగ్ డిటెక్షన్ కార్యక్రమం నిర్వహణ. ఆంధ్రప్రదేశ్ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు, తిరుపతి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్ సూచనలతో, అదనపు ఎస్పీ (క్రైమ్స్) ఆర్ల శ్రీనివాసరావు. నేతృత్వంలో, రేణిగుంట సబ్-డివిజన్ పోలీసు అధికారి వై. శ్రీనివాసరావు. పర్యవేక్షణలో నిర్వహిస్తున్న "డ్రగ్స్ పై దండయాత్ర--2.0" కార్యక్రమంలో భాగంగా, ఈ రోజు ఏర్పేడు మండలం మేర్లపాక గ్రామ సమీపంలో ఉన్న పుష్పిత్ స్టీల్ ఫ్యాక్టరీ వద్ద ప్రత్యేక డ్రగ్ అవగాహన మరియు పరీక్షా కార్యక్రమం నిర్వహించబడింది. "పరీక్ష చేద్దాం -- మత్తును వదిలిద్దాం" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డ్రగ్ డిటెక్షన్ బస్సు మరియు గంజాయి వినియోగాన్ని గుర్తించే ఆధునిక కిట్ల సహాయంతో పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఏర్పేడు మండలం మేర్లపాక గ్రామ పరిసర ప్రాంతంలో 300 మందికి గంజాయి గుర్తింపు పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, మాదకద్రవ్యాల నిర్మూలన కోసం తిరుపతి జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. యువత భవిష్యత్తును దెబ్బతీసే గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం, నిల్వ, అక్రమ రవాణా వంటి కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని స్పష్టం చేశారు. సమాజాన్ని మత్తు రహితంగా మార్చడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని సూచించారు. ప్రజలు తమ పరిసరాల్లో ఎవరైనా మాదకద్రవ్యాల వినియోగం లేదా అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల సహకారం అత్యంత అవసరమని, పోలీస్ శాఖతో కలిసి ముందుకు వస్తే సమాజాన్ని సురక్షితంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దగలమని అధికారులు పిలుపునిచ్చారు. మొదటసారి పరీక్ష లో పాజిటివ్ వచ్చినట్లయితే వారికి తగిన కౌన్సిలింగ్ మరియు రిహాబిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తామని, రెండవసారి కూడా పరీక్షలో పాజిటివ్ వచ్చినట్లయితే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాసరావు, ఏర్పేడు ఇన్‌స్పెక్టర్ శ్రీకాంతరెడ్డి , ఏర్పేడు ఎస్ఐ రవిప్రకాష్ తో పాటు పోలీసు సిబ్బంది మరియు పుష్పిత్ఇండస్ట్రీస్ ప్రవేట్ లిమిటెడ్ లిమిటెడ్ మేనేజ్మెంట్ వారి సహకారం తో సంస్థ అసిస్టెంట్ జనరల్ మేనేజరు పి. రామకృష్ణాచారి మరియు వారి సిబ్బంది పాల్గొన్నారు.

## ఏ,ఐ-ఎనేబుల్డ్ ఈ, సి, డిస్క్రీనింగ్‌పై రెండు రోజుల జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం ప్రారంభం..

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ (డబ్ల్యు, డి, సి, డబ్ల్యు), తిరుపతి (జూన్ 2, 3 తేదీలలో) " ఏ,ఐ-ఎనేబుల్డ్ ఎర్లీ చైల్డ్‌హుడ్ డెవలప్‌మెంట్ ( ఈ, సి ,డి) స్క్రీనింగ్" (0-6 సంవత్సరాల పిల్లల కోసం) అనే అంశంపై జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమం కలెక్టరేట్ లో,మీటింగ్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మరియు రాష్ట్ర మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి, ఐ,ఏ,ఎస్, తదితరులు పాల్గొన్నారు.

## కుక్క కాటు నివారణ, చికిత్స సేవలపై ఆకస్మిక తనిఖీలు ఆరోగ్య కేంద్రాలు, పశువైద్యశాలలో రికార్డుల పరిశీలన - అధికారులకు కీలక సూచనలు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య ఆధ్వర్యంలో కుక్క కాటు కేసుల నివారణ, బాధితులకు అందిస్తున్న వైద్య సేవలు, సమాజంలో అవగాహన కార్యక్రమాల అమలుపై సమగ్ర పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్



రెడ్డప్ప, డాక్టర్ గిరి, ఎపిడెమియాలజిస్ట్ వెంకటేశ్వర్లు, ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రవీణ్‌తో కూడిన బృందం తిరుపతిలోని త్యాగరాజ స్ట్రీట్‌లో గల అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఏరియా ఆసుపత్రి మరియు పశువైద్యశాలను సందర్శించింది. పరిశీలనలో భాగంగా కుక్క కాటు బాధితులకు అందిస్తున్న చికిత్స, యాంటీ రేబిస్ వ్యాక్సిన్ నిల్వలు, వ్యాక్సినేషన్ విధానం, కేసుల నమోదు వివరాలు, రికార్డుల నిర్వహణ, ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించారు. అలాగే కుక్క కాటు ఘటనలపై సంబంధిత శాఖల మధ్య సమన్వయం, బాధితులకు తక్షణ వైద్య సేవల అందుబాటు, ప్రజల్లో అవగాహన పెంపు చర్యలపై ప్రత్యేకంగా చర్చించారు. సందర్శన సందర్భంగా రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన బృందం, వైద్య సేవలను మరింత మెరుగుపరచడం, వ్యాక్సిన్ నిల్వలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచడం, కుక్క కాటు కేసుల నమోదులో ఖచ్చితత్వం పాటించడం, ప్రజలకు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడం వంటి అంశాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించింది. ప్రజలు కుక్క కాటు ఘటనలు జరిగిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్యుల సూచనల మేరకు పూర్తి స్థాయి చికిత్స తీసుకోవాలని, నిర్లక్ష్యం చేయరాదని అధికారులు సూచించారు.

## ఎంఈఓ-2 ముని సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రభుత్వ బడి పిలుస్తోంది కార్యక్రమం

ప్రజా భూమి ప్రతినిధి, బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా బి. ఎన్ కండ్రిగ మండలంలోని నెలవాయి గ్రామంలో మండల విద్యాశాఖ అధికారి ఎంఈఓ-2 ఎ. ముని సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రభుత్వ బడి పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నెలవాయి గ్రామ సమీపంలోని సేలం వారి ఇండ్ల ప్రాంతంలో ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్న నాణ్యమైన విద్య ఆధునిక సదుపాయాలు ఉచిత పాఠ్యపుస్తకాలు యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం తదితర సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి అనుకూలమైన వాతావరణం ఉందని, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను ప్రోత్సహించారుప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేయడం, విద్యార్థుల చేరికలను పెంచడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎంఈఓ-2 ముని సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో నెలవాయి గ్రామ పెద్ద టీ. కన్నయ్య నాయుడు, నెలవాయి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుపాల్, ఉపాధ్యాయులు నందిని, ప్రేమలత, సీఆర్పీ బి. ఈశ్వరమ్మ పాల్గొని తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలపై అవగాహన కల్పించారు.

## కాలువల్లో ఎప్పటికప్పుడు సిల్ట్ తొలగించండి -కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి.


ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



నగరంలోని మురుగునీటి కాలువల్లో ఏర్పడ్డ సిల్ట్ (చెత్త) ను ఎప్పటికప్పుడు తొలగించాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి అధికారులకు సూచించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా నగరంలోని ఎర్ర మిట్ట, పల్లి వీధి, వేశాలమ్మ గుడి దగ్గర, టౌన్ క్లబ్ కూడలి వద్ద జరుగుతున్న కాలువల్లో చెత్త తొలగింపు పనులను పరిశీలించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా నగరంలోని పెద్ద పెద్ద డ్రైన్లలో పేరుకు పోయిన చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయాలని తెలిపారు. రుతుపవనాల వల్ల రానున్న వర్షాలతో నీరు సజావుగా వెళ్లేలా తగు చర్యలు చేపట్టాలని తెలిపారు. కాలువల్లో చెత్త వేయవద్దని ప్రజలకు సూచించారు. ప్రజల సహకారంతో స్వచ్ఛ తిరుపతి సాధ్యం అవుతుందని తెలిపారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఎర్రమిట్టలో ప్రజల త్రాగునీటి సమస్య పరిష్కరించేందుకు బోర్ వేసేందుకు పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, మాజీ కార్పొరేటర్ నరసింహ ఆచారి, ఏసిపి మూర్తి, డిఈ లు రమణ, లలిత, డీఎఫ్ఓ శ్రీనివాసరావు, శానిటేషన్ సూపర్వైజర్ లు చెంచయ్య, సుమతి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోకియా మేరీ కర్మక్రియల్లో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి పాకాల



పాకాల మండలం వాలంటరీ విభాగానికి చెందిన మౌనిక తల్లి ఆరోకియా మేరీ ఇటీవల మరణించారు. పాకాల పట్టణంలోని భారతంమిట్ట 5వ వీధిలోని వారి ఇంటి వద్ద సోమవారం జరిగిన కర్మక్రియల్లో రాష్ట్ర వైఎస్ఆర్‌సీపీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పాల్గొన్నారు. మౌనిక తల్లి ఆరోకియా మేరీ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నంగా నరేష్‌రెడ్డి, పార్టీ యువజన విభాగం నాయకులు కఫిలేశ్వరరెడ్డిలతో పాటు స్థానిక నేతలు, కార్యకర్తలు వున్నారు.

## రైల్వే ప్రాజెక్టులు, భూసేకరణ, జాతీయ రహదారులు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

### రెవెన్యూ పీ.జీ.ఆర్.ఎస్, రిసర్వే, 22ఏ నిషేధిత జాబితా కేసులను మొదటి ప్రాధాన్యత తో పరిష్కారం చూపాలి.

**-: జిల్లా కలెక్టర్ డా,, ఎస్. వెంకటేశ్వర్**

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి,



రైల్వే ప్రాజెక్టులు, భూసేకరణ, జాతీయ రహదారులు నిర్మాణ పనులను,భూ సమస్యలు, రెవెన్యూ పీ.జీ.ఆర్.ఎస్, రిసర్వే, 22ఏ నిషేధిత జాబితా కేసుల పరిష్కారం, మాన్యువల్ రెవెన్యూ రికార్డుల డిజిటలీకరణ, పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ, త్వరితగతిన పూర్తి చేయాలని,రైల్వే ప్రాజెక్ట్ పనులు,శ్రీ సిటీ ఫేస్ -2, ఎల్ జి ఫేస్-2, కొల్లాడం, ఇరుగుళం, పెద్దేటిపాకం, రాళ్లకుప్పం, స్పేస్ సిటీ ఫేస్ 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, రాయల్ ఎంఫిల్డ్, జాతీయ రహదారులు, వైజాగ్ చెన్నై కారిడార్ పైపు లైన్ పనులు,ఏ డీబి రోడ్డులు, దుగ్గరాజపట్నం పనులు, కృష్ణపట్నం పోర్ట్, రైల్వే ప్రాజెక్ట్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి శ్రీ సిటీలోని ఎల్జి కంపెనీకి సంబంధించి పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులపై సమీక్షా పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళిక భద్దంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, జిల్లా రెవిన్యూ అధికారి జి. నరసింహులుతో కలసి జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ సమీక్షా నిర్వహించి దిశా నిర్దేశం చేసారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని మిని సమావేశ మందిరంలో రైల్వే ప్రాజెక్ట్ పనులు,రాయల్ ఎంఫిల్డ్ జాతీయ రహదారులు, వైజాగ్ చెన్నై కారిడార్ పైప్ లైన్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి దుగ్గరాజపట్నం పనులు, శ్రీ సిటీ ఫేస్ -2, ఎల్ జి ఫేస్-2,స్పేస్ సిటీ ఫేస్ 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, అంశాలు సంబంధించిన పలు భూ సంబంధిత పెండింగ్ అంశాలు, ఏ డీబి రోడ్డులపై నిర్మాణ పురోగతి పనులపై జిల్లా కలెక్టర్ వర్చువల్ విధానంలో తిరుపతి, నెల్లూరు , చెన్నై నేషనల్ హైవే పి డి లు, రైల్వే ప్రాజెక్టు అధికారి వామన మూర్తి, సదరన్ రైల్వే అధికారి శశిభూషన్,నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎల్. శివకుమార్, శ్రీ సిటీ జనరల్ మేనేజర్ భగవాన్,ఈ ఈ ఇరిగేషన్ సంబంధిత మండలాల తహసీల్దార్లు, కాంట్రాక్టర్లు,తదితర సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..శ్రీ సిటీ ఫేజ్ -2, ఏ పి ఐ ఐ సి లోని ఎల్ జి ఫేజ్ -1,2, 3 రాయల్ ఎంఫిల్డ్,.కొల్లాడం, ఇరుగుళం,పెద్దేటిపాకం,రాళ్లకుప్పం, శ్రీ సిటీ ఫేజ్ -1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, ప్రాజెక్టు లకు సంబందించిన పెండింగ్ భూసేకరణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టు లకు సంబందించిన పెండింగ్ కోర్టు కేసులను కూడా త్వరగా పరిస్కారం అయ్యేలా చూడాలన్నారు. వెబ్ ల్యాండ్ పై వున్న సమస్యలను సత్వరమే పరిస్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కొరకు చేపడుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులు, వైజాగ్ చెన్నై కారిడార్ పైపు లైను పనులు, రైల్వే ప్రాజెక్ట్స్ పనులు పురోగతిలో ఉన్న పనులపై నడికుడి - శ్రీకాళహస్తి, ఏర్పేడు - పూడి, గుమ్మడి పూండి-గూడూరు, గూడూరు-రేణిగుంట, తిరుపతి - కాట్పడి, తిరుపతి - పాకాల, అర్కోణం - రేణిగుంట, సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలన్నారు. ఆరు లైన్లు రహదారులు నిర్మాణం, నాయుడుపేట-రేణిగుంట, రేణిగుంట- కడప రేణిగుంట నుండి చెన్నై రహదారుల పనులు పూర్తి చేయాలని భూ సేకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్యాకేజీ 2,3,4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయంతో చేసుకొని నాణ్యత తో పనులు పూర్తి కావాలని అన్నారు. ఎయిర్పోర్ట్, ఇస్సేర్, కరకంబాడి, ఎమ్ ఐ జి లే అవుట్ తిమ్మాజికండ్రిగ, పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు. అలాగే ఆర్ అండ్ బి , పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, ఇరిగేషన్ ఫారెస్ట్, జల వనరుల శాఖ అధికారులు అందరూ కలసి సమన్వయంతో పెండింగ్ పనులను నిర్దేశించిన గడువు లోపల పూర్తి చేయాలన్నారు. ఏపీఐఐసీ ప్యాకేజీ 5, ఎడిబి రోడ్లు పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. రెవెన్యూ పీ.జీ.ఆర్.ఎస్. ద్వారా అందిన ప్రజా ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. రీ-సర్వే కార్యక్రమాన్ని నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి భూ యజమానుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని పేర్కొన్నారు. 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న కేసులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హత కలిగిన వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మాన్యువల్ రెవెన్యూ రికార్డుల డిజిటలీకరణ ప్రక్రియను వేగవంతం చేసి, భూ రికార్డులను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అలాగే అర్హులైన రైతులకు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీని వేగవంతం చేయాలని, ప్రజలకు రెవెన్యూ సేవలు మరింత సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, తిరుపతి,శ్రీకాళహస్తి సూళ్లూరుపేట ఆర్డీఓలు, రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భరత్ నాయక్, రోజ్ మాండ్, ఆర్ అండ్ బి ఎస్ ఈ రాజా నాయక్,ఎస్ ఈ పంచాయతీ రాజ్, ఎస్ ఈ, ఆర్డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ అధికారి ల్యాండ్ అండ్ సర్వే రికార్డ్స్ ఇంచార్జి రాంప్రసాద్, ఏపీఐఐసీ తిరుపతి జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, సంబంధిత తహసీల్దార్లు, డెప్యూటీ తహసీల్దార్లు , సెక్షన్ అధికారులు భాస్కర్, చైతన్య, భూసేకరణ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన కాలనీలో గర్భిణీ స్త్రీలకు సామూహిక శ్రీమంతాలు

ప్రజా భూమి ప్రతినిధి వాకాడు



తిరుపతి జిల్లా వాకాడు చిట్టమూరు మండ లాల్లోని గిరిజన కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న గర్భిణీ స్త్రీలకు మంగళవారం కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన ఎం వి రావు ఫౌండేషన్ నిర్వాహకులు సా మూహిక శ్రీమంతాలు నిర్వహించారు. కోట ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని వాకాడు మండలం కొండూరు పంచాయతీ పరిధిలో ఉన్న బూడిదల వాగు గిరిజన కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో సామూహిక శ్రీమంతాలు నిర్వహించి గర్భవతులకు సారే చీర గాజులు పసుపు కుంకుమ పూలు పండ్లు స్వీటు హిందూ సాంప్రదాయ బద్ధంగా సామూహిక శ్రీమంతం నిర్వహించారు. అదేవిధంగా కిశోర బాలికలకు పౌష్టికాహారాన్ని అందజేసి, వేసవి వడగాలిపులకు గురికాకుండా ముందస్తు జాగ్రత్త చరిగా హోమియో మందులను పంపిణీ చేశారు. బూడిదల వాగు గిరిజన కాలనీలో కిశోర బాలికలకు పౌష్టికాహారాన్ని అందజేయడమే కాక వేసవి కాలులకు వడదెబ్బకు గురి కాకుండాహోమియో మందులను అందజేశారు. కార్యక్రమంలో ఎం.విరావు ఫౌండేషన్ చైర్మన్ ముప్ప వరపు లీలా మోహన్ కృష్ణ కార్యదర్శి ఎం విజయలక్ష్మి అంగన్వాడీ సిబ్బంది విజయమ్మ అరుణ మ్మ గర్భవతులు కిశోర బాలికలు అంగనవాడి పరిధిలోని చిన్నారులుగ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## అయ్యా ఇటు చూడండయ్యా

### - కాంగ్రెస్ పార్టీ నాయకులు తలపా దామోదరం రెడ్డి

ప్రజాభూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి పట్టణం 29వ వార్డు నందుగల నక్కల కాలువ నందు గత సంవత్సరం నిర్మించినటువంటి



మురుగు కాలువ కారణంగా నక్కల కాల్వ వంతెన వద్ద గత వర్షాకాలంలో పడిన వర్షాల కారణంగా మట్టి కోతకు గురై గత సంవత్సరం నవంబర్ నెల నందు వంతెనకు గల రిటర్నింగ్ వాల్ పూర్తిగా దెబ్బతిని నేడు వంతెన కూడా దెబ్బతిని కూలిపోయి స్థితికి చేరుకోవడంతో గడిచిన కొన్ని నెలలుగా పలు ప్రభుత్వ శాఖలకు కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నోసార్లు విన్నవించుకున్న ఫలితం శూన్యం. శ్రీకాళహస్తి పురపాలక శాఖ కమిషనర్ గారికి తెలియజేయగా వారు సానుకూలంగా స్పందించి త్వరితగతిన దెబ్బతిన్న వంతెన వద్ద నివారణ చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ మార్గం ద్వారా నిత్యం వేలాది మంది భక్తులు శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దర్శనానికి విచ్చేస్తూ ఉంటారని కావున వెనువెంటనే వంతెనకు మరమ్మత్తులు చేసి వంతెనకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ తరఫున కోరుకుంటున్నాము. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, రేణిగుంట మండలం అధ్యక్షులు రాహుల్ రాయల్, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, ఏర్పేడు మండల నాయకులు మురళి రెడ్డి, జోసెఫ్, కృష్ణ సాయి, నాగరాజు, మహేష్, మాస్ తదితరులు పాల్గొన్నారు.

## మన డబ్బులు -- మన లెక్కలు కార్యక్రమంలో ఆర్థిక భద్రతపై అవగాహన కల్పించిన ఎస్సై హరిప్రసాద్

ప్రజా భూమి ప్రతినిధి, బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా బి.ఎన్ కండ్రిగ మండలంలోని వెలుగు కార్యాలయంలో బి ఎన్ కండ్రిగ గ్రామ సంఘం-1 గ్రామ సంఘం-2 ఆధ్వర్యంలో "మన డబ్బులు -- మన లెక్కలు" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల్లో ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు, ఆదాయ--వ్యయాల నిర్వహణపై అవగాహన కల్పించేందుకు ఏపిఎం, మునేయ్య ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బి.ఎన్ కండ్రిగ ఎస్సై హరిప్రసాద్ మాట్లాడుతూ మహిళా సంఘ సభ్యులకు పలు సూచనలు, సలహాలు అందించారు. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకునే టప్పుడు పూర్తి వివరాలు తెలుసుకోవాలని, తమ వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సంఖ్యలు, ఏటీఎం పిన్‌లు, ఓటీపీలు ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. డబ్బు లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. అలాగే సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ఫోన్ కాల్స్, సందేశాలు, ఆన్‌లైన్ లింకుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ప్రతి కుటుంబం తమ ఆదాయం ఖర్చులపై స్పష్టమైన లెక్కలు నిర్వహించడం ద్వారా ఆర్థికంగా మరింత బలోపేతం కావచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులకు కుటుంబ ఆర్థిక నిర్వహణ పొదుపు ప్రాధాన్యత అప్పుల నియంత్రణ బ్యాంకింగ్ సేవల సద్వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘాల ప్రతినిధులు స్వయం సహాయక సంఘాల సభ్యులు వెలుగు సిబ్బంది గ్రామ మహిళలు ర్యాలీగా పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## చంద్రబాబు నాయుడు వెన్నుపోటు పాలనపై పోరు బాట పోస్టర్ ఆవిష్కరణ..

ప్రజాభూమిప్రతినిధి, తిరుపతి



తిరుపతిలో రెండేళ్ల చంద్రబాబు వెన్నుపోటు పాలనపై "పోరు బాట" పోస్టర్ ను ఉమ్మడి తిరుపతి--చిత్తూరు జిల్లాల వైఎస్సార్సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి తిరుపతి వైఎస్సార్సీపీ ఇన్‌చార్జ్ భూమన అభినయ్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో 149 మోసపూరిత హామీలు ఇచ్చిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రెండేళ్లు గడిచినా వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఈ నెల 4వ తేదీ నుండి 12వ తేదీ వరకు చంద్రబాబు ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు వివరిస్తూ వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాజీ మేయర్ డాక్టర్ శిరీష వైఎస్సార్సీపీ టౌన్ అధ్యక్షుడు మల్లం రవిచంద్ర రెడ్డి , పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అలిపిరి ప్రాంతంలో భక్తుల భద్రత, ట్రాఫిక్ సౌలభ్యం దృష్ట్యా తాత్కాలిక దుకాణాల తొలగింపు

### అలిపిరి వద్ద దుకాణాలు కోల్పోయిన వారికి న్యాయం చేస్తాం -:జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

ప్రజాభూమి ప్రతినిధి,తిరుపతి,



అలిపిరి ప్రాంతంలో తాత్కాలిక దుకాణాల తొలగింపుతో ఉపాధి కోల్పోయిన దుకాణదారులు మంగళవారం జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్‌ను కలిసి తమ సమస్యలను వివరించి, న్యాయం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రపంచం నలుమూలల నుండి ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులు శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వస్తుంటారని, తిరుమలకు ప్రధాన ముఖద్వారమైన అలిపిరి ప్రాంతంలో భక్తుల రద్దీ ఎల్లప్పుడూ అధికంగా ఉంటుందని తెలిపారు. అలిపిరి ప్రాంతంలో రహదారి పక్కన పెద్ద ఎత్తున తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల భక్తుల రాకపోకలకు, వాహనాల సంచారానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. అలిపిరి వద్ద కాలినడకన తిరుమలకు వెళ్లే భక్తుల కోసం ఏర్పాటు చేసిన లగేజీ కౌంటర్ కారణంగా కూడా ఈ ప్రాంతంలో భక్తుల రద్దీ మరింత పెరుగుతోందన్నారు. అలిపిరి పరిసర ప్రాంతాలలో భారతీయ విద్యాభవన్, సైన్స్ సెంటర్, వేదిక్ యూనివర్సిటీ, వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఎన్‌సీసీ అకాడమీ, అరవింద్ కంటి ఆసుపత్రి, టాటా క్యాన్సర్ ఆసుపత్రి, జూపార్క్ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన మార్గం కావడంతో వాహనాల రాకపోకలు అధికంగా ఉండి ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతోందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల కారణంగా రోడ్డు ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయని తెలిపారు.అలిపిరి పరిసర ప్రాంతాలు అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉండటంతో వన్యప్రాణుల సంచారం పెరిగిందని, ఇటీవల చిరుతపులులు ఎస్.వి. యూనివర్సిటీ పరిసర ప్రాంతాల్లోకి కూడా రావడం ఆందోళన కలిగించే అంశమని అన్నారు. భక్తులు, వాహన చోదకులు మరియు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో భక్తులకు, వాహన చోదకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు అటవీ శాఖ, పోలీసు శాఖ, నగరపాలక సంస్థ, రెవెన్యూ శాఖ సంబంధిత అధికారులు సంయుక్తంగా చర్చించి తాత్కాలిక దుకాణాలను తొలగించాలని నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారుఅయితే, దుకాణాల తొలగింపుతో ఉపాధి కోల్పోయిన వారిలో అర్హులైన వారికి ప్రత్యామ్నాయ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకునేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. బాధితుల సమస్యలను సానుభూతితో పరిశీలించి సాధ్యమైనంత మేరకు న్యాయం చేయడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

# మత్తుకు దూరంగా ఉండండి భవిష్యత్తును కాపాడుకోండి

- గంజాయి నిర్మూలనకు తిరుపతి జిల్లా పోలీసుల ప్రత్యేక కార్యాచరణ.
- జిల్లా వ్యాప్తంగా "మెగా గంజాయి టెస్టింగ్" కార్యక్రమాల నిర్వహణ.
- గంజాయి వినియోగదారులను గుర్తించి కౌన్సిలింగ్ ద్వారా మార్పుకు చర్యలు.
- యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కల్పిస్తున్న పోలీసులు.
- "డ్రగ్స్ ఫ్రీ తిరుపతి జిల్లా" లక్ష్యంతో నిరంతర చర్యలు.



ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ., ఆదేశాల మేరకు, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ., పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీస్ శాఖ విస్తృత చర్యలు చేపడుతోంది. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటం, సమాజాన్ని మత్తు రహితంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా తిరుపతి జిల్లా పరిధిలోని ప్రతి సబ్ డివిజన్‌లో సంబంధిత డీఎస్పీల ఆధ్వర్యంలో "మెగా గంజాయి టెస్టింగ్" కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. అనుమానిత ప్రాంతాలు, పరిశ్రమలు, కార్మికుల సమూహాలు మరియు ఇతర గుర్తించిన ప్రదేశాలలో గంజాయి పరీక్షలు నిర్వహిస్తూ, మత్తు పదార్థాల వినియోగాన్ని గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. గంజాయి పరీక్షల్లో పాజిటివ్‌గా గుర్తించిన వ్యక్తులకు కేవలం చట్టపరమైన చర్యలకే పరిమితం కాకుండా, వారి జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో కౌన్సిలింగ్ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే ఆరోగ్య, కుటుంబ, ఆర్థిక మరియు సామాజిక దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తూ వారిని సన్మార్గంలోకి తీసుకురావడానికి పోలీసులు కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నేడు శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలో, డీఎస్పీ పర్యవేక్షణలో, తొట్టంబేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని కజారియా ఫ్యాక్టరీ మరియు వి-ఫార్మ్ పరిశ్రమల కార్మికులకు మెగా గంజాయి టెస్టింగ్ కార్యక్రమం నిర్వహించబడింది. ఎస్ఐలు, పోలీసు సిబ్బంది సమక్షంలో కార్మికులకు పరీక్షలు నిర్వహించారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజలు, యువత, విద్యాసంస్థలు, పరిశ్రమల యాజమాన్యాలు మరియు తల్లిదండ్రులు పోలీస్ శాఖకు సహకరించాలని తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, విజ్ఞప్తి చేశారు. "మత్తుకు దూరంగా ఉండండి -- భవిష్యత్తును కాపాడుకోండి" అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి నరసింహమూర్తి.వన్ టౌన్ సిఐ ఎస్ఐలు. టూ టౌన్ సిఐ.ఎస్ఐలు. శ్రీకాళహస్తి రూరల్ సిఐ ఎస్ఐ లు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ముగిసిన వేసవి క్రికెట్ శిక్షణ శిబిరం

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,




నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ వారి సహకారంతో గూడూరు లోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఉన్న ఏ సి ఏ సబ్ సెంటర్ నందు గత నెల నాలుగో తారీఖు నుంచి ఈరోజు వరకు నెల రోజుల పాటు నిర్వహించిన వేసవి క్రికెట్ ఉచిత శిక్షణ శిబిరం




ముగింపు కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా సబ్ సెంటర్ ఇన్చార్జి గూడూరు క్రికెట్ క్లబ్ అధ్యక్షులు కొణిదల మునిగిరీష్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా ఈ స్టేడియంలో ఈ సమ్మర్ క్రికెట్ కోచింగ్ నిర్వహిస్తున్నామని అందులో భాగంగా ఈ సంవత్సరం కూడా సుమారు నెలరోజుల పాటు ఈ శిక్షణ శిబిరాన్ని నిర్వహించామని, ఈ శిక్షణ శిబిరంలో సుమారు 80 మంది బాలురు మరియు బాలికలు పాల్గొన్నారు అని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి నెల్లూరు జిల్లా క్రికెట అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మా నెల్లూరు కంటే ముందు నుంచే ఈ స్టేడియంలో ఈ సమ్మర్ క్రికెట్ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ వస్తుండేవారని, అలాగే రాష్ట్రంలో ఇక్కడ జరిగిన అన్ని టోర్నమెంట్లు మరి ఎక్కడ జరిగేవి కాదని అన్నారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసినటువంటి జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు వేగురు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గతంలో బాలురు మాత్రమే క్రికెట్ పట్ల ఆసక్తి చూపియవారని, ఈ మధ్యకాలంలో బాలికలు కూడా ఎక్కువమంది ఈ శిక్షణ శిబిరానికి వస్తున్నారని, వీరి మీద మహిళల ప్రపంచ కప్ విజయం ప్రభావం చూపించిందని అన్నారు. ఇంకా ఈ జిల్లా క్రికెట అసోసియేషన్ మాజీ సెక్రటరీ శ్రీనివాసులు రెడ్డి, అల్లూరి ఆదిశేషారెడ్డి క్రికెట్ క్లబ్ సెక్రటరీ తూపిలి నాగేశ్వరరావు, శిక్షకులు సురేంద్ర నాథ్ రెడ్డి, లవ కుమార, మహేష్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా క్రికెట అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులందరికి సర్టిఫికెట్లను అందజేశారు.

## 'నవచేతన' ఏఐ యాప్‌పై విస్తృత అవగాహన అవసరం

### చిన్నారుల స్క్రీనింగ్‌కు శిక్షణ ప్రారంభం: కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాభూమి ప్రతినిధి చిత్తూరు




'నవచేతన' ఏ ఐ యాప్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 0--6 ఏళ్ల పిల్లల స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో సీడీపీఓలు, సూపర్వైజర్లు అంగన్వాడీ కేంద్రాలను నిరంతరం తనిఖీలు చేయాలని సూచించారు. గ్రామాల్లో గర్భిణీ తల్లులకు పోషకాహారం, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని, సామాజిక సమస్యలపై గ్రామసభలు నిర్వహించాలని తెలిపారు. చిన్నారుల ఎదుగుదల లోపాలు, పోషకాహార స్థితి, అభివృద్ధి మైలురాళ్లను ప్రారంభ దశలోనే గుర్తించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని చెప్పారు. 'నవచేతన' యాప్ ద్వారా పిల్లల ఆరోగ్యాన్ని ఆన్‌లైన్‌లో ట్రాక్ చేసి, అవసరమైన వారికి తక్షణ వైద్య సేవలకు అనుసంధానం చేయవచ్చని వివరించారు. ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా పిల్లలపై మూడు విధాలుగా స్క్రీనింగ్ నిర్వహిస్తారని తెలిపారు. 0--6 ఏళ్ల పిల్లలను 9 దశలుగా విభజించి, 21 రకాల లోపాలను గుర్తించే విధంగా వ్యవస్థ పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చైతన్య, డాక్టర్ రాజేష్ కుమార్, సీడీపీఓలు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



## గూలూరు చెరువులో భారీ ఎత్తున గ్రావెల్ డప్పు కలెక్టర్ న్యాయం చేయాలి- దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై.నందయ్య

ప్రజా భూమి ప్రతినిధి: వడమాల పేట



వడమాలపేట మండలం ఎస్.బి.ఆర్ పురం పంచాయతీ గూలూరు చెరువు కాలువలో ప్రక్కన వందలాది గ్రావెల్ను డప్పు చేసి ఉన్నారు. చెరువు కాలవలో అనేక కాలువలు కలవు. సుమారు 15 కిలోమీటర్ల అడవి నుండి నీళ్లు చెరువుకి వస్తుంది. అన్నిటికీ ప్రకృతి సంపద గుట్టలను కొల్లగొట్టి కాలువల పక్కన గ్రామాలను డప్పు చేస్తారా...? అసలు



చెరువు కాలువలో లోతు చేసి రాతి కట్టడం కట్టాలి, కానీ వందలాది గ్రావెలను కాలువ పక్కన తోలడం వలన భారీ వర్షాలకు వృధాగా గ్రావులు చెరువులోకి పోతుంది. కాలువలు కూడా పూడిపోతుంది. కాలక్రమేన గ్రావెల్ను భూములకు వినియోగించుకుంటారు. ఇతర పనులకు వినియోగించుకుంటారు. ఇరిగేషన్ అధికారులు కూడా అంత గ్రావెల్ ను ఎలా పర్మిషన్ ఇస్తారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రకృతి వనరులను కాపాడాలని, అనేకమార్లు చెబుతున్న క్షేత్రస్థాయిలో అధికారులు కొంతమంది పట్టించుకోవడం లేదు. గ్రావుల మాఫియా విషయంగా 01/06/2026 వ తేదీన తిరుపతి కలెక్టరేట్ లో జిల్లా రెవెన్యూ అధికారీ జి.నరసింహులు కి పీజీఆర్ఎస్ లో కూడా అర్జీ ఇవ్వడం జరిగింది. స్పందించిన డిఆర్ఓ మైన్స్ మరియు రెవెన్యూ అధికారులతో విచారించి న్యాయం చేస్తామని చెప్పడం జరిగింది. ప్రకృతి వనరులను కాపాడాలని, గ్రావుల మాఫియా వారి పైన చర్యలు తీసుకోవాలని, దళిత గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై.నందయ్య కోరడమైనది.

## చెరుకుల అలంకరణలో భక్తులను ఆకట్టుకున్న తాతయ్యగుంట గంగమ్మ

### మూడవ వారాల సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, అన్నప్రసాద వితరణ

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



తిరుపతి పట్టణంలో వెలసి ఉన్న తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానంలో 2026 గంగజాతర అనంతరం నిర్వహిస్తున్న వారాల ఉత్సవాల్లో భాగంగా మూడవ వారమైన మంగళవారం అమ్మవారికి వైభవంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అభిషేక కార్యక్రమం అనంతరం ఈనాటి అలంకరణ దాతలైన నైనార్ మహేష్ యాదవ్, ఆర్.సి. మునికృష్ణ, కంచి లోకనాద రెడ్డి కుమారులు మరియు మనుమరాళ్ల సహకారంతో అమ్మవారిని చెరుకులతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. చెరుకులతో చేసిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు వినోద్ రెడ్డి, తిరుపతి వారి సహకారంతో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.ఈ విషయాన్ని ఆలయ చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్ మరియు కార్యనిర్వహణాధికారి ఎ. జయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

## శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకుని గురుదక్షిణామూర్తి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే

ప్రజాభూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి టౌన్



శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవాలయంలో వెలిసిన గురుదక్షిణామూర్తి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, మాజీ బోర్డు మెంబర్ మున్నా రాయల్, యువజన విభాగం అధ్యక్షులకు శ్రీవారి సురేష్, తేజ, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## రైల్వే ప్రాజెక్టులు, శ్రీ సిటీ, ప్రీమియర్ ఎనర్జీస్ పై భూసమస్యల పరిష్కరణపై సమీక్ష

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.




రైల్వే ప్రాజెక్టులు, శ్రీసిటీ, ప్రీమియర్ ఎనర్జీస్, భూసేకరణ , భూ సమస్యలు, రెవెన్యూ పీ.జీ.ఆర్.ఎస్, రిసర్వే, 22- నిషేధిత జాబితా కేసుల పరిష్కారం, మాన్యువల్ రెవెన్యూ రికార్డుల డిజిటలీకరణ, పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ, తదితర అంశాల పైన సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్.రేణిగుంట. తిరుపతి, జూన్ 02 : రైల్వే ప్రాజెక్టులు, శ్రీసిటీ, ప్రీమియర్ ఎనర్జీస్, భూసేకరణ , భూ సమస్యలు, రెవెన్యూ పీ.జీ.ఆర్.ఎస్, రిసర్వే, 22ఎా నిషేధిత జాబితా కేసుల పరిష్కారం, మాన్యువల్ రెవెన్యూ రికార్డుల డిజిటలీకరణ, పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ, తదితర అంశాల పైన సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్.

## ఎస్,ఐ,ఆర్ సమావేశంలో పాల్గొన్న తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధులు రేణిగుంట.
మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన (ఎస్,ఐ,ఆర్) - ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై అవగాహన సమావేశంలో తుడా ఛైర్మన్, టీటీడీ ఎక్స్-ఆఫీషియో సభ్యుడు, టీడీపీ తిరుపతి జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ , పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పాల్గొని (ఎస్,ఐ,ఆర్ )కార్యక్రమానికి సంబంధించిన పలు అంశాలపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. త్వరలో భారత ఎన్నికల సంఘం, చేపట్టనున్న (ఎస్,ఐ ఆర్ )కార్యక్రమం నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు చేపట్టాల్సిన కార్యాచరణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు ఇతర కీలక అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గిరిజనుల సమస్యను పరిష్కారం చేయని పెద్ద కనపర్తి గ్రామ సచివాలయం సిబ్బంది- జనసేన పార్టీ పేట బ్రదర్స్ మిత్రబృందం

ప్రజా భూమి ప్రతినిధి: తొట్టంబేడు



జనసేన పర్యటనలో భాగంగా తొట్టంబేడు మండలం పిల్లమేడు పంచాయతీ గిరిజన కాలనీలో మే నెల 17 వ తారీఖున గిరిజనుల సమస్యలు తెలుసుకోవడం జరిగింది, వీధిలైట్ల సమస్య మా దృష్టికి తీసుకురావడం జరిగింది, ఈ సమస్యను సంబంధిత సచివాలయం కు వెళ్లి జనసేన పార్టీ నాయకులు తెలపడం జరిగింది, అంతేకాకుండా స్వయంగా పంచాయతీ సెక్రెటరీ కి దాదాపు నాలుగు సార్లు ఫోన్ చేసి మరి సమస్య తెలపడం జరిగింది, కేవలం ఒక లైటు మాత్రమే వేసి మిగిలిన వాటిని వెయ్యలేదు, మరల జనసేన పార్టీ నాయకులు గిరిజనులతో మాట్లాడి విషయం తెలుసుకుని మిగిలిన లైట్లు ఎందుకు వేయలేదు అని కూడా సెక్రెటరీనీ అడగడం జరిగింది, ఇప్పటికీ 15 రోజులు గడుస్తున్న మిగిలిన లైట్లు వేయకపోవడం వారి యొక్క నిర్లక్ష్యానికి గల కారణం ఏమిటి అనేది అర్థం కానటువంటి విషయం. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు

## చిన్నారులకు ఆటపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్య

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,,



గూడూరు, అర్బన్ ఐ సీ డి ఎస్ ప్రాజెక్ట్ లో సీ డి పి ఒ మేడం షేక్.మెహబూబి ఆదేశాల మంగళ వారం, నా అంగన్వాడీ పిలుస్తుంది, కార్యక్రమం నిర్వహించడం జరిగింది, కార్యక్రమంలో తల్లులకు అంగన్వాడీ కేంద్రానికి,పిల్లల్ని, పంపించండి, ఆట, పాట లతో, కూడిన పూర్వ ప్రాథమిక, విద్య ను,అందించడం జరుగుతుంది వత్తిడి లేని విద్య,పోషకాహారం, ప్రతి నెల,పిల్లలకు బరువులు,తీయడం,అదేవిధంగా, వ్యాధి నిరోధక, టీకా లు, సమయానికి అందించడం జరుగుతుంది ఈ కార్యక్రమంలో సూపర్ వై జర్ సుజన, చెంచు లక్ష్మీ తల్లులు,కిషోరి బాలికలు,అంగన్వాడీ కార్యకర్తలు, సాజిద, లక్ష్మీ, అనిత,ప్రసన్న,పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ గురుదక్షిణామూర్తి స్వామి వారికి ప్రత్యేక పూజలు

ప్రజా భూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్



శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి ఆలయం నందలి శ్రీ గురుదక్షిణ మూర్తి స్వామి వారికి స్వస్తిశ్రీ పరాభవ నామ సంవత్సర వైశాఖ తృతీయ మంగళవారము మూలా నక్షత్రము తేది.02/06/2026 శుభలగ్నం ఉదయం 9.00 గంటల నందు నవగ్రహములలో



పంచమ గ్రహమైన శ్రీ గురు గ్రహము మిధున రాశి నుండి కర్కాటక రాశి లోనికి ప్రవేశించు సందర్భముగా ఉదయం 9.00 గంటలకు సంకల్పము, అష్టోత్తర శత శంఖాభిషేకము, నైవేద్యం దీపారాధన మరియు అలంకారం దేవస్థానం ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్ ఆధ్వర్యంలో నిర్వహించడమైనది. సదరు కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ , ఆలయ కార్యనిర్వహణాధికారి బీకే వెంకటేశులు, సభ్యులు గుర్రప్ప శెట్టి, నాగరాజు, విజయమ్మ, డిప్యూటీ ఈవో ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్, ఋత్వికులు, అర్చకులు. భక్తులు ప్రజలు వేలాదిమందిగా పాల్గొన్నారు

# డ్రగ్స్ ఫ్రీ తిరుపతి జిల్లానే లక్ష్యం

### జిల్లా వ్యాప్తంగా మెగా గంజాయి టెస్టింగ్, కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి

మత్తు పదార్థాలకు దూరంగా ఉండి భవిష్యత్తును కాపాడుకోవాలని తిరుపతి జిల్లా పోలీసులు ప్రజలకు, ముఖ్యంగా యువతకు పిలుపునిచ్చారు. గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు పర్యవేక్షణలో జిల్లా వ్యాప్తంగా గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం మరియు అక్రమ రవాణా నివారణకు విస్తృత చర్యలు చేపడుతున్నారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటం, సమాజాన్ని మత్తు రహితంగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పలు అవగాహన, తనిఖీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా పరిధిలోని ప్రతి సబ్ డివిజన్‌లో సంబంధిత డీఎస్పీల ఆధ్వర్యంలో “మెగా గంజాయి టెస్టింగ్” కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అనుమానిత ప్రాంతాలు, పరిశ్రమలు, కార్మికుల సమూహాలు మరియు ఇతర గుర్తించిన ప్రదేశాల్లో గంజాయి పరీక్షలు నిర్వహిస్తూ మత్తు పదార్థాల వినియోగాన్ని గుర్తించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పరీక్షల్లో గంజాయి వినియోగించినట్లు గుర్తించిన వ్యక్తులపై కేవలం చట్టపరమైన చర్యలకే పరిమితం కాకుండా, వారి జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలనే ఉద్దేశంతో కౌన్సిలింగ్ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే ఆరోగ్య, కుటుంబ, ఆర్థిక, సామాజిక దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తూ వారిని సన్మార్గంలోకి తీసుకురావడానికి పోలీసులు కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలో డీఎస్పీ పర్యవేక్షణలో, తొట్టంబేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని కజారియా ఫ్యాక్టరీ మరియు వీ-ఫార్మ్ పరిశ్రమల కార్మికులకు మెగా గంజాయి టెస్టింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది సమక్షంలో కార్మికులకు పరీక్షలు నిర్వహించి, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజలు, యువత, విద్యాసంస్థలు, పరిశ్రమల యాజమాన్యాలు, తల్లిదండ్రులు పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు విజ్ఞప్తి చేశారు. “మత్తుకు దూరంగా ఉండండి -- భవిష్యత్తును కాపాడుకోండి” అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తి ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా కుటుంబ వ్యవస్థను, సమాజ శాంతి భద్రతలను కూడా తీవ్రంగా ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, వ్యక్తిత్వ వికాసంపై దృష్టి సారించాలని సూచించారు. గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల నిర్మూలనకు తిరుపతి జిల్లా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్లు 1972 (ఈగల్) లేదా 112కు సమాచారం అందించాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతోనే “డ్రగ్స్ ఫ్రీ తిరుపతి జిల్లా” లక్ష్యాన్ని విజయవంతంగా సాధించగలమని ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు తెలిపారు.




## గిరిజనుల అటవీ హక్కుల పరిరక్షణకు అటవీ హక్కుల చట్టం--2006 దోహదం

**మూడు రహదారి నిర్మాణ ప్రతిపాదనలకు జిల్లా స్థాయి కమిటీ ఆమోదం: కలెక్టర్ సుమిత్ కుమార్**



ప్రజాభూమి ప్రతినిధి చిత్తూరు

అటవీ భూములపై ఆధారపడి జీవిస్తున్న గిరిజనులు, సాంప్రదాయ అటవీ నివాసితుల హక్కులను గుర్తించి పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం 2006లో అటవీ హక్కుల చట్టాన్ని తీసుకువచ్చిందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. దేశ చరిత్రలో తొలిసారిగా అటవీ భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులు మరియు ఇతర సాంప్రదాయ అటవీ నివాసితుల హక్కులను గుర్తించిన చట్టం ఇదేనని పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని నాగార్జున ఐఏఎస్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అటవీ హక్కుల చట్టం--2006 అమలు, అటవీ హక్కుల గుర్తింపు ప్రక్రియపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బంగారుపాళ్యం మండల పరిధిలో అటవీ భూముల ద్వారా చేపట్టనున్న మూడు రహదారి నిర్మాణ ప్రతిపాదనలను పరిశీలించి జిల్లా స్థాయి కమిటీ ఆమోదం తెలిపింది.

**ఆమోదం పొందిన ప్రతిపాదనలు :** తుంబపాళ్యం గ్రామం నుండి పీలేరు చెట్టుపల్లి కాలనీ వరకు రహదారి నిర్మాణం కోసం 0.972 హెక్టార్ల అటవీ భూమి వినియోగానికి అనుమతి. గోర్రైలనగరి నుండి వేపనపల్లి వరకు రహదారి నిర్మాణం కోసం 0.970 హెక్టార్ల అటవీ భూమి వినియోగానికి అనుమతి. రాగిమానుపెంట గ్రామం నుండి కె.ఎం. కండ్రిగ గ్రామం వరకు రహదారి నిర్మాణం కోసం 0.675 హెక్టార్ల అటవీ భూమి వినియోగానికి అనుమతి. ఈ మూడు ప్రతిపాదనలకు జిల్లా స్థాయి కమిటీ ఆమోదం తెలిపినట్లు కలెక్టర్ వెల్లడించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా అటవీ శాఖ అధికారి సుబ్బరాజు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, సాంకేతిక అధికారులు శ్రీవాసమూర్తి, ప్రజా మౌలిక వసతుల విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ నాగరాజు, సహాయ ఇంజనీర్ నరసింహారెడ్డి, రోడ్లు--భవనాల శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ సుదర్శన్ బాబు, అటవీ శాఖ రేంజ్ అధికారి పట్టాభి, జిల్లా స్థాయి కమిటీ సభ్యుడు సుబ్రమణ్యం, జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యుడు తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం పీహెచ్సీ లో ఏ ఎస్ హెచ్ ఎ దినోత్సవ సమావేశం



ప్రజా భూమి ప్రతినిధి కాణిపాకం

చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈ రోజు రెండో తేదీ జూన్ నెల 20 26 కాణిపాకం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏ ఎస్ హెచ్ ఏ దినోత్సవ సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు డీఎంహెచ్వో డా. జి. వెంకట ప్రసాద్ , కాణిపాకం పీహెచ్సీ వైద్యాధికారి డా. స్వాతి సింధూర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు పీహెచ్సీ. ఏ ఎస్ హెచ్ ఏ కార్యకర్తలతో పాటు ఎం పి హెచ్ ఈ ఓ పీహెచ్ఎన్ లు, సూపర్ వైజర్ ఏఎన్ఎం లు, ఎం ఎం ఎల్ హెచ్ పి లు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో అదనపు డి ఎం హెచ్ ఓ డా. వెంకట ప్రసాద్ మాట్లాడుతూ, క్షయ, కుష్టు వ్యాధులపై పాత్రను వివరించారు. 2 వారాలకు పైగా దగ్గు ఉన్న వారిని గుర్తించి స్పుటం పరీక్షకు పంపడం, పరీక్షకు ప్రజలను ప్రోత్సహించడం, కుష్టు వ్యాధి లక్షణాలున్న వారిని త్వరగా గుర్తించి చికిత్సకు అనుసంధానం చేయడం వంటి సూచనలు చేశారు. అలాగే గర్భిణీ స్త్రీల సంరక్షణ టీకాల కార్యక్రమం పై మాట్లాడుతూ, ప్రతి గర్భిణీని నమోదు చేసి తనిఖీలు పూర్తి చేయించడం, తప్పనిసరి టీకాలు అన్నీ సమయానికి వేయించడం బాధ్యత అని తెలిపారు. శిశు మరణాల తగ్గింపులో ఈ రెండు అంశాలు కీలకమని అన్నారు. ౹ాంజ వైద్యాధికారి డా. స్వాతి సింధూర పనితీరును ప్రశంసిస్తూ, మెరుగైన ఆరోగ్య సేవల కోసం సమన్వయంతో డిఎంహెచ్వో సిబ్బంది పీహెచ్సీ సిబ్బంది పనిచేయాలని పిలుపు ఇవ్వడం జరిగినది.

## హనుమంత వాహనంపై కల్యాణ వేంకటేశ్వరుని దివ్య విహారం

### గోవింద నామస్మరణలు, చెక్కభజనలు, కోలాటాలతో భక్తిమయమైన నారాయణవనం



ప్రజాభూమి ప్రతినిధి నారాయణవనం

నారాయణవనంలోని పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన మంగళవారం ఉదయం హనుమంత వాహనసేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు కల్యాణ వేంకటేశ్వరస్వామివారు హనుమంత వాహనంపై దివ్యమంగళ స్వరూపంతో భక్తులకు దర్శనమిచ్చి అభయప్రదానం చేశారు. భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ వాహనసేవ భక్తిరసపూరితంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ గోవింద నామస్మరణలతో స్వామివారిని దర్శించుకుని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు.

### హనుమత్సేవా మహిమను చాటిన స్వామివారు

త్రేతాయుగంలో శ్రీరామచంద్రునికి పరమభక్తుడిగా నిలిచిన ఆంజనేయస్వామి భక్తి, శక్తి, ధైర్యం, శరణాగతికి ప్రతీకగా పురాణాల్లో వర్ణించబడ్డాడు. బుద్ధి, బలం, ఆరోగ్యం, నిర్భయత్వం, వాక్పటిమ హనుమత్స్మరణ ద్వారా సిద్ధిస్తాయని శాస్త్రాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో హనుమంత వాహనంపై విహరించిన స్వామివారు భక్తులకు శరణాగతి మహిమను చాటిచెప్పారు.

### వైభవంగా స్నపన తిరుమంజనం

అనంతరం ఉదయం 10 గంటల నుండి 11 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారికి స్నపన తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లతో అభిషేకాలు నిర్వహించి విశేష పూజలు సమర్పించారు.

### సాయంత్రం వసంతోత్సవం -- రాత్రి గజవాహన సేవ

మధ్యాహ్నం 4 గంటలకు వసంతోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం స్వామివారు బంగారు తిరుచ్చిపై నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాత్రి 7 గంటలకు గజవాహనంపై స్వామివారు భక్తులను అనుగ్రహించనున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, చెంగల్‌రాయులు, ఆలయ అర్చకులు, అధికారులు, శ్రీవారి సేవకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మలేరియా నిర్మూలనకు ప్రజలందరూ భాగస్వాములు కావాలి - వైద్యాధికారుల పిలుపు




-ప్రజా భూమి ప్రతినిధి, బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి ఎన్ కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ప్రతి సంవత్సరం జూన్ నెలను ప్రభుత్వం మలేరియా వ్యతిరేక మాసంగా ప్రకటించిన నేపథ్యంలో, ఈ నెల పొడవునా గ్రామాలు, పాఠశాలల్లో మలేరియా నివారణపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు డాక్టర్ మురళీధర్ రెడ్డి, డాక్టర్ ఉదయ్ కుమార్, ఆరోగ్య విద్యాధికారి డి.ఎన్. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఎంఎల్హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం మలేరియా నిర్మూలనకు కృషి చేస్తామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. అధికారులు మాట్లాడుతూ ప్రతి గ్రామం, ప్రతి పాఠశాలలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంఎల్హెచ్‌పీలు కలిసి మలేరియా నివారణపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. ఈ నెల మొత్తం కార్యక్రమాలను విస్తృతంగా కొనసాగించాలని తెలిపారు. ప్రతి శుక్రవారం “డ్రై డే” పాటిస్తూ ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూడాలని, చిన్న చిన్న గుంతలను పూడ్చివేయాలని, కాలువలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఇంటి చుట్టూ ప్లాస్టిక్ కప్పులు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాలు, కుండీలు వంటి వ్యర్థ వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వినియోగించడం, వేపాకు పొగ వేయడం వంటి చర్యల ద్వారా దోమల నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, నీరు నిల్వ కాకుండా చూసుకోవడం ద్వారా మలేరియా వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని ప్రజలకు అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు.

## గ్రామస్తుల దౌర్జన్యాలను అడ్డుకోండి- రెవెన్యూ అధికారులకు ఓ బాధిత న్యాయవాది వినతి




ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు.

చిత్తూరు, తమ పొలాలకు వెళ్లే దారిలో అక్రమంగా ప్రహరీ గోడ నిర్మించి ఇబ్బంది పెడుతున్న గ్రామంలోని కొందరి దౌర్జన్యాలను అడ్డుకోవాలని తవణంపల్లి మండలం ఎగువ మత్యం గ్రామానికి చెందిన నాదమునిరెడ్డి కుమారుడు, న్యాయవాది మోహన్ రంగారెడ్డి రెవెన్యూ అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఉదయం స్థానిక ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తవణంపల్లి మండలం ఎగువ మత్యం గ్రామంలో తమకు ... మత్యం గ్రామ రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నెంబర్లు-384/3, 385/2, 385/4, 386, 387/3 లలో మొత్తం 2.89 ఎకరాల మేర సెటిల్మెంట్ వ్యవసాయ భూమి ఉందన్నారు. గత 30 సంవత్సరాలుగా సంబంధిత భూమిలో పలు పంటలను పండించుకుంటున్నట్లు తెలిపారు. సర్వే నంబర్ - 373 లోని 0.96 ఎకరాల రస్తా పోరంబోకు ద్వారా తమ పొలానికి రాకపోకలు సాగిస్తూ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ భూమి సమీపంలోనే గ్రామస్తులు అభయాంజనేయస్వామి దేవాలయం నిర్మించారన్నారు. అంతటితో ఆగకుండా పక్కనే తమ పొలంలో ఒక సత్రాన్ని నిర్మించేందుకు తమ పొలాన్ని ఆక్రమించుకుంటున్నట్లు ఆరోపించారు. ఇందుకు తాము సమ్మతించకపోవడంతో తమ పొలానికి వెళ్లే దారికి అనుకునే ఉన్న పొలం స్థలంలో తాము లోనికి వెళ్లేందుకు వీలుకాకుండా అడ్డుగా ప్రహరీ గోడను నిర్మించి ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు వాపోయారు. ఇలా చేయడంతో తమ పొలానికే కాకుండా రస్తా పోరంబోకు ద్వారా సమీపంలోని నీలంపల్లి, జొన్నగురకల గ్రామాలవాసులకూ రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నా యన్నారు. ఇందుకు సంబంధించి జొన్నగురకుల గ్రామస్తులు సైతం 30 వ తేదీన జిల్లా కలెక్టరేట్ లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామస్తుల ఏకపక్ష నిర్ణయాలను ప్రశ్నించిన కారణంగా గ్రామస్తులందరూ తన భార్యతో పాటు, తమ్ముడు నరేష్ పై మూకుమ్మడిగా దాడికి తెగబడి గాయాలపాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో చేసేదిలేక తాను 15 రోజుల క్రితం గ్రామస్తుల తీరును జిల్లా జాయింట్ కలెక్టర్ కు ఫిర్యాదు చేశానన్నారు. తన న్యాయమైన ఫిర్యాదును పరిశీలించిన జాయింట్ కలెక్టర్ పోరంబోకు రస్తా విషయంగా బాధితుల నుంచి అభ్యంతరాలుంటే, సంబంధిత రస్తాలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని తెలిపినట్లు వివరించారు. అదే విధంగాతమ పొలంలో అక్రమంగా నిర్మిస్తున్న ప్రహరీ గోడను తొలగించాలని జెసి ఆదేశాలు జారీ చేసినా స్థానిక రెవిన్యూ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. దీన్ని అదనుగా తీసుకున్న గ్రామస్తులు జెసి ఆదేశాలను సైతం పట్టించుకోకుండా తిరిగి నిర్మాణాలు చేపడుతున్నట్లు వాపోయారు. తమ గ్రామానికి చెందిన శరత్ రెడ్డి, రెడ్డప్పరెడ్డి, రాజేంద్రరెడ్డి ప్రోద్బలంతోనే ఇదంతా జరుగుతోందని ఆరోపించారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని స్థానిక తహసిల్దార్ ను ఆశ్రయించగా న్యాయం చేస్తానని హామీ ఇచ్చి మాట తప్పుతున్నారని తెలిపారు. న్యాయం చేయక పోగా గ్రామస్తులతో ఏకీభవించి తహసిల్దార్ తమనే సర్దుబాటు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్తుల తీరుతో పొలం దారి పూర్తిగా మూసుకుపోతోందని, వెంటనే నిర్మాణాలను ఆపించి తమకు న్యాయం చేయాలని మోహన్ రంగారెడ్డి విజ్ఞప్తి చేశారు. కాగా ఈ సమావేశంలో మోహన్ రంగారెడ్డి సోదరుడు నరేష్, మామ మునిరెడ్డి, సమీప బంధువు కృష్ణమూర్తిరెడ్డి పాల్గొన్నారు.

## కుక్ కమ్ హెల్పర్స్‌కు బలవర్ధకమైన ఆహారంపై శిక్షణ కార్యక్రమం..!





ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

చంద్రగిరి బాలికల ఉన్నత పాఠశాల ఆవరణం కుక్ కమ్ హెల్పర్స్ కు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా కుక్ కమ్ హెల్పర్స్‌కు పోషకాహారం యొక్క ప్రాముఖ్యత, బలవర్ధకమైన ఆహార పదార్థాల వినియోగం మరియు వాటి ద్వారా లభించే ఆరోగ్య ప్రయోజనాలపై సమగ్ర అవగాహన కల్పించడం జరిగింది. శిక్షణ కార్యక్రమంలో భాగంగా కుకింగ్ కాంపిటీషన్ కూడా నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో కుక్ కమ్ హెల్పర్స్ ఎంతో ఉత్సాహంగా పాల్గొని మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం వివిధ రకాల పోషకాహార వంటకాలను తయారుచేసి ప్రదర్శించారు. వీటిలో వెజిటబుల్ బిర్యానీ, పులిహోర, బెల్లం పొంగలి, కోడిగుడ్డు పులుసు మరియు వివిధ రకాల చట్నీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అదేవిధంగా ఫోర్టిఫైడ్ బియ్యం, ఫోర్టిఫైడ్ ధాన్యాలు, ఫోర్టిఫైడ్ నూనె, ఫోర్టిఫైడ్ పాలు వంటి బలవర్ధకమైన ఆహార పదార్థాల గురించి వివరించడం జరిగింది. అలాగే ప్యాకెట్లపై ఉండే “ఒఎఫ్” లోగో ద్వారా ఫోర్టిఫైడ్ ఆహారాలను ఎలా గుర్తించాలో, వాటిని సరైన పద్ధతిలో వండడం ద్వారా పోషక విలువలు కోల్పోకుండా ఎలా వినియోగించాలో వివరించారు. శిక్షణలో భాగంగా ఫోర్టిఫికేషన్ ద్వారా అందే సూక్ష్మ పోషకాల ప్రాధాన్యతను కూడా వివరించారు. విటమిన్-ఎ కంటి ఆరోగ్యానికి, ఐరన్ మరియు ఫోలిక్ యాసిడ్ రక్తహీనత నివారణకు, అయోడిన్ థైరాయిడ్ సంబంధిత సమస్యల నివారణకు, విటమిన్-డి ఎముకల బలానికి మరియు శరీర ఎదుగుదలకు ఎంతగానో దోహదపడతాయని తెలియజేశారు. కుకింగ్ కాంపిటీషన్‌లో తయారుచేసిన వివిధ రకాల పోషకాహార వంటకాలను అనంతరం అందరూ కలిసి భోజనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా పోషకాహారంతో కూడిన వంటకాల రుచి, నాణ్యత మరియు పోషక విలువలపై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కె. భాస్కర్ , సీఆర్పీలు, పాఠశాల సిబ్బంది మరియు విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ తరఫున జంపాల రామకృష్ణ పాల్గొని శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న కుక్ కమ్ హెల్పర్స్‌ను అభినందిస్తూ, పాఠశాల విద్యార్థులకు పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమం అనంతరం పాల్గొన్న వారందరికీ భోజన వసతి కల్పించడం జరిగింది.

## కాణిపాకం పీహెచ్సీలో ఏ ఎస్ హెచ్ ఎ దినోత్సవ సమావేశం



ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు.

చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈరోజు రెండో తేదీ జూన్ నెల 20 26 కాణిపాకం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏ ఎస్ హెచ్ ఏ దినోత్సవ సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు డీఎంహెచ్వో డా. జి. వెంకట ప్రసాద్ , కాణిపాకం పీహెచ్సీ వైద్యాధికారి డా. స్వాతి సింధూర ముఖ్య అతిథులుగా హాజరయ్యారు పీహెచ్సీ. ఏ ఎస్ హెచ్ ఏ కార్యకర్తలతో పాటు ఎం పి హెచ్ ఈ ఓ పీహెచ్ఎన్ లు, సూపర్ వైజర్ ఏఎన్ఎం లు, ఎం ఎం ఎల్ హెచ్ పి లు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో అదనపు డి ఎం హెచ్ ఓ డా. వెంకట ప్రసాద్ మాట్లాడుతూ, క్షయ, హెచ్ఐవి, కుష్టు వ్యాధులపై ఆశల పాత్రను వివరించారు. 2 వారాలకు పైగా దగ్గు ఉన్న వారిని గుర్తించి స్పుటం పరీక్షకు పంపడం, హెచ్ఐవి పరీక్షకు ప్రజలను ప్రోత్సహించడం, కుష్టు వ్యాధి లక్షణాలున్న వారిని త్వరగా గుర్తించి చికిత్సకు అనుసంధానం చేయడం వంటి సూచనలు చేశారు. అలాగే గర్భిణీ స్త్రీల సంరక్షణ (ఏ ఎన్ సి )మరియుటీకాల కార్యక్రమం పై మాట్లాడుతూ, ప్రతి గర్భిణీని నమోదు చేసి 4 ఏఎన్ సి తనిఖీలు పూర్తి చేయించడం, తప్పనిసరి టీకాలు అన్నీ సమయానికి వేయించడం ఆశ ల బాధ్యత అని తెలిపారు. శిశు మరణాల తగ్గింపులో ఈ రెండు అంశాలు కీలకమని అన్నారు. పీహెచ్ వైద్యాధికారి డా. స్వాతి సింధూర ఆశ ల పనితీరును ప్రశంసిస్తూ, మెరుగైన ఆరోగ్య సేవల కోసం సమన్వయంతో డిఎంహెచ్వో సిబ్బంది పీహెచ్సీ సిబ్బంది పనిచేయాలని పిలుపు ఇవ్వడం జరిగినది.

# మెగా డీఎస్సీపై వైసీపీ నేతల తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మరు

## వైసీపీకి డీఎస్సీ గురించి మాట్లాడే నైతిక హక్కే లేదు - శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఘాటు విమర్శలు

ప్రజా భూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్



మెగా డీఎస్సీ నియామకాలపై వైసీపీ నేతలు చేస్తున్న తప్పుడు ఆరోపణలు, దుష్ప్రచారాలను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క మెగా డీఎస్సీ కూడా నిర్వహించకుండా, "జాబ్ క్యాలెండర్" పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేసిన నాయకులు నేడు డీఎస్సీపై మాట్లాడటం హాస్యాస్పదమని విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకం మెగా డీఎస్సీపైనే చేశారని గుర్తుచేశారు. కేవలం 148 రోజుల్లోనే 15,941 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి, వేలాది మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ప్రక్రియను అడ్డుకునేందుకు జగన్ రెడ్డి అండ్ కో ప్రోత్సాహంతో 241 వరకు కోర్టు కేసులు వేయించినప్పటికీ, ప్రభుత్వం ఎక్కడా వెనక్కి తగ్గకుండా పూర్తి పారదర్శకంగా, చట్టబద్ధంగా నియామకాలను పూర్తి చేసిందన్నారు. దేశంలోనే అత్యంత విశ్వసనీయమైన సంస్థ ౨జూ ఊచీ ఆధ్వర్యంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో అత్యంత పారదర్శకంగా పరీక్షలు నిర్వహించడంతో కోర్టులు సైతం నియామకాలపై ఎలాంటి అభ్యంతరం వ్యక్తం చేయలేదని చెప్పారు. అభ్యర్థుల మెరిట్ జాబితాలు, ర్యాంకులు, రిజర్వేషన్ల అమలు, ఎంపిక ప్రక్రియకు సంబంధించిన అన్ని వివరాలను బహిరంగంగా వెబ్‌సైట్‌లో ఉంచి పూర్తి పారదర్శకత పాటించామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ, మహిళలు, దివ్యాంగుల రిజర్వేషన్ల అమలులో కూడా ప్రభుత్వం అత్యంత నిబద్ధతతో వ్యవహరించిందన్నారు. అయితే ప్రస్తుతం కడప జిల్లాలో వైసీపీ నేతలు రవీంద్రనాథ్ రెడ్డి, రామచంద్రారెడ్డి, ఆదిత్య రెడ్డి తదితరులు డీఎస్సీ పేరుతో దొంగ ధర్నాలు, రాజకీయ డ్రామాలకు తెరలేపడం వారి నిరాశకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. తమ పార్టీ ఉనికిని కాపాడుకోవడం కోసం నిరుద్యోగ యువత పేరును వాడుకుంటూ మరోసారి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఉద్యోగాలు ఇవ్వలేకపోయిన వైసీపీ నాయకులు ఇప్పుడు ఉద్యోగాలు పొందిన యువత తరపున మాట్లాడుతున్నట్లు నటించడం ప్రజలను మోసం చేసే మరో నాటకమని అన్నారు. నిరుద్యోగుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం, ఉపాధ్యాయులను రెచ్చగొట్టడం, అసత్య ప్రచారాలతో గందరగోళం సృష్టించడం వెంటనే మానుకోవాలని హెచ్చరించారు. జగన్ రెడ్డి దర్శకత్వంలో జరుగుతున్న ఈ రాజకీయ విన్యాసాల వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యాన్ని రాష్ట్ర యువత స్పష్టంగా గుర్తిస్తోందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. వైసీపీ గత ఐదేళ్ల వైఫల్యాలు, నిరుద్యోగ యువత పట్ల చేసిన అన్యాయాన్ని ప్రజలు మర్చిపోలేదని, తప్పుడు ప్రచారాలతో రాజకీయ లబ్ధి పొందాలన్న ప్రయత్నాలకు రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. "ఉద్యోగాలు ఇవ్వకుండా యువతను మోసం చేసిన వైసీపీకి, ఉద్యోగాలు ఇచ్చిన ప్రభుత్వాన్ని ప్రశ్నించే అర్హత లేదు. మెగా డీఎస్సీ విజయాన్ని చూసి వైసీపీ నేతలు రాజకీయ అసూయతో తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు" అని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పేర్కొన్నారు.

# రాత్రి జేసిబితో ఎన్ ఆర్ జి ఎస్ పనులు పగలు గుంతలు వద్ద ఫోటోలు

## టంచనగా బిల్లులు ఈ మాయాజాలంలో (..అంతా..) పెద్దలే..నా..? - పేదలు ఉన్నారా..?





ప్రజా భూమి ప్రతినిధి: తొట్టంబేడు

ఇది పూడి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం తీరు తెన్నులు పట్టించుకోని అధికారులు ఉపాధి హామీ పథకం వలసల నివారించి గ్రామ స్థాయిలోనే కూలీలకు 100 రోజులు పనులు కల్పించి ఉపాధి కల్పించే లక్ష్యంతో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అమలు చేస్తోంది. అయితే కొంతమంది పలుకుబడి కలిగిన పెద్ద కూలీలు రాత్రి పూట జేసిబి సహాయంతో ఎంచక్కగా పనులు చేసి పగటిపూట వాహ్యాళికి వెళ్లి జేసిబితో గుంతలు తీసినచోట నిలబడి ఫోటోలు తీసుకుని పెద్ద కూలీలు పనులు చేసినట్టు రికార్డులు తయారు చేసి దర్జాగా బిల్లులు తీసుకుంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాలకు తిలోధకాలు ఇస్తూ ఉన్నారనే విమర్శలు వస్తున్నాయి. అందుకు చక్కని ఉదాహరణశ్రీకాళ నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలంలోని పూడి గ్రామం అని చెప్పవచ్చు. ఆ గ్రామంలో అన్నీ సామాజిక వర్గాల కూలీలు ఉండగా ఒకటి, రెండు సామాజిక వర్గాలకు చెందిన వారు వారి పలుకుబడితో రాత్రి జేసీబితో పనులు చేయించి పగటి పూట ఆ పనులు వద్ద కూలీలు కాని కూలీలు ఫోటోలు తీసుకుని మస్టర్ లో నమోదు చేయిస్తున్నట్లు విమర్శలు వున్నాయి. ఉపాధి పనులు పర్యవేక్షంచ్చాల్సిన అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్ నమోదు చేసిన హాజరును బట్టి బిల్లులు చెల్లిస్తూ వున్నారని తెలిసింది. ఇదేమిటి అని ప్రశ్నించిన కూలీలకు మీకు దిక్కున్న చోట చెప్పుకోపో అంటు దురుసుగా సమాధానం ఇస్తూ వున్నారని పూడి గ్రామం కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేసి నిజమైన కూలీలకు బిల్లులు చెల్లించాలని, పేదల ముసుగులో పెద్ద కూలీలలకు బిల్లులు చెల్లించకుండా తగు చర్యలు తీసుకోవాలని పలువురు ఉపాధి కూలీలు కోరుతున్నారు.

# టీటీడీ విద్యాసంస్థల్లో ప్రవేశాలకు పటిష్ట చర్యలు. - 33 విద్యాసంస్థల్లో అడ్మిషన్లకు సమగ్ర ఏర్పాట్లు

## మెరిట్, పారదర్శకత, జవాబుదారీతనంతో ప్రవేశాల నిర్వహణ : జేఈవో (వైద్యం, విద్య) డాక్టర్ ఎ.శరత్

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలనే సంకల్పంతో టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 33 విద్యాసంస్థల్లో 2026--27 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని టీటీడీ జేఈవో (వైద్యం, విద్య) డాక్టర్ ఎ.శరత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అలిపిరిలోని ఎస్వీబీసీ కార్యాలయం నుండి టీటీడీ డీఈవో శ్రీ వెంకటసునీల్‌తో కలిసి కళాశాలల ప్రిన్సిపల్స్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.

విద్యా వికాసమే సమాజ వికాసానికి పునాది. ఈ సందర్భంగా జేఈవో డాక్టర్ ఎ.శరత్ మాట్లాడుతూ, ఆలయాల నిర్వహణతో పాటు విద్యా రంగానికీ సమాన ప్రాధాన్యతనిస్తూ టీటీడీ ఏడు దశాబ్దాలుగా విశిష్ట సేవలు అందిస్తోందన్నారు. తిరుపతితో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో విద్యాసంస్థలను విజయవంతంగా నిర్వహిస్తూ వేలాది మంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దుతోందని పేర్కొన్నారు. విద్య ద్వారా యువతలో ఉపాధి అవకాశాలతో పాటు సామాజిక బాధ్యత, నైతిక విలువలు, ఉత్తమ వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతాయని వివరించారు.

విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యం : టీటీడీ విద్యాసంస్థల్లో ప్రవేశాల ప్రక్రియను మెరిట్, పారదర్శకత, జవాబుదారీతనం అనే మూడు ప్రధాన సూత్రాల ఆధారంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామని జేఈవో తెలిపారు.

ప్రతి విద్యాసంస్థలో అడ్మిషన్ కమిటీ -- హెల్ప్‌డెస్క్‌లు : అడ్మిషన్ల నిర్వహణ కోసం ప్రతి విద్యాసంస్థలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని, విద్యార్థులు మరియు తల్లిదండ్రులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించేందుకు హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రవేశాల ప్రక్రియ పూర్తిగా మెరిట్ ఆధారంగా, పారదర్శకంగా జరగాలని స్పష్టం చేశారు.

ఆన్‌లైన్ ఫీజులు -- స్పాట్ అడ్మిషన్లకు ప్రాధాన్యం : కోర్సుల వారీగా సీట్ల లభ్యత, ఖాళీల భర్తీ, స్పాట్ అడ్మిషన్ల నిర్వహణ వంటి అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. అడ్మిషన్ ఫీజులను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే స్వీకరించాలని, విద్యార్థుల సౌకర్యార్థం అవసరమైన సూచిక బోర్డులు, సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ప్రత్యేక విద్యాసంస్థలకు విస్తృత ప్రచారం : శ్రీ వేంకటేశ్వర శిల్పకళాశాల, బాలమందిరం, బధిరుల పాఠశాల తదితర ప్రత్యేక విద్యాసంస్థల అడ్మిషన్లకు సంబంధించిన సమాచారాన్ని ప్రకటనలు, ఫ్లెక్సీలు, డిజిటల్ మరియు సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేసి ప్రతి విద్యార్థికి చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో టీటీడీ డీఈవో శ్రీ వెంకటసునీల్ పాల్గొనగా, వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

# ఆవిష్కరణలు, స్వయం ఉపాధి మరియు గ్రామీణాభివృద్ధిలో ముందుకు సాగుతున్న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.



తిరుపతి, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టీఐహెచ్), తిరుపతి ప్రధాన కార్యనిర్వాహక అధికారి విజయవంత్ మాథుర్ మరియు ఆయన బృందం మంగళవారం తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, శ్రీకాళహస్తి ఆర్డీఓ భాను ప్రకాష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు, సాధించిన పురోగతి మరియు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను వివరించారు. ఈ సందర్భంగా ఆర్టీఐహెచ్ ప్రతినిధులు మాట్లాడుతూ, సంస్థ ప్రారంభమై ఏడాది కాలం పూర్తికాకముందే వివిధ కార్యక్రమాల ద్వారా 118 నూతన సంస్థలను (స్టార్టప్‌లు) అనుసంధానం చేసినట్లు తెలిపారు. వీటిలో 28 నూతన సంస్థలు అధికారిక ఇంక్యుబేషన్ ఒప్పందాల దిశగా ముందుకు సాగుతున్నాయని వెల్లడించారు. ఆవిష్కరణల విస్తరణ కార్యక్రమాల ద్వారా 855 మందికి పైగా పారిశ్రామికవేత్తలు, 264 సూక్ష్మ, చిన్న మరియు మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈలు), 728 స్వయం సహాయక సంఘాలను అనుసంధానం చేసినట్లు పేర్కొన్నారు. అలాగే ఇన్నోట్రైబ్ నెట్‌వర్క్ ద్వారా 98 విద్యాసంస్థలు భాగస్వామ్యం కావడానికి ఆసక్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆవిష్కరణలు, స్వయం ఉపాధి అవకాశాలను ప్రోత్సహించే లక్ష్యంతో కుప్పం మండలంలోని వెండుగంపల్లెలో ఆర్టీఐహెచ్ రూరల్ అవుట్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్థిక వనరుల సమీకరణకు అనుసంధానం చేయడం, కేంద్ర వినియోగాన్ని మరింత విస్తరించడం, అలాగే ఎలక్ట్రానిక్స్, విద్యుత్ వాహనాలు, వ్యవసాయ మరియు ఆహార ఉత్పత్తులు, వైద్య సాంకేతిక రంగాలలో కనీసం రెండు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను ఏర్పాటు చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ, నూతన సంస్థల అభివృద్ధి, పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, పరిశ్రమల భాగస్వామ్యం మరియు ఆవిష్కరణల విస్తరణలో ఆర్టీఐహెచ్ తిరుపతి కీలక పాత్ర పోషిస్తోందని అభినందించారు.

# హనుమంతపురంలో దొంగల బీభత్సం

# పోలీసుల నిఘా ఏది?

ప్రజా భూమి ప్రతినిధి పిచ్చాటూరు.



తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గం పిచ్చాటూరు మండలం హనుమంతపురంలో దొంగతనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు ఇళ్లపై నిఘా ఉంచి, మోటార్ బైకులు మరియు విద్యుత్ తీగలను అపహరిస్తున్నారు. తాజాగా ఆదివారం మధ్యాహ్నం విద్యుత్ కనెక్షన్ తీగలను కట్ చేసి తీసుకెళ్లారు. సరిహద్దు ప్రాంతం కావడంతో వేసవిలో చోరీలు అధికమవుతున్నాయని,పోలీసులు తక్షణమే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# డిఎస్సీ అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

## - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్.

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.



డీఎస్సీ-2025 నియామక ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో నిరుద్యోగ యువత తీవ్ర ఆందోళనలో ఉందని, ఈ మొత్తం వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తు సంస్థలతో ప్రభుత్వం తక్షణమే సమగ్ర విచారణ చేయించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈశ్వరయ్య నేడొక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన తొలి సంతకాలలో ఒకటిగా డీఎస్సీ నోటిఫికేషన్ దస్త్రం ఉంది. అయితే ఆ సంతకం చేసి దాదాపు పది నెలలు గడిచినప్పటికీ డీఎస్సీ ప్రక్రియ పూర్తికాకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. అప్పటికే డీఎస్సీ ద్వారా 35 వేలకుపైగా వివిధ విభాగాల్లో ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నప్పటికీ, కేవలం 16,347 పోస్టులతో మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేయడం నిరుద్యోగ యువత ఆశలను దెబ్బతీయడమే. ఈ పోస్టుల కోసం లక్షలాది మంది నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు పోటీ పడ్డారు. ఒక్కో జిల్లాలో కొన్ని ఎస్జీటీ, ఎసఏ వంటి పోస్టులకు పూర్తిగా ఖాళీలు లేకపోవడం కూడా తీవ్ర అసంతృప్తికి దారితీసింది. డీఎస్సీ ప్రక్రియ మొత్తం వివాదాలు, న్యాయపరమైన కేసులు, పరిపాలనా లోపాల నడుమ సాగి, చివరకు హడావుడీగా నియామక ప్రక్రియ ముగించారు. ఇటీవల పేపర్ లీకేజీ ఆరోపణలు, డీఎస్సీ క్రీడావిభాగం కోటాలో అవకతవకల ఆరోపణలు వెలుగులోకి రావడంతో నిరుద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ అంశాలపై వస్తున్న ఆరోపణలకూ, అధికారులు చెబుతున్న వివరణలకూ ఎలాంటి పొంతన లేకపోయింది. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్), డీఎస్సీ పరీక్షలు రాయకుండానే క్రీడా విభాగం కోటా పేరుతో ఉద్యోగాలు కల్పించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనివల్ల ప్రతిభావంతులైన అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎంపికైన కొందరు అభ్యర్థులను తొలగించి, వారి స్థానాల్లో క్రీడా కోటా పేరుతో మరికొందరిని ఎంపిక చేసిన విధానం అనేక అనుమానాలకు తావిస్తున్నది. కొందరు అక్రమాలకు పాల్పడి నకిలీ క్రీడా సర్టిఫికెట్లు సృష్టించి లబ్ధి పొందారనే ఆరోపణలు వస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం చివరి దశలో డీఎస్సీ-2024 ద్వారా 6,100 పోస్టులు ప్రకటించగా, న్యాయపరమైన సమస్యలు, ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. అనంతరం చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దుచేసి, ఆ 6,100 పోస్టులతో కలిపి మొత్తం 16,347 పోస్టులతో కొత్త డీఎస్సీ ప్రకటించింది. అంటే అదనంగా కలిపిన పోస్టులు దాదాపు 10 వేల వరకే పరిమితమయ్యాయి. కూటమి ప్రభుత్వ సూపర్-6 హామీలలో భాగంగా ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. తక్షణమే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులతో పాటు ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేయాల్సిన అన్ని ఖాళీల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, డీఎస్సీ క్రీడా విభాగం పోస్టుల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

# ఇండియా హాకీ ట్రైయినింగ్ సెంటర్ కి సెలెక్ట్ అయిన ఎన్ చరిత

ప్రజాభూమి,పులివెందుల



స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హాకీ ట్రైనింగ్ సెంటర్ కు పులివెందులకు చెందిన ఎన్ చరిత సెలెక్ట్ అయినట్టు ఇండోర్ స్టేడియం ఇంచార్జ్ యేసు దాసు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక వైస్సార్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో చరిత 3 సంవత్సరాలుగా హాకీ ప్రాక్టీస్ చేస్తుంది అని తెలిపారు. ఏప్రిల్ నెలలో మడికేరి కర్ణాటక స్టేట్ జరిగిన అకాడమీ సెలక్షన్ లో చరిత ప్రతిభ కనబరచడం జరిగిందన్నారు. ఈ నెల 8 న చరిత అకాడమీ లో జాయిన్ అవుతుంది అని ఖేలో ఇండియా హాకీ కోచ్ తెలిపారు. అనంతరం చరిత సెలెక్ట్ అవ్వడం పట్ల స్థానిక ఖేలో ఇండియా హాకీ కోచ్ డి ఎస్ డి ఓ గౌష్ బషా వైస్సార్ ఇండోర్ స్టేడియమ్ ఇంచార్జ్ యేసు దాసు, ఖేలో ఇండియా డిప్యూటీ డైరెక్టర్ హిమ బిందులు అభినందించారు.

# సకుటుంబ సమేతంగా శిరిడి సాయిబాబా స్వామిని దర్శించుకున్న బత్తల గిరినాయుడు

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.



శ్రీ పరశురామేశ్వర స్వామి దేవస్థానం ఆలయ చైర్మన్ బత్తల గిరినాయుడు కుటుంబ సమేతంగా తేదీ 1-06-2026న షిరిడి సాయిబాబా స్వామి వారి దేవస్థానమునకు వెళ్లగా అక్కడి దేవస్థానం సీఈఓ గోరక్ష గడిల్కర్ వారికి దర్శన ఏర్పాట్లు చేసి ప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో భాగంగా అక్కడి దేవస్థానం సీఈఓ కి చైర్మన్ స్వామివారి విశిష్ట తెలిపే ఆలయ చరిత్ర గల పుస్తకమును వారికి బహుకరించి స్వామివారి దర్శనార్థానికి విచ్చేయవలసినదిగా ఆహ్వానించారు అక్కడి దేవస్థానం వారు కూడా సానుకూలంగా స్పందించి స్వామివారి దర్శనార్థం విచ్చేస్తామని తెలియజేశారు.

# ప్రజలకు సౌకర్యంగా ఉండే విధంగా బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలి

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.



తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం ఏర్పేడు నుంచి వెంకటగిరి దారిలో ఏర్పేడు మార్గమధ్యంలో రైల్వే గేటు ఉంది. అయితే రైల్వే గేట్ అండర్ బ్రిడ్జ్ పనులు ఈరోజు మొదలుపెట్టారు. ఈ అండర్ బ్రిడ్జ్ కేవలం ఆటోలు.కార్లు. ట్రాక్టర్లు. స్కూటర్లు. వెళ్లడానికి మాత్రమే వీలు ఉండేలాగా ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతున్నట్టు ప్రజలు అనుకుంటున్నారు. ఈ బ్రిడ్జి పనులు నిర్వహించేటప్పుడు మినీ వాహనాలే కాకుండా ఏర్పేడు నుంచి వెంకటగిరి కి వెళ్లే ఆర్డినరీ



బస్సులు ప్రయాణించే విధంగా ఈ బ్రిడ్జి నిర్మాణ పనులు జరిగితే బాగుంటుందని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ యొక్క మార్గంలో బాలకృష్ణాపురం. అమందూరు. అదేవిధంగా ఏర్పేడు తాసిల్దార్ కార్యాలయం. గవర్నమెంట్ హాస్పిటల్. ఇవన్నీ ఇదే మార్గంలో ఉన్నందువలన బస్సులు ఇటువైపు రాకపోతే ప్రజలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు ఇబ్బంది ఎదుర్కోవాల్సి ఉంటుందని ప్రజలు తెలియజేస్తున్నారు. దయచేసి అధికారులు ఆలోచన చేసి ప్రజలకు అన్ని విధాల సౌకర్యంగా ఉండే విధంగా ఈ యొక్క బ్రిడ్జి నిర్మాణం జరిగితే బాగుంటుందని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ నిర్మాణం అలా జరగిన పక్షంలో ప్రజలు ప్రజా సంఘాలు అన్నింటినీ కలుపుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ప్రజలకు అండగా నిలబడతామని సిపిఎం నాయకులు ఒక ప్రకటనలో తెలియజేశారు.

# క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తిస్తే నయం చేయవచ్చు

## -అవగాహన కార్యక్రమంలో టాటా ట్రస్ట్ క్యాన్సర్ వైద్యులు వెంకయ్య బాబు.

ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.

క్యాన్సర్ వ్యాధిని తొలి దశలోనే గుర్తిస్తే నయం చేయవచ్చునని తిరుపతి టాటా ట్రస్ట్ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు వెంకయ్యబాబు చెప్పారు.మంగళవారం సత్యవేడు మండలం దాసుకుప్పం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో క్యాన్సర్ వ్యాధి నిర్మూలన,తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వెంకటేశ్వర క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్,టాటా ట్రస్ట్ సంయుక్తంగా వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకయ్యబాబు మాట్లాడుతూ శరీరంలోని కణాలు అసాధారణంగా,అనియంత్రితంగా పెరిగి ఇతర భాగాలకు వ్యాపించడాన్ని క్యాన్సర్ అంటారన్నారు దీనివల్ల కణితి (ట్యూమర్) ఏర్పడి ఇది శరీరంలోని ఏ అవయవానికైనా సోకవచ్చు అన్నారు.పొగాకు,ధూమపానం,ఆల్కహాల్ అలవాటు హానికరమైన రసాయనాలు,రేడియేషన్‌కు గురికావడం వల్ల క్యాన్సర్ సోకుతుందన్నారు. శరీరంలో ఎక్కడైనా గడ్డలు లేదా వాపులు ఉండటం,దీర్ఘకాలిక దగ్గు,గొంతు నొప్పి లేదా మింగడంలో ఇబ్బంది ఉంటే క్యాన్సర్ లక్షణాలుగా ఆయన పేర్కొన్నారు.ఆరోగ్యకరమైన జీవనశైలి,పోషకాహారం తీసుకోవడం ద్వారా క్యాన్సర్ ముప్పును తగ్గించుకోవచ్చు అని ఆయన పేర్కొన్నారు. ప్రధానంగా కీమోథెరపీ,రేడియేషన్ థెరపీ, ఇమ్యునోథెరపీ,శస్త్రచికిత్స (ఆపరేషన్) వాటి చికిత్సల ద్వారా క్యాన్సర్ ముప్పు నుంచి బయట పడే అవకాశాలున్నారు.తదనంతరం 50 మందికి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ క్రిస్టల్ దాస్,హర్షవర్ధన్, ఎంపీహెచ్ఈఓ సుబ్రహ్మణ్యం,సూపర్వైజర్ మురళి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రెడ్డి కుమారి,స్టాఫ్ నర్స్ మెహతాజ్ దాసుకుప్పం పిహెచ్‌సీ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాభూమి

జనరల్

బుధవారం, జూన్ 03, 2026

12




# ఐదేళ్లు నిరుద్యోగులను ముంచింది వైస్సార్సీపీ కాదా..?

## గురువులను మద్యం షాపుల ముందు నిలబెట్టిన చరిత్ర మీది
## మెగా డీఎస్సీపై మాట్లాడే నైతిక హక్కు మీకెక్కడిది?
## 16 వేల పోస్టుల భర్తీతో కూటమి ప్రభుత్వం చారిత్రక విజయం
## అక్రమాలు జరిగాయని నిరూపిస్తే రాజకీయ సన్యాసానికి సిద్ధం
## టీడీపీ నేతల సవాల్

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి

ఐదేళ్లపాటు అధికారంలో ఉండి, ప్రతి ఏటా 'జాబ్ క్యాలెండర్' అంటూ నిరుద్యోగ యువతను నిలువునా ముంచింది వైస్సార్సీపీ కాదా? ఎన్నికల ముందు మెగా డీఎస్సీ అని నమ్మించి, అధికారం లోకి వచ్చాక ఆ ఊసే ఎత్తకుండా గురువుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసింది మీ ప్రభుత్వం కాదా?" అని తెలుగుదేశం పార్టీ నాయకులు వైస్సార్సీపీ నేతలను సూటిగా ప్రశ్నించారు. మచిలీపట్నంలో జరిగిన ప్రెస్ మీట్‌లో కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ నియామకాలపై వైస్సార్సీపీ చేస్తున్న ఆరోపణలను టీడీపీ నేతలు తీవ్రస్థాయిలో తిప్పికొట్టారు.నాడు గురువులకు అవమానం.. నేడు సముచిత గౌరవంగత వైస్సార్సీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు జరిగిన అవమానాలను నేతలు ఈ సందర్భంగా గుర్తుచేశారు.మద్యం దుకాణాల వద్ద డ్యూటీలు సమాజంలో తల్లిదండ్రుల తర్వాత అత్యున్నత స్థానంలో ఉండే ఉపాధ్యాయులను వైస్సార్సీపీ ప్రభుత్వం మద్యం షాపుల ముందు కాపలా నిలబెట్టిందని మండిపడ్డారు.మరుగుదొడ్ల ఫోటోల టాస్క్ గురువుల చేత మరుగుదొడ్ల ఫోటోలు తీయించి వారి ఆత్మగౌరవాన్ని బూడిదలో పోసిన పన్నీరులా మార్చారని ధ్వజమెత్తారు. కూటమి మార్పు ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులకు పూర్తి గౌరవాన్ని ఇస్తూ, విద్యా రంగాన్ని బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోందని స్పష్టం చేశారు. నాడు 67%... నేడు 85% : ఇదీ కూటమి మార్క్ విద్యా విప్లవంజగన్ రెడ్డి పాలనలో పదో తరగతి ఫలితాలు ఘోరంగా 67 శాతానికి పడిపోతే... నేడు కూటమి ప్రభుత్వ సమర్థవంతమైన పనితీరు వల్ల అవి ఏకంగా 85 శాతానికి పెరిగాయి.విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, విద్యార్థులకు కేవలం చదువే కాకుండా భవిష్యత్తుకు ఉపయోగపడేలా 'స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు' అందుబాటులోకి తెచ్చామని నేతలు వివరించారు.200 కేసులు వేసినా ఆగని 'మెగా డీఎస్సీ' బండిఅధికారంలోకి రాగానే ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం 16,000 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టిందని నేతలు తెలిపారు. డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చిన రోజు నుంచే దీన్ని ఎలాగైనా అడ్డుకోవాలని వైస్సార్సీపీ నేతలు కుట్రలు పన్నారని, కోర్టుల్లో ఏకంగా 200కు పైగా కేసులు వేయించారని ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, వాటన్నింటినీ అధిగమించి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నియామకాల ప్రక్రియను పూర్తి చేసి నిరుద్యోగుల కల నిజం చేసిందని కొనియాడారు. చేతనైతే ఒక్క ఆధారమైనా చూపండిడీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని గల్లాలు ఎగరేస్తున్న వైస్సార్సీపీ నేతలకు మేం సవాల్ విసురుతున్నాం. మీకు దమ్ముంటే జరిగిన అక్రమాలపై ఒక్కటంటే ఒక్క ఆధారమైనా ప్రజల ముందు పెట్టండి,అని టీడీపీ నేతలు సవాల్ విసిరారు. బురదజల్లే రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, రాష్ట్ర భవిష్యత్తు కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కూటమి ప్రభుత్వానికే ప్రజల మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని వారు స్పష్టం చేశారు.ఈ బృహత్తర ప్రెస్ మీట్‌లో మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె దుర్గా ప్రసాద్ (నాని), తెలుగుదేశం టౌన్ పార్టీ ప్రధాన కార్యదర్శి బచ్చుల అనీల్, మాజీ టౌన్ పార్టీ అధ్యక్షుడు ఇలియాస్ పాషా, మాజీ కార్పొరేటర్ దింతకుర్తి సుధాకర్, 30వ డివిజన్ ఇంచార్జి పిప్పళ్ళ వెంకన్న, 11వ డివిజన్ ఇంచార్జి చిన్నం శివ తదితర ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా ప్రకృతి వ్యవసాయ కార్యాచరణ (2026-27) పుస్తకావిష్కరణ

## జిల్లా కలెక్టర్ కె. బాలాజీ చేతుల మీదుగా విడుదల..
## ఎల్ నినో సవాళ్లకు ప్రకృతి వ్యవసాయమే సరైన పరిష్కారం



మచిలీపట్నం/ప్రజా భూమి ప్రతినిధి

ఎల్ నినో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కృష్ణా జిల్లాకు సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన ప్రకృతి వ్యవసాయ కార్యాచరణ (2026-27) పుస్తకాన్ని కృష్ణజిల్లా కలెక్టర్ కె. బాలాజీ ఘనంగా ఆవిష్కరించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా ఈ పుస్తకం ఎంతో దోహదపడుతుందని కలెక్టర్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ విశిష్ట పుస్తకంలో వివిధ రకాల పంటలలో ఎదురయ్యే వాతావరణ పరిస్థితులను తట్టుకునేందుకు, వాటికి అనుగుణంగా చేపట్టాల్సిన ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులను క్షుణ్ణంగా వివరించడం జరిగింది. ముఖ్యంగా ఎల్ నినో ప్రభావం వల్ల తలెత్తే తీవ్రమైన సమస్యలకు, వాటి నుంచి పంటలను రక్షించుకోవడానికి అవసరమైన సమగ్ర పరిష్కార మార్గాలను, వ్యూహాలను ఇందులో పొందుపరిచారు.రైతులకు పూర్తి అవగాహనఈ వినూత్న సాగు విధానాలపై క్షేత్ర స్థాయిలో రైతులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించే బాధ్యతను వ్యవసాయ శాఖ సిబ్బంది మరి యు రైతు సాధికార సంస్థ (RySS) సిబ్బంది సంయుక్తంగా తీసుకోనున్నారు. జిల్లాలోని ప్రతి ఒక్క రైతుకు ఈ సమాచారాన్ని చేరవేసి, ఎల్ నినో వంటి సంక్షోభ సమయాల్లోనూ స్థిరమైన దిగుబడులు సాధించేలా వారిని సన్నద్ధం చేస్తామని అధికారులు వెల్లడించారు.ఈ ప్రతిష్టాత్మక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జ్యోతిర్మయి , ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ పార్థసారథి , సహాయ సంచాలకులు ఎన్.మణిధర్ మరియు వ్యవసాయ శాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నైరుతి రుతుపవనాలు - 2026 ముందస్తు సన్నద్ధతపై జాతీయ సదస్సు





ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

నైరుతి రుతుపవనాల కాలం అధికారికంగా ప్రారం భ మైన నేపథ్యంలో.. విపత్తు నిర్వహణ సంస్థలు, ప్రభుత్వ యంత్రాంగం ముందస్తు సమాచారాన్ని అందిపుచ్చుకుని ప్రాణ, ఆస్తి నష్టాల ను గణనీయంగా తగ్గించేందుకు సన్నద్ధం కావాలని భారత వాతావరణ శాఖ (IMD - ఐఎండి) డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం. మహాపాత్ర పిలుపునిచ్చారు.కృష్ణా జిల్లా గన్నవరం మండలం అడవినెక్కలంలోని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (NIDM - ఎన్ఐడిఎం) సదరన్ క్యాంపస్‌లో మంగళవారం నైరుతి రుతుపవనాలు 2026 అంచనాలు – సన్నద్ధత & బహుళ-విపత్తు వాతావరణ హెచ్చరిక సేవలు అనే అంశంపై ఉన్నత స్థాయి వాటాదారుల (స్టేక్‌హోల్డర్స్) సమావేశం జరిగింది. ఐఎండి, ఎన్ఐడిఎం సంయు క్తంగా నిర్వహించిన ఈ సదస్సుకు న్యూఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డాక్టర్ ఎం. మహాపాత్ర ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

1. ఏపీపై అల్పపీడనాల ప్రభావం: ఐఎండి డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం. మహాపాత్రముందస్తు రాక: సాధారణంగా జూన్ 1 నుండి ప్రారంభమయ్యే రుతుపవనాలు, ఈ ఏడాది మే 16 నాటికే అండమాన్, దక్షిణ బంగాళాఖాతంలోకి ప్రవేశించాయి. వాతావరణ మార్పులు: ఎల్ నినో, లా నినా, ఇండియన్ ఓషన్ డైపోల్ (IOD), మేడెన్ జూలియన్ అసిలేషన్ (MJO) వంటి గ్లోబల్ వాతావరణ మార్పుల వల్ల వర్షాలు పడే రోజులు (Wet Spells), పొడి రోజులు (Dry Spells) మారుతుంటాయి.

కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాలకు ముప్పు: బంగాళాఖాతంలో ఏర్పడే 13-14 అల్పపీడనాల్లో 90% ఉత్తర బంగాళాఖాతంలోనే ఏర్పడతాయి. ఇవి రుతుపవన ద్రోణి వెంబడి కదిలేటప్పుడు ఉత్తర ఆంధ్రప్రదేశ్ మీదుగా భారీ వర్షాలు కురుస్తాయి. దీనివల్ల గోదావరి, కృష్ణా పరివాహక ప్రాంతాలు ఎక్కువగా ప్రభావితమవుతాయి.ఓరోగ్రాఫిక్ ఎఫెక్ట్ (కొండల ప్రభావం): ఉత్తర ఆంధ్ర, దక్షిణ ఒడిశా సరిహద్దుల్లోని ఎత్తైన తూర్పు కనుమల కొండలను రుతుపవన గాలులు ఢీకొన్నప్పుడు ఆయా ప్రాంతాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయి.సముద్రపు పోటు - వరదలు: అల్పపీడనాల సమయంలోనే అమావాస్య, పౌర్ణమి రోజుల్లో వచ్చే సముద్రపు పోటు (High Tides) తోడైతే, వరద నీరు సముద్రంలోకి వెళ్లక తీర ప్రాంతాలు ముంపునకు గురవుతాయి.సాంకేతిక సేవలు - మొబైల్ యాప్‌లు: ఐఎండి అభివృద్ధి చేసిన 'డిసిషన్ సపోర్ట్ సిస్టమ్' ద్వారా వారం రోజుల ముందస్తు 'ఇంపాక్ట్ బేస్డ్ ఫోర్‌కాస్ట్' (ప్రభావ ఆధారిత అంచనాలు) తెలుసుకోవచ్చు. సాధారణ ప్రజల కోసం 'మౌసమ్' (Mausam), 'మౌసమ్ గ్రామ్' యాప్‌లు, రైతుల కోసం 'కృషి నిధి / క్రాప్ వెదర్' యాప్‌లను అందుబాటులో ఉంచారు.

వీటి ద్వారా 25 రకాల పంటలకు తెగుళ్ల నివారణ, వాతావరణ సమాచారం అందుతుంది. రాబోయే 3 గంటల మార్పులను రంగుల కోడ్‌ల (Color Codes) రూపంలో 'నౌకాస్ట్' (Nowcast) ద్వారా అందిస్తున్నాము.ఏపీలో వర్షపాతం: ఈ ఏడాది ఏపీలో, ముఖ్యంగా మధ్య ఆంధ్రప్రదేశ్‌లో సాధారణం లేదా సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోద య్యే అవకాశం ఉంది. జూన్ నెలలో వర్షాలు బాగుంటాయి.

2. సైంటిఫిక్ రీసెర్చ్ తోడుగా ఉండాలి: ప్రొఫెసర్ బి.వి. రమణరావు (ICAR-CRIDA)రూ. 1 లక్ష కోట్లకు పైగా ఖర్చు: 1979 దివిసీమ ఉప్పెన కాలంలో వేల కోట్ల నష్టం జరగ్గా, ప్రస్తుతం విపత్తు నిర్వహణ కోసం ప్రభుత్వం ఏటా రూ. 1 లక్ష కోట్లకు పైగా ఖర్చు చేస్తోంది. ముందస్తు చర్యల ద్వారా ఈ నష్టాన్ని 10 నుండి 15 శాతం తగ్గించగలిగితే ఆ నిధులను దేశ ప్రగతికి ఉపయోగించవచ్చు.వల్నరబిలిటీ ఇండెక్స్: ముందస్తు హెచ్చరికలతో పాటు ఏ ఏ ప్రాంతాలు ప్రమాదంలో ఉన్నాయో తెలిపే శాస్త్రీయ పరిశోధనలు (Scientific Research), 'వల్నరబిలిటీ ఇండెక్స్' రూపకల్పన జరగాలి. తక్కువ వర్షపాతం వల్ల దేశంలో 25-30% ప్రాంతాలు కరువుకు గురవుతాయి కాబట్టి శాస్త్రవేత్తలు రైతులకు ముందే నివారణ చర్యలు వివరించాలి.

3. 'క్లైమేట్ స్మార్ట్ స్టేట్'గా ఆంధ్రప్రదేశ్: డా. డి. శివానంద పై (RMC, చెన్నై)ఎల్ నినో సవాలు: ఈ ఏడాది బలమైన 'ఎల్ నినో' ముందే వచ్చే అవకాశం ఉన్నందున దేశ సగటు వర్షపాత అంచనాను 90% కి తగ్గించారు. దీనివల్ల సాధారణం కంటే తక్కువ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి.

హఠాత్తు వరదలు: వర్షాలు తగ్గినప్పటికీ వాతావరణ మార్పుల వల్ల హఠాత్తుగా భారీ వరదలు వచ్చే ప్రమాదం ఉంది. అందుకే ఆంధ్రప్రదేశ్‌ను *"క్లైమేట్ స్మార్ట్ స్టేట్"*గా మార్చడానికి అన్ని రంగాలు సమన్వయంతో కార్యాచరణ ప్రణాళిక (Action Plan) సిద్ధం చేసుకోవాలి.

4. ఒడిశా సూపర్ సైక్లోన్ నుండి బిపోర్జాయ్ వరకు సాధించిన పురోగతి: కమాండెంట్ వి.వి.ఎన్. ప్రసన్న కుమార్ (NDRF 10వ బెటాలియన్) ఐఎండి హెచ్చరికల ఆధారంగానే ఎన్‌డిఆర్ఎఫ్ (NDRF) తన బృందాలను ముందస్తుగా ప్రభావిత ప్రాంతాలకు తరలిస్తుంది. మా బెటాలియన్ బంగాళాఖాతం నుండి అరేబియా సముద్రం వరకు (ఏపీ, తెలంగాణ, కర్ణాటక) సేవలు అందిస్తోంది.1999 ఒడిశా సూపర్ సైక్లోన్‌లో 10,000 కు పైగా ప్రాణనష్టం జరిగితే.. పెరిగిన సాంకేతికత, ముందస్తు సమన్వయం వల్ల 2023 'బిపోర్జాయ్' తుఫాను సమయంలో ఒక్క ప్రాణ నష్టం కూడా జరగకుండా నివారించగలిగాము.

5. సన్నద్ధత కోసం పెట్టే ప్రతి రూపాయి.. ₹14 లతో సమానం: కల్నల్ పి. శ్రీనివాసులు రెడ్డి (జాయింట్ డైరెక్టర్, NIDM)విపత్తు వచ్చాక చేసే ఖర్చు కంటే, రాకముందే సన్నద్ధత (Preparedness) కోసం పెట్టే ప్రతి ఒక రూపాయి, తర్వాత పెట్టే 14 రూపాయల ఖర్చుతో సమానం.అలర్ట్ సిస్టమ్స్ (మొబైల్ అలారమ్స్, SMS) ద్వారా సమాచారం క్షేత్రస్థాయిలో ఉన్న చివరి వ్యక్తి వరకు చేరాలి. ఇస్రో (ISRO), ఐఎండి (IMD), ఎన్ఐడిఎం (NIDM), ఎన్‌డిఆర్ఎఫ్ (NDRF) కలిసి ఒకే తాటిపై పనిచేయాలి. విపత్తు ప్రణాళికల్లో వృద్ధులు, పిల్లలు, దివ్యాంగులు, గర్భిణీ స్త్రీల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి.

6. పంటల యాజమాన్యానికి వాతావరణ అంచనాలు కీలకం: సైంటిస్ట్ ఎస్. స్టెల్లా (అమరావతి ఐఎండి)ఐఎమ్‌డి ఏప్రిల్, మే నెలల్లో విడుదల చేసే దీర్ఘకాలిక వాతావరణ అంచనాలు వ్యవసాయ ప్రణాళికలకు, పంటల ఎంపికకు కీలకం. వాతావరణ మార్పుల ప్రభావం వ్యవసాయం, ఆరోగ్యం, రవాణా, విద్యుత్, పౌరసరఫరాలు, టూరిజం వంటి రంగాలపై ఉంటుంది. ఈ హెచ్చరికలను అన్ని ప్రభుత్వ శాఖలు, జిల్లా అధికారులు తీవ్రంగా పరిగణించాలి.వివిధ శాఖల పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు:ఈ సదస్సులో భాగంగా నిర్వహించిన టెక్నికల్ సెషన్‌లో విపత్తు నిర్వహణ అథారిటీ, వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యాన, జల వనరుల శాఖ, పౌరసరఫరాలు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, ఆర్అండ్‌బి (R&B), ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఆల్ ఇండియా రేడియో, ప్రసార భారతి తదితర శాఖల అధికారులు తమ సంసిద్ధతపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లను సమర్పించారు.

ఈ కార్యక్రమంలో వాతావరణ శాస్త్రవేత్తలు, విపత్తు నిర్వహణ నిపుణులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కృష్ణా జిల్లాలో ఉచిత ఇసుక'పై కలెక్టర్ ప్రత్యేక నిఘా

## జూన్ 1 నుంచి అక్టోబర్ 15 వరకు కృష్ణా నదిలో ఇసుక తవ్వకాలు నిషిద్ధం: ఎన్జీటీ నిబంధనల అమలు
## అక్రమార్కులకు తావులేదు..
## నిబంధనలు ఉల్లంఘిస్తే ఎఫ్ఐఆర్‌లు
## జిల్లా కలెక్టర్ డీకే బాలాజి





మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి

జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత ఇసుక విధానాన్ని అత్యంత పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాను పూర్తిగా అరిక ట్టేందుకు అన్ని శాఖల అధికారులు సమ న్వయంతో పనిచేయాలన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు, జాయిం ట్ కలెక్ట ర్ ఎం. నవీన్‌లతో కలిసి జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.నది నుంచి నేరుగా తరలింపుపై నిషేధం National Green Tribunal (NGT) మరియు పర్యావరణ శాఖ మార్గదర్శకాల ప్రకారం వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జూన్ 1 నుంచి అక్టోబర్ 15 వరకు కృష్ణా నదిలో ఇసుక తవ్వకాలను పూర్తిగా నిషేధించారు. నది పరివాహక ప్రాంతాల నుంచి నేరుగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.కొరత లేకుండా 10 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వలువర్షాకాలంలో ప్రజలకు ఇసుక కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9 అధికారిక స్టాక్ యార్డుల్లో సుమారు 10 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను సిద్ధంగా ఉంచామన్నారు.24 గంటల సరఫరా ప్రజల అవసరాల కోసం స్టాక్ యార్డుల నుండి 24 గంటల పాటు ఇసుక సరఫరా జరిగేలా ఏర్పాట్లు చేశారు.నిర్వహణ ఖర్చులు ఇసుక యార్డు వద్ద ఏజెన్సీల నిర్వహణ ఖర్చుల నిమిత్తం టన్నుకు రూ.155 చొప్పున నిర్ణయించారు. ఆన్‌లైన్ బిల్లు ఉంటేనే అనుమతి.. లేదంటే సీజ్ ఇసుక రవాణా చేసే ప్రతి వాహనానికి ఆన్‌లైన్‌లో జనరేట్ చేసిన రసీదు తప్పనిసరి. ఆ రసీదులో క్రింది వివరాలు నిఘా అధికారుల తనిఖీల్లో పక్కాగా ఉండాలి:తేదీ మరియు సమయంస్టాక్ యార్డ్ వివరాలువినియోగదారుడి పేరువాహనం నంబర్ మరియు అనుమతించిన ఇసుక పరిమాణంఅక్రమ రవాణాపై ఉక్కుపాదంనిర్ణీత పరిమాణం కంటే ఎక్కువ ఇసుకను తరలించినా, రసీదులు లేకుండా రవాణా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీస్, రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అక్రమ తవ్వకాలకు పాల్పడే వారిపై ఎఫ్ఐఆర్‌లు (FIRs) నమోదు చేయాలని స్పష్టం చేశారు. ప్రజలు కూడా అక్రమ ఇసుకను నమ్మి మోసపోకుండా, కేవలం అధికారిక స్టాక్ యార్డుల నుంచే ఇసుకను పొందాలని విజ్ఞప్తి చేశారు.హాజరైన అధికారులు:ఈ సమావేశంలో భూగర్భవనరుల శాఖ ఏడి కొండారెడ్డి, డిపిఓ ధనలక్ష్మి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సోమ శేఖర్, వాణిజ్య పన్నుల సహాయ కమిషనర్ సౌమ్య, ఇరిగేషన్ ఈఈ రవి కిరణ్, భూగర్భ జల శాఖ ఏడీ బిందుశ్రీ పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభమైన యమునా పుష్కరాలు

## ఉత్తరప్రదేశ్‌కు పోటెత్తిన తెలుగు భక్తులు..
## 'ఆగ్రా, మథుర, బృందావనం'లో ఆధ్యాత్మిక సందడి





ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

ఉత్తరప్రదేశ్ వేదికగా యమునా నది పుష్కరాలు మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ మహా వేడుకకు ఉభయ తెలుగు రాష్ట్రాల (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. మొదటి రోజే యమునా నది తీరాలన్నీ తెలుగువారితో కిక్కిరిసిపోయి, సరికొత్త ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.ఘాట్ల వద్ద భక్తుల కిటకిట..ముఖ్యంగా ఆగ్రా, మథుర, బృందా వనంలోని ఘాట్లలో తెలుగు భక్తుల సందడి ప్రత్యేకంగా నిలిచింది.బృందావనంలోని 'కేసీ ఘాట్'మథురలోని 'విశ్రాం ఘాట్'ఈ రెండు ప్రధాన ఘాట్లలో ఉదయం నుంచే భక్తులు పుష్కర స్నానాలు ఆచరించారు. అనంతరం తమ పితృదేవతలకు పిండప్రదానాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెలుగు పండితుల సమక్షంలో పూజలు మన తెలుగు రాష్ట్రాల నుండి వందలాది మంది ప్రసిద్ధ పండితులు ఈ పుష్కరాలకు తరలివచ్చారు. స్థానిక ఘాట్లలో భక్తులకు తెలుగు సంప్రదాయం ప్రకారం శాస్త్రోక్తంగా పూజలు, వైదిక కార్యక్రమాలు జరిపించారు.విశేష ఆకర్షణగా మచిలీపట్నం ప్రముఖుల పూజలుఈ పుష్కరాల ప్రారంభోత్సవ వేడుకల్లో కృష్ణా జిల్లా మచిలీపట్నానికి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. మచిలీ పట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, 15వ వార్డు మాజీ కౌన్సిలర్ లంకి శెట్టి వనజ దంపతులు మంగళవారం తొలిరోజే యమునా నదిలో పుష్కర స్నానాలు ఆచరించారు.ఈ సందర్భంగా వారు అక్కడ పూజలు నిర్వహించిన తెలుగు పండితులకు ప్రత్యేకంగా ఆర్థిక సహాయం అందించి, తమ ఉదారతను చాటుకున్నారు. యూపీ ప్రభుత్వ ఏర్పాట్లపై ప్రశంసలుఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఘాట్ల వద్ద పటిష్టమైన భద్రత, అన్ని రకాల మౌలిక వసతులను కల్పించింది. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలో ప్రభుత్వం ముందస్తుగా చేసిన అద్భుతమైన ఏర్పాట్ల వల్లే.. ఇంత పెద్ద ఎత్తున జనం వచ్చినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా పుష్కర స్నానాలు చేయగలిగాం.– లంకిశెట్టి బాలాజీ, లంకిశెట్టి వనజ (మచిలీపట్నం ప్రముఖులు)మొత్తానికి, తొలిరోజే యమునా పుష్కరాలు విజయవంతం కావడంతో రాబోయే రోజుల్లో తెలుగు రాష్ట్రాల నుండి భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.


Printed by MOHANEESWAR PUBLICATIONS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at Y.S.R. and published at D.No.30-251, WARD NO.4, BUDDAYAPALLE VILLAGE, CHINNACHOWK editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .RNI NO:APTEL/25/A1220.cell:9502116677.

ప్రజాభూమి

జనరల్ 13

బుధవారం 3, జూన్ 2026

# జూన్ 3 నుంచి 5 వరకు మూడు రోజుల పాటు కేరళంలో మంత్రి దుర్గేష్ పర్యటన

- కేరళం పర్యటనకు బయల్దేరిన మంత్రి కందుల దుర్గేష్..'బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్'గా నిలిచిన ఏపీ ఎంపికైన నేపథ్యంలో జూన్ 4న జీటీఎం ఎక్స్ పో -2026లో ప్రతిష్ఠాత్మక అవార్డు అందుకోనున్న మంత్రి దుర్గేష్
- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దార్శనికతకు దక్కిన అరుదైన గౌరవంగా అభివర్ణించిన మంత్రి దుర్గేష్
- కూటమి ప్రభుత్వ పర్యాటక సంస్కరణలకు జాతీయ గుర్తింపు రావడంపై హర్షం.. 'బ్రాండ్ ఏపీ'కి దక్కిన అరుదైన పురస్కారంగా అభివర్ణన
- నూతన టూరిజం పాలసీ, పారిశ్రామిక హోదాతో మారిన గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌పై అదరగొట్టిన 'బ్రాండ్ ఏపీ'.. కూటమి ప్రభుత్వంలో మారిన ఆంధ్రప్రదేశ్ పర్యాటక ముఖచిత్రం: మంత్రి దుర్గేష్
- కేరళం అవార్డు ఏపీ పర్యాటక వైభవ ప్రపంచ స్థాయి విజయాలకు ఒక ఘనమైన ఆరంభంగా పేర్కొన్న మంత్రి కందుల దుర్గేష్

**ప్రజాభూమి ప్రతినిధి - అమరావతి**

ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. దక్షిణాదిలోనే అతిపెద్ద ట్రావెల్ అండ్ ట్రేడ్ ఎక్స్‌పో అయిన 'గ్లోబల్ ట్రావెల్ మార్కెట్' (GTM 2026) ఆంధ్రప్రదేశ్‌ను "బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్" (ఉత్తమ పర్యాటక ప్రచార రాష్ట్రం)గా ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో కేరళలోని తిరువనంతపురంలో జరగనున్న 'జీటీఎం ఎక్స్‌పో -2026'లో పాల్గొని, ప్రతిష్ఠాత్మకమైన 'మెట్రో ఎక్స్‌పెడిషన్ -GTM టూరిజం అవార్డు 2026'ను స్వీకరించేందుకు రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మూడు రోజుల కేరళం పర్యటనకు బయలుదేరారు. కేరళం పర్యటనలో భాగంగా జూన్ 3న తిరువనంతపురంలోని కోవాలం 'ఉదయ్ సముద్ర లీజర్ బీచ్ హోటల్ అండ్ స్పా'లో జరిగే జీటీఎం ఎక్స్ పో - 2026 ప్రారంభోత్సవంలో మంత్రి దుర్గేష్ పాల్గొంటారు. అనంతరం జూన్ 4న తిరువనంతపురం 'గోల్డెన్ ప్యాలెస్ కన్వెన్షన్ సెంటర్'లో జరిగే ఎక్స్ పో కార్యక్రమాలకు హాజరవుతారు. అదే రోజు సాయంత్రం 4 గంటలకు కోవాలంలోని 'లీలా తిరువనంతపురం రావిజ్ హోటల్'లో జరిగే జీటీఎం అవార్డ్స్-2026 వేడుకలో దేశవిదేశాల ప్రముఖుల సమక్షంలో



ఏపీకి దక్కిన "బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్" అవార్డును మంత్రి దుర్గేష్ అందుకోనున్నారు. ఆ తర్వాత జూన్ 5న తిరువనంతపురం నుండి ముంబయి పర్యటనకు బయలుదేరి వెళ్తారు.

**ఇది కూటమి ప్రభుత్వ దార్శనికతకు దక్కిన గౌరవం: మంత్రి కందుల దుర్గేష్**

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. "ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ల దిశానిర్దేశంలో, కేంద్ర ప్రభుత్వ సహకారంతో పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఎండీ ఆమ్రపాలి కాట, పర్యాటక శాఖ అధికారుల బృందం అంతర్జాతీయ స్థాయిలో చేసిన కృషికి దక్కిన అరుదైన గౌరవం ఇది. పర్యాటక రంగంలో మేం తీసుకొచ్చిన వినూత్న సంస్కరణలు, విప్లవాత్మక మార్పుల వల్లే ఈ రోజు జాతీయ స్థాయి ప్రశంసలు దక్కాయి" అన్నారు. ప్రధానంగా నూతన పర్యాటక పాలసీ 2024-29, పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పన, అనుబంధ పాలసీలు అదే విధంగా 'బ్రాండ్ ఏపీ' ప్రదర్శనతో సోషల్ మీడియా, అంతర్జాతీయ ప్లాట్‌ఫామ్స్‌పై ఏపీ పర్యాటక సౌందర్యాన్ని సరికొత్త శైలిలో బ్రాండింగ్ చేశామన్నారు. రాష్ట్రంలో టూరిజం యాక్టివిటీ పెంచేందుకు ఏడాది పొడవునా నిరంతరం ప్రతి జిల్లాలో పర్యాటక ఉత్సవాలు నిర్వహించామన్నారు. అంతేగాక సృజనాత్మక ఆలోచనలు, డిజిటల్ ప్రమోషన్స్ ద్వారా అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించామన్నారు. కేరళంలో అందుకోబోయే ఈ జాతీయ అవార్డు ఏపీ పర్యాటక వైభవానికి ముగింపు కాదు.. ఇది ప్రపంచ స్థాయి విజయాలకు ఒక ఘనమైన ఆరంభం!" అని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న టూరిజం బోర్డులు, హాస్పిటాలిటీ బ్రాండ్‌లు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొనే ఈ ఎక్స్‌పో ద్వారా ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి మరిన్ని పెట్టుబడులు, పర్యాటకులు వచ్చే అవకాశం ఉందని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఐ.ఐ.టి గౌహాతిలో నికిల్‌కి 1412 ర్యాంక్

**ప్రజాభూమి ప్రతినిధి - రామచంద్రపురం**



రామచంద్రపురం ఏరియా వైద్యశాల నందు నర్సింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వి.రోజామణి కమారుడు ఎన్.ఎల్. నిఖిల్ కు కెమికల్ ఇంజనీర్ ఎమ్ టెక్ ఎంట్రన్స్ ఎగ్జామ్‌లో ఆల్ ఇండియా ర్యాంక్ 1412 సాంధించాడు. నికిల్ రామచంద్రపురంలో 1 తరగతి నుండి సెయింట్ ఆన్ గ్లోరీయా పాఠశాల నందు 10వతరగతి వరకు చదివివాడు.బి.టెక్ విశాఖపట్నం ఆంధ్రాయునివర్శిటీ నందు చదవగా తల్లి రోజామణి రామచంద్రపురం ఏరియా వైద్యశాల నందు పని చేస్తుండగా,తండ్రి ఎన్.వి. ప్రసాద్ సెయింట్ ఆన్ గ్లోరీయా పాఠశాలలో టిచర్ గాపని చేస్తున్నారు.తమ కుమారుడు నికిల్ కు అస్సాం రాష్ట్రంలో గౌహతి లో ఐఐటిలో ఎమ్ టెక్ ఎంట్రన్స్ లో ఆల్ ఇండియా ర్యాంక్ రావడం ఆనందథాయకంగా ఉందన్నారు. ఎంపికైన నికిల్ ని రామచంద్రపురం ఏరియా వైద్యశాల సిబ్బంది ,సెయింట్ ఆన్ గ్లోరీయా స్కూల్ యాజమాన్యం అధ్యాపక బృందం తదితరులు అభినందించారు.

## కిషోర బాలికల వికాసమే లక్ష్యం : సీడీపీఓ గజలక్ష్మి



**ప్రజాభూమి ప్రతినిధి - కొత్తపేట**

రావులపాలెం గ్రామంలోని లిటిల్ ఫ్లవర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శక్తి సదన్ సురక్షిత హోమ్‌లో మంగళవారం వేసవి శిక్షణా తరగతులలో భాగంగా "కిషోరీ బాలికల వికాసం" కార్యక్రమాన్ని అంగన్వాడీ కార్యకర్తలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐసీడీఎస్ సీడీపీఓ గజలక్ష్మి మాట్లాడుతూ, బాలికల సమగ్ర అభివృద్ధి, రక్షణ, సాధికారత కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. బాల్య వివాహాలు, బాల్య గర్భధారణ, లైంగిక వేధింపులు, ఇంటర్నెట్ ప్రభావం, సైబర్ నేరాలు వంటి అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. ఇటువంటి సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవడానికి అవగాహన ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం ఐసీడీఎస్ శాఖ ద్వారా మే 1 నుంచి జూన్ 9 వరకు ప్రతి మంగళవారం, శుక్రవారం బాలికల అభివృద్ధి, రక్షణకు సంబంధించిన పలు అంశాలపై ప్రత్యేక వేసవి శిక్షణా తరగతులను నిర్వహిస్తోందని తెలిపారు. విద్యే బాలికల భవిష్యత్తుకు బలమైన పునాది అని, అది వారిని స్వయం సమృద్ధిగా ఎదగడానికి దోహదపడుతుందని ఆమె అన్నారు. ల్యాంప్ కోఆర్డినేటర్ బడుగు సుబ్బాయమ్మ మాట్లాడుతూ, బాలికలకు గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. ఎలాంటి ఆపద లేదా ఇబ్బంది ఎదురైనప్పుడు సమీపంలోని అంగన్వాడీ కార్యకర్తలను సంప్రదించాలని, అవసరమైతే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు ఫోన్ చేయాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదుల కోసం 1930 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ చంద్రకళ, హోమ్ సిస్టర్స్ సంగీత, ఆరోగ్య మేరీ, అంగన్వాడీ కార్యకర్తలు, బాలికలు పాల్గొన్నారు. కార్యక్రమం ద్వారా బాలికల్లో ఆత్మవిశ్వాసం, స్వీయ రక్షణ, సామాజిక అవగాహన పెంపొందించేందుకు అవసరమైన సూచనలు అందించారు.

## తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం : గుర్రంపేట గ్రామస్తులు



**ప్రజాభూమి ప్రతినిధి - వి.ఆర్.పురం.**

గుర్రంపేట గ్రామంలో నీటి మోటారు చెడిపోయి నీటి కొరత ఉన్నా అధికారులు స్పందించకపోవడం చాలా బాధాకరం అని, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, మాత్రాగునిటి సమస్యను పరిష్కరించాలని గుర్రంపేట గ్రామస్తులు కోరుతున్నారు. దాదాపుగా రెండు వారల నుంచి త్రాగునీటి మోటారు పనిచేయటం లేదని, అంతకు ముందు ఇదే విధంగా పని చేయకపోతే బాగుచేశారని, కానీ కొద్ది రోజులకే అది మళ్లీ పడిందని, ఎప్పుడు కూడా నాసిరకం పరికరాలతో అమర్చడం వలన మోటార్ కొద్దీ రోజులు మాత్రమే నీటిని సరఫరా చేస్తుందనీ వారు తెలిపారు. అసలే ఎండాకాలం నీటి కొరత వలన గ్రామ ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారు, కావున గ్రామ పంచాయితీ అధికారులు ఈ సమస్యపై వెంటనే స్పందించి నీటి కొరత సమస్యని పరిస్కారం చేయించగలరని గ్రామస్తులు కోరుతున్నారు.

## జనగణనకు మరో ఆరు రోజులు పెంపు

**ప్రజాభూమి ప్రతినిధి - తాళ్లపూడి**

జనగణన కార్యక్రమాన్ని ప్రభుత్వం మరో 6 రోజులు పొడిగించినట్లు తాళ్లపూడి తహసిల్దార్, జనగణన అధికారి లక్ష్మీ లావణ్య పేర్కొన్నారు. ఇప్పటికే గృహాల సంఖ్య ఆధారంగా తాము గుర్తించిన ఎన్యుమరేటర్లు గణన పూర్తి చేసారని జరిగిన జనగణన లో తాళ్లపూడి మండలం లోని జనాభా గతం కంటే తక్కువగా నమోదు అయ్యిందని తెలిపారు. 2011లో జనాభా సంఖ్య 52,785 కాగా, తాజాగా చేసిన సర్వేలో 48,424 గా నమోదు అయ్యిందన్నారు. జనాభా ఎప్పటికప్పుడు పెరుగుతున్న నేపథ్యంలో ఊహకు అందని రీతి లో చాలా తేడా కనిపించిందని అన్నారు. కొన్ని చోట్ల ఆ ఇంట్లో కనబడ్డ జనాభాను మాత్రమే పరిగణలోకి తీసుకున్నట్లు, ఎన్యుమరేటర్లకు పూర్తి సమాచారం తెలపలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని చోట్ల రీ- చెక్ చేస్తారని ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

## మీ కష్టాన్ని మా కష్టంగా భావించి మీకు అండగా నిలుస్తాం

**ప్రజాభూమి ప్రతినిధి - వి.ఆర్.పురం.**

ఆపదలో ఉన్న ప్రతీ ఒక్కరికీ జనసేన పార్టీ తోడుగా ఉండి కష్టంలో పాలుపంచుకొంటుందని, మీ కష్టాన్ని మా కష్టంగా భావించి మీకు అండగా నిలుస్తామని జనసేన పార్టీ అధ్యక్ష కార్యదర్శిలు ములకాల సాయికృష్ణ, వీరమహిళ బాగుల ప్రమీలరాణి స్పష్టంచేశారు. మంగళవారం జీడిగుప్ప పంచాయతీ అదే గ్రామానికి చెందిన 7 నెలల బాలుడు గోవర్ధన్ రెడ్డి తల్లిదండ్రులు ప్రభాకర్, మైథిలీ అనారోగ్యంతో బాధపడుతూ కొత్తగుడెంలోని ఒక ప్రైవేట్ పిల్లల ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. రెక్కాడితే కానీ కడుపు నిండని నిరుపేద కుటుంబం విషయం తెలుసుకున్న జనసేనపార్టీ అధ్యక్షులు ములకాల సాయికృష్ణ, కొంతమంది సహృదయం కలిగిన వాట్సప్ గ్రూప్ సభ్యుల సహకారంతో ఆ నిరుపేద కొండరెడ్డి గిరిజన కుటుంబానికి అండగా నిలిచారు. ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి వైద్య నిపుణులతో ఎప్పటికప్పుడు ఫోన్ ద్వారా



మాట్లాడుతూ ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం సుమారుగా 20 వేల రూపాయల నగదు పంపించి నిరుపేద కుటుంబానికి తోడై నిలిచి, ఆసుపత్రి ఫీజ్ కూడా తగ్గించి మాట్లాడి ఆ కుటుంబానికి దిక్కై నిలిచారు. డిశ్చార్జ్ అయిన తరువాత వారి ఇంటికి వెళ్లి పండ్లు, బట్టలు అందించి పరామర్శించారు. ఈసందర్భంగా జనసేన మండల అధ్యక్షుడు మాట్లాడుతూ కష్టాలు వస్తూ ఉంటాయి కానీ వాటిని ధైర్యం గా ఎదుర్కున్నప్పుడే జీవితం విలువ తెలు స్తుందని, మీకు అన్నీ వేళలా అండగా జనసేన పార్టీ ఉంటుందని, మీకు ఏ అవసరం వచ్చినా సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బాగుల అంజనరావు, యూత్ నాయకులు పెదపెట్ల పవన్ కళ్యాణ్, ఉపాధ్యక్షులు కనుగుల శ్రీనివాస్ రెడ్డి, గోల్కొం డ సాగర్, ముంజపు సాయిరాం, కొత్తూరి శేషు, మనోహర్, మహేష్ జనసైనికులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

- గ్రామాల వైపు కన్నెత్తి చూడని అధికారులు
- మురుగు, తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలతో ప్రజల అవస్థలు

**ప్రజాభూమి ప్రతినిధి - తాళ్లపూడి**

తాళ్లపూడి మండల వ్యాప్తంగా సర్పంచుల పదవీకాలం ముగియడంతో గ్రామ పంచాయతీల పాలనను కొనసాగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించి రెండు నెలలు గడుస్తున్నా, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంలో ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక అధికారికి రెండు నుంచి మూడు పంచాయతీల బాధ్యతలు అప్పగించడంతో గ్రామాలపై పర్యవేక్షణ పూర్తిగా తగ్గిపోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రత్యేక అధికారులు బాధ్యతలు స్వీకరించిన తొలినాళ్లలో గ్రామాలను సందర్శించిపరిస్థితులను తెలుసుకున్నప్పటికీ, అనంతరం గ్రామాల వైపు రావడంలేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో గ్రామాల్లో మౌలిక వసతుల సమస్యలు రోజురోజుకూ పెరిగిపో తున్నాయి.

**మురుగు నీటితో నరకయాతన :** తాళ్లపూడి మండలం తాడిపూడి గ్రామంలో సుబ్రమణ్య స్వామి గుడి ప్రాంగణంలో మురుగు నీరు శుభ్రం చేయకపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. దుర్వాసన, దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ లేక కొందరి ఇళ్లలో వాడుక నీరు నేరుగా రోడ్లపైకి చేరి,అవి మురుగునీరుగా మారడంతో ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుడికి వెళ్లి మనస్ఫూర్తిగా దేవుడికి



దండం పెట్టుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అంధకారంలో గ్రామదేవత :** తాడిపూడి గ్రామంలో వేంచేసిన ముత్యాలమ్మ తల్లి గుడి ప్రాంగణంలో వీధి దీపాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులుకు గురవుతున్నారు. తెల్లవారుజాము సమయంలో అమ్మవారిని దర్శించేందుకు రావాలంటే భయం, భయంగా ఉందని తాడిపూడి గ్రామ ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతం ఒక ప్రక్క వర్షాలు కురవటం, ఇంకో ప్రక్క ఉక్కపోతకు విషసర్పాలు సంచారం అధికంగా ఉండటంతో జనాలు ఆందోళన చెందుతున్నారు. గుడి ప్రాంగణంలోకి రావాలంటే ఎవరికి ఎప్పుడు ఏమి జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంభంధిత అధికారులు స్పందించి అమ్మవారి గుడి ప్రాంగణంలో దీపాలు వెలిగే విధంగా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు పలువురు కోరుతున్నారు.

**తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు :** మండలంలో అనేక గ్రామాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీధి దీపాలు పనిచేయకపోవడం, డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతినడం వంటి సమస్యలు ప్రజల దైనందిన జీవితాన్ని ప్రభావితం చేస్తున్నాయి. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కనిపించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

**లోపించిన పర్యవేక్షణ :** ఏంపీడీవోలు, తహసీల్దార్లు, డిప్యూటీ ఎంపీడీవోలు,ఏఈలు, ఎంఈఓలు, ఏవోలకు ప్రత్యేక అధికారుల బాధ్యతలు అప్పగించారు. అయితే తమ శాఖల పనుల ఒత్తిడితో గ్రామాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించలేక పోతున్నారని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు. ఫలితంగా పంచాయతీల్లో అభివృద్ధి పనులు మందగించడంతో పాటు ప్రజా సమస్యలు పేరుకుపోతున్నాయి. ప్రత్యేక అధికారులు కేవలం పేరుకే ఉన్నారని, గ్రామాల్లో పర్యటించి సమస్యలను ప్రత్యక్షంగా రోడ్లపైకి పొంగిపొర్లుతున్న మురుగునీరు పరిశీలించే పరిస్థితి లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరుతున్నారు.

## ర్యాలిలో జనాభా గణన సర్వేను పరిశీలించిన అధికారులు



**ప్రజాభూమి ప్రతినిధి - కొత్తపేట**

ఆత్రేయపురం మండలం పరిధిలోని ర్యాలి గ్రామంలో కొనసాగుతున్న జనాభా గణన (సెన్సస్) సర్వేను డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి టి.వి. రాజేశ్వరరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ మంగళవారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో గణన సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నమోదు చేస్తున్న సర్వే వివరాలను అధికారులు తనిఖీ చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి కుటుంబాల పూర్తి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. జనాభా గణన ప్రక్రియలో ఎటువంటి లోపాలు చోటుచేసుకోకుండా, ఏ ఇంటి సమాచారం కూడా మిస్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. సర్వేలో నమోదవుతున్న వివరాల నాణ్యత, ఖచ్చితత్వంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న జనాభా గణన కార్యక్రమం భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలకు కీలక ఆధారంగా నిలుస్తుందని, అందువల్ల బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని గణన సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.వి.ఆర్.కె. రాజు, ర్యాలి పంచాయతీ కార్యదర్శి జె. సాయిరాం రెడ్డి, జనాభా గణన సూపర్వైజర్‌తో పాటు ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు. అధికారులు సర్వే నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ, కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు.

## పర్యావరణ పరిరక్షణపై ఎంపీడీవో దృష్టి

**వట్టిగుడిపాడు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ పరిశీలన - ఈదులగూడెంలో పెన్షన్ పంపిణీ తనిఖీ**

**ప్రజాభూమి ప్రతినిధి - ఆగిరిపల్లి**



ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆగిరిపల్లి మండల అభివృద్ధి అధికారి అబ్దుల్ సలాం వట్టిగుడిపాడు గ్రామంలోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం (ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్)ను సందర్శించి పరిశీలించారు. కేంద్రంలో పరిశుభ్రత, వ్యర్థాల సక్రమ నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఈదులగూడెం స్వర్ణ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీ చేసి, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా, సకాలంలో పెన్షన్ల పంపిణీ చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోతో పాటు ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీ మృతి బాధాకరం.. కుటుంబానికి న్యాయం చేయాలి

**కుటుంబ సభ్యులను పరామర్శించిన బండారు సందీప్**

**ప్రజాభూమి ప్రతినిధి - కొత్తపేట**

కొత్తపేట మండలం గంటి గ్రామానికి చెందిన చామకూర హనుమంతరావు ఉపాధి హామీ పథకం పనులకు హాజరైన సమయంలో ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందడం తీవ్ర విషాదకరమని నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం ఉపాధి పనులకు వచ్చిన హనుమంతరావు ఫోటో నమోదు ప్రక్రియ జరుగుతున్న సమయంలో ఒక్కసారిగా అస్వస్థతకు గురై కుప్పకూలాగా, గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిసింది. మృతుడి కుటుంబ సభ్యులను కొత్తపేట నియోజకవర్గ యువ నాయకుడు బండారు సందీప్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హనుమం తరావు మృతి అత్యంత బాధాకరమని, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దృష్టికి విషయం తీసుకెళ్లి అవసరమైన సహాయ సహకారాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రస్తుత ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బలు, వేడి గాల్పుల బారిన పడకుండా వైద్య శాఖ సూచిం చిన జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట



ఏఎంసీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంఠంశెట్టి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్, బూసి భాస్కర్‌రావు, ప్రధాన కార్యదర్శి కడలి భీమేశ్వరరావు, గంటి గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం అందించి అండగా నిలవాలని స్థానిక నాయకులు కోరారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్రం చెలగాటం
# రాష్ట్ర ఓబీసీ కాంగ్రెస్ ధ్వజం

- నీట్ ప్రశ్నపత్రాల లీకేజీపై దేశవ్యాప్త ఆందోళన
- ప్రశ్నాపత్రాల వ్యాపార కేంద్రంగా ఎన్టీఏ
- ప్రధాని మోడీ దేశ యువతకు క్షమాపణ చెప్పాలి

**ప్రజాభూమి బ్యూరో - కృష్ణాజిల్లా**

దేశ యువత కలలను సాకారం చేయాల్సిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, వారి భవిష్యత్తును నాశనం చేసేలా వ్యవహరిస్తోందని రాష్ట్ర ఓబీసీ కాంగ్రెస్ చైర్మన్ తీవ్రంగా విమర్శించారు. దేశవ్యాప్తంగా జరిగిన నీట్ - యూజీ 2026 (చీజుజు ఖ+ 2026) పరీక్షా ప్రశ్నాపత్రాల లీకేజీ కేవలం వ్యవస్థ వైఫల్యం మాత్రమే కాదని, ఇది ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వ పరిపాలనా దివాలాకోరుతనానికి నిదర్శనమని మండిపడ్డారు.

**22 లక్షల మంది జీవితాలతో ఆటలా? :** ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. సుమారు 22 లక్షల మంది విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివి పరీక్ష రాస్తే, పరీక్షా పత్రాలను కాపాడలేని స్థితిలో కేంద్రం ఉందని విమర్శించారు. గుజరాత్ నుంచి బీహార్ వరకు ప్రతి చోటా పేపర్ లీక్ అనే మాటే వినిపిస్తోందని, జాతీయ పరీక్షల సంస్థ (చీూూ)ను ప్రశ్నపత్రాల వ్యాపార కేంద్రంగా మార్చేశారని ఆరోపించారు.

**పేపర్ లీక్ మాఫియా వెనుక ఎవరున్నారు? :** బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ఈ అక్రమాలు ఎక్కువగా ఎందుకు వెలుగు చూస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. ఈ లీకుల వెనుక ఉన్న మాఫియాను ఎవరు కాపాడుతున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. పరీక్షా పే చర్చ చేసే ప్రధాని, పేపర్ లీక్ పే చర్చ ఎందుకు చేయడం లేదని ఎద్దేవా చేశారు.

**డిమాండ్లు :** నీట్ పేపర్ లీక్ ఘటనపై సిట్టింగ్ జడ్జితో స్వతంత్ర న్యాయ విచారణ జరిపించాలి. ప్రధాని మోడీ తక్షణమే దేశ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి. నిరుద్యోగ యువత భవిష్యత్తును దెబ్బతీసే ఇలాంటి కుట్రలపై కఠిన చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల ఆవేదనను కేంద్ర ప్రభుత్వం అణగదొక్కలేదని, యువత పక్షాన కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తుందని ఆయన హెచ్చరించారు. ప్రశ్నపత్రాలను కాపాడలేని స్థితిలో కేంద్ర ప్రభుత్వం. మానసిక వేదన పదేపదే లీకులతో విద్యార్థుల్లో పెరిగిపోతున్న అనిశ్చితి. హెచ్చరిక విద్యార్థుల భవిష్యత్తు కోసం రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి పిలుపు.

# సామర్థ్యం పెంపుతోనే పటిష్ట ఆర్థిక వ్యవస్థ

- ప్రతీ నెలా గణాంకాల సేకరణ-పక్కాగా అంచనాలు
- మండల స్థాయి వరకు ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలు
- ప్రణాళిక శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**ప్రజాభూమి ప్రతినిధి - అమరావతి**

రాష్ట్రాన్ని ఆర్థికంగా మరింత పటిష్ట పరిచేందుకు వ్యవస్థలో సామర్థ్య పెంపు జరగాలని, ఇందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. 15 శాతం వృద్ధి సాధించడం ద్వారా స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలను చేరుకోగలమని, ఇందుకు వేగంగా గణాంకాలను సేకరించాల్సి ఉంటుందన్నారు. ఇందుకోసం రాష్ట్ర స్థాయి నుంచి మండల స్థాయి వరకు సిబ్బందికి 3 నెలల పాటు శిక్షణ ఇవ్వాలని సీఎం ఆదేశించారు. జీఎస్డీపీ అంచనాలను సంప్రదాయ విధానంలో కాకుండా రియల్ టైమ్ మానిటరింగ్ ద్వారా రూపొందించేలా శిక్షణ అందించాలన్నారు. సచివాలయంలో బుధవారం ప్రణాళిక శాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి... త్వరలోనే పూర్తి స్థాయిలో డేటా డ్రివెన్ గవర్నెన్స్‌కు శ్రీకారం చుడతామన్నారు. సమీక్షలో జీఎస్డీపీ కెపాసిటీ బిల్డింగ్, ఏఐ ఆధారిత ఆర్థిక విశ్లేషణ, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న ప్రధాన సర్వేలు, జిల్లా-మండల స్థాయి అధికారులకు శిక్షణ, కేపీఐల ఆడిటింగ్ అనుసంధానం వంటి అంశాలపై అధికారులతో సీఎం చర్చించారు.

**ఏఐ ఆధారిత ఆర్థిక విశ్లేషణ**

ప్రస్తుతం రాష్ట్ర జీఎస్డీపీ అంచనాలు మూడు నెలలకు, ఏడాది కాలానికి రూపొందిస్తున్నారని, దీంతో ఆర్థిక స్థితిగతులపై తక్షణ అవగాహన సాధ్యం కావడం లేదని సీఎం అభిప్రాయపడ్డారు. చారిత్రక డేటాపై ఎక్కువ ఆధారపడటం వల్ల విధాన నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం జరుగుతోందని చెప్పారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక వృద్ధిని ప్రతీ నెలా... ప్రతీ జిల్లాలో, ప్రతీ మండలంలో ట్రాక్ చేయగలిగేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని సీఎం స్పష్టం చేశారు. ఇందుకోసం జీఎస్డీపీ విధానాన్ని అర్థం చేసుకునేలా, అంచనాలు వేగంగా రూపొందించేలా అధికారులకు, ఉద్యోగులకు శిక్షణ ఇవ్వాలన్నారు. మొత్తం 5 జోన్లు, 28 జిల్లాలు, 175 నియోజకవర్గాలను కవర్ చేస్తూ మూడు నెలల పాటు కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లు, జోనల్-జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమాలు, నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్ల తయారీపై దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గం నుంచి ముగ్గురు అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. మరోవైపు వ్యవసాయం, పరిశ్రమలు, సేవారంగాల్లో ఏఐ ఆధారిత ఆర్థిక విశ్లేషణ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నట్టు ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ప్రస్తుతం ట్రాక్ చేయని సూచికలను గుర్తించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సూచించారు.

## శ్రీపద్మావతీ చిన్నపిల్లల ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులు జూలై 31లోపు పూర్తి చేయాలి

**టిటిడి జేఈవో డా. ఎ. శరత్**

**ప్రజాభూమి ప్రతినిధి - తిరుపతి**

తిరుపతిలో నిర్మాణంలో ఉన్న శ్రీపద్మావతీ చిన్నపిల్లల ఆసుపత్రి నూతన భవన నిర్మాణ పనులను టిటిడి ఈవో ఎం. రవిచంద్ర ఆదేశాల మేరకు ఈ ఏడాది జూలై 31వ తేదీ లోపు పూర్తి చేయాలని టిటిడి జేఈవో (వైద్యం ఌ విద్య) డా. ఎ. శరత్ అధికారులను ఆదేశించారు. టిటిడి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయన నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈవో డా. ఎ. శరత్ మాట్లాడుతూ, చిన్నారులకు అత్యాధునిక వైద్య సేవలు అందించే లక్ష్యంతో నిర్మిస్తున్న ఈ నూతన ఆసుపత్రి భవనాన్ని ప్రణాళికాబద్ధంగా, నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి అంతస్తులో ఏర్పాటు చేయనున్న విభాగాలు, గదులు, వైద్య సదుపాయాలు, మౌళిక వసతులు తదితర అంశాలను స్పష్టంగా ప్రతిబింబించేలా నివేదిక సిద్ధం చేయాలన్నారు. అదేవిధంగా ప్రతి ఫ్లోర్‌లోని గదుల వారీగా ఎలక్ట్రికల్, ఎయిర్ కండిషనింగ్, కంప్యూటర్ నెట్‌వర్క్, వైద్య పరికరాలు, వైద్యులు మరియు రోగుల అవసరాలకు అనుగుణంగా కల్పిస్తున్న సౌకర్యాలను లే అవుట్ ప్రణాళికలో పొందుపరచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రెండో అంతస్తులో జరుగుతున్న పనులను పరిశీలించిన ఆయన, ప్రతి గదిలో రోగులకు సౌకర్యవంతమైన వాతావరణం ఉండేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి అంతస్తులో జరుగుతున్న పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తదుపరి శాఖల వారీగా కొనసాగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వ హించిన జేఈవో, ఇంజనీరింగ్ పనుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి డైరెక్టర్ డా. ఎన్. శ్రీనాథ్ రెడ్డి, ఎస్.ఈలు వేంకటే శ్వర్లు, మనోహరం, ఈఈ సుమతి, డిప్యూటీ ఈఈ హర్షవర్ధన్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.